మంగళవారం 11-7-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 110



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



మిస్ నెదర్లాండ్స్‌గా ట్రాన్స్‌జెండర్

ఈ కిరీటాన్ని నెదర్లాండ్స్ చరిత్రలో తొలిసారి ట్రాన్స్‌జెండర్ మహిళ గెలుచుకుంది. -6లో



లక్ష్య సేన్ అదరహో...

కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత ప్లేయర్. -12లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆ బాధ్యత అధికారులదే..

కొన్ని వారాలుగా మణిపూర్‌లో చెలరేగుతున్న హింసను అరికట్టాల్సిన బాధ్యత అధికారులదేనని సుప్రీం స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



'ఆర్డినెన్స్'పై కేంద్రానికి నోటీసు

ఢిల్లీలో పరిపాలనా సర్వీసులను నియంత్రిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసు జారీ చేసింది.

- వివరాలు 6లో



ప్రిగోజిన్‌తో పుతిన్ భేటీ

రష్యాపై తిరుగుబాటు చేసిన ప్రైవేట్ సైన్యం 'వాగ్నర్' అధిపతి ప్రిగోజిన్ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయినట్లు వెల్లడైంది.

- వివరాలు 6లో



చిలీకి వింత వైరస్‌తో చుక్కలు..

దక్షిణ అమెరికా దేశమైన చిలీలో గిలాన్ బరే అనే వింత వ్యాధి బారినపడి జనం అల్లాడుతున్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

మాది పేగు బంధం.. వాళ్లది ఫేక్ బంధం..



సీఎం కేసీఆర్ పక్కనపెట్టేసిన నాయకులే కాంగ్రెస్, బీజేపీలలో చేరుతున్నారని.. అలాంటి రిజెక్టెడ్ లీడర్లను చేర్చుకుని ప్రతిపక్షాలు సంబురపడుతున్నాయని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

- వివరాలు 3లో

గవర్నర్ కోటా చాన్స్ ఎవరికో?



ఖాళీగా ఉన్న రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియపై బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కసరత్తు చేపట్టారు. ఇద్దరి పేర్లను వారంలోనే గవర్నర్ ఆమోదానికి పంపే చాన్స్ ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 2లో

మీ సాయం కోరే చిన్నారులం



ఉపాధ్యాయ దంపతుల బదిలీలను వెంటనే చేపట్టాలంటూ ఇందిరాపార్క్ వద్ద జరిగిన ఆవేదన దీక్ష ఉద్విగ్న వాతావరణంలో సాగింది. 13 జిల్లాల నుంచి ఉపాధ్యాయ దంపతులతోపాటు వారి పిల్లలు, వయోధికులైన వారి తల్లిదండ్రులు కూడా దీక్షకు తరలివచ్చారు.

- వివరాలు 3లో

నగరాలు.. నిండుతున్నాయ్!



తెలంగాణలో ఏటా జనం పట్టణాలు, నగరాలవైపు వలస బాట పడుతున్నారు. దీంతో వచ్చే రెండేళ్లలో రాష్ట్ర జనాభాలో సగానికిపైగా పట్టణాలు, నగరాల్లోనే ఉంటుందని 'నేషనల్ పాపులేషన్ రిపోర్ట్–2023' అంచనా వేసింది.

- వివరాలు 14లో

ఎలక్షన్.. యాక్షన్.. 100 డేస్!

ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధమైన బీజేపీ

పక్కాగా వ్యూహాల రూపకల్పనకు కసరత్తు షురూ

రాష్ట్ర పదాధికారుల భేటీలో కార్యాచరణపై విస్తృత చర్చ

- ప్రతి నియోజకవర్గంలో బహిరంగ సభల నిర్వహణ
- మిషన్-31లో భాగంగా 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లపై ప్రత్యేక ఫోకస్
- నేడు కూడా సమావేశం.. సీనియర్లు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జులకూ ఆహ్వానం
- వంద రోజుల ప్రణాళికలో చేపట్టే కార్యక్రమాల ప్రకటన
- బీఆర్‌ఎస్ సర్కారు విధానాలపై నిరసనలు, ఆందోళనలపై నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ అన్ని అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. కొన్నిరోజులుగా స్తబ్దుగా మారిన పార్టీని తిరిగి పట్టాలెక్కించడం, పార్టీ శ్రేణుల్లో భరోసా నింపడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా.. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను దీటుగా ఎదుర్కోవడంతోపాటు ఎదురుదాడికి దిగాలని.. రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు, నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని తీర్మానించింది. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన పదాధికారుల సమావేశం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ మిగతా 3వ పేజీలో ▶

నేడు కీలక నిర్ణయాలు

పార్టీ వంద రోజుల యాక్షన్ ప్లాన్ కింద చేపట్టబోయే కార్యక్రమాలను, బీఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాలపై చేపట్టాల్సిన ఆందోళనలను ఖరారు చేయడం, పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేయాల్సిన అంశాలపై చర్చించేందుకు మంగళవారం కూడా పదాధికారుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. అయితే ఈ భేటీకి సీనియర్లు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జులను కూడా ఆహ్వానించారు. ఈ భేటీ సందర్భంగా బీఆర్‌ఎస్ సర్కారుపై ఉద్యమ కార్యాచరణ, పార్టీ కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై ఆందోళనలు చేపట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది. పది ఉమ్మడి జిల్లాల పరిధిలో అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పర్యటించేలా కార్యక్రమాలను రూపొందించనున్నట్టు సమాచారం.

తెలంగాణ నుంచి ఒకరు పెద్దల సభకు!

- బీజేపీ అధిష్టానం యోచన
- పరిశీలనలో మురళీధర్ రావు, గరికపాటి మోహన్‌రావు, విజయశాంతి!

2లో



సోమవారం ప్రగతిభవన్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు బృందంతో సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, బోర్డు అధ్యక్షుడు సైపుల్లా రెహ్మానీ, హోం మంత్రి మహమూద్ అలీ

ఉమ్మడి పౌర స్మృతికి వ్యతిరేకం

- ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు బృందంతో భేటీలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ..
- యూసీసీ బిల్లుతో దేశ ప్రజలను విభజించేందుకు కేంద్రం కుయుక్తులు
- ఇలాంటి నిర్ణయాలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తాం
- పార్లమెంటులోనూ ప్రతిఘటిస్తాం
- కృతజ్ఞతలు తెలిపిన బోర్డు

సాక్షి, హైదరాబాద్: దేశాభివృద్ధిని విస్మరించి ఇప్పటికే పలు రకాలుగా ప్రజల నడుమ చిచ్చు పెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్) పేరుతో మరోమారు దేశ ప్రజలను విభజించేందుకు కుయుక్తులు పన్నుతోందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ధ్వజమెత్తారు. విభిన్న ప్రాంతాలు, జాతులు, మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతులు కలిగి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన భారత ప్రజల ఐక్యతను చీల్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తాము నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తామని తేల్చిచెప్పారు. అందులో భాగంగా యూసీసీ బిల్లును వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. యూసీసీ బిల్లుతో దేశంలో ప్రత్యేక సంస్కృతి కలిగిన గిరిజనులు, పలు మతాలు, జాతులు, ప్రాంతాలతో పాటుగా హిందూ మతాన్ని ఆచరించే ప్రజలూ అయోమయానికి లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలీద్ సైపుల్లా రెహ్మానీ ఆధ్వర్యంలో బోర్డు కార్యవర్గం సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమైంది. యూసీసీ బిల్లును వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేసింది. దేశ ప్రజల అస్తిత్వానికి, మిగతా 2వ పేజీలో ▶

అవసరమైతే సీతక్కే సీఎం..

- సీఎం లాంటి పదవులపై ఎన్నికల ముందు ప్రకటన ఉండదు
- ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ 'మీట్ అండ్ గ్రీట్'లో టీపీసీసీ చీఫ్ రేవంత్
- తానా మహాసభల వేదికపైనా ప్రసంగం



మీట్ అండ్ గ్రీట్‌లో మాట్లాడుతున్న రేవంత్. పక్కన సీతక్క

సాక్షి, హైదరాబాద్: 'దళితుడైన మల్లికార్జున ఖర్గేకు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా అవకాశమిచ్చాం. పేదలు, దళితులు, ఆదివాసీల పక్షానే కాంగ్రెస్ పార్టీ ఉంటుంది'అని టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరూ ఆలోచన చేయనప్పుడే ఆ వర్గాల నుంచి వచ్చిన నేతను రాష్ట్రపతిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, భవిష్యత్తులో కూడా వారికి విస్తృత స్థాయిలో అవకాశాలుంటాయని వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ సోమవారం ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని వివరించడంతోపాటు పలువురు ఎన్‌ఆర్‌ఐలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ ఎన్‌ఆర్‌ఐ ఆసక్తికర ప్రశ్న వేశారు. ఎస్సీ, ఎస్టీల పట్ల కాంగ్రెస్ వైఖరి ఎలా ఉంటుంది? మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌లో కమిటీల లొల్లి..

70 మందితో టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ ఏర్పాటుపై అమెరికాలోని పార్టీ శ్రేణుల అసంతృప్తి 2లో

గవర్నర్ వద్ద పెండింగ్ బిల్లులు లేవు

రాజ్‌భవన్ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ వద్ద ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేవని రాజ్‌భవన్ స్పష్టం చేసింది. శాసనసభ, శాసనమండలి ఆమోదించిన తర్వాత గవర్నర్ ఆమోదముద్ర కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బిల్లులన్నింటిని ఇప్పటికే పరిష్కరించినట్టు పునరుద్ఘాటించింది. ఇదివరకు పంపిన మూడు బిల్లులను గవర్నర్ ఆమోదించారని, రెండు బిల్లులను రాష్ట్రపతికి పంపించారని, మిగిలిన బిల్లులను ప్రభుత్వ వివరణ కోరుతూ తిరిగి పంపించారని గుర్తు చేసింది. ఈ మేరకు రాజ్‌భవన్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మళ్లీ సత్సంబంధాలు నెలకొంటున్నాయని, త్వరలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పెండింగ్ బిల్లులను పరిష్కరించనున్నారని ఓ న్యూస్ చానల్‌లో వార్తలు ప్రసారం కావడంతో ఈ వివరణ ఇవ్వాల్సి వచ్చిందని రాజ్‌భవన్ అధికారవర్గాలు తెలిపాయి.



వలంటీర్ల ఆగ్రహ జ్వాల

- పవన్ 'సంఘ విద్రోహ' వ్యాఖ్యలపై ఏపీవ్యాప్తంగా నిరసనలు
- ర్యాలీలు.. పలుచోట్ల దిష్టి బొమ్మలు, ఫొటోలకు నిప్పు

10లో



ఒంగోలులో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్‌లు

సోమవారం భీమవరంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను కాలితో తొక్కి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళా వలంటీర్



ఉత్తరాది అతలాకుతలం

- మూడో రోజూ కొనసాగిన భారీ వర్షాలు
- హిమాచల్‌లో 20కి చేరిన మృతులు
- ప్రమాదస్థాయికి చేరుకున్న యమున
- నేడు కూడా వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ
- హిమాచల్, ఉత్తరాఖండ్ సీఎంలతో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ
- అవసరమైన సాయం అందిస్తామని హామీ

6లో

సోమవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూ జిల్లాలో మహోగ్రంగా ప్రవహిస్తున్న బియాస్ నది

నేను నోరు విప్పితే అంతే..



- ఎమ్మెల్యే రాజయ్య ఫ్యామిలీ ఆత్మహత్య చేసుకోవాలి
- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వ్యాఖ్యలు
- ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నేను ఎస్సీనే
- అవినీతి ఆస్తులు నిరూపిస్తే నియోజకవర్గ దళితులకు రాసిస్తానని ప్రకటన

- వివరాలు 2లో

రేవంత్‌తో కడియం టచ్‌లో ఉన్నారు..



- తనకు ఘన్‌పూర్‌కు, కుమార్తె కావ్యకు వర్ధన్నపేట టికెట్ ఆశిస్తున్నారు
- శ్రీహరి జీవితకాలం మాదిగలకు శత్రువుగానే ఉన్నారు..
- ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మరోసారి ఘాటు విమర్శలు

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



ముందు దీని రిపేరు కాస్త చూడండి సార్!

నైరుతి వాన.. 30శాతం లోటే!

- కురవాల్సిన వర్షం 19.19 సెంటీమీటర్లు.. పడింది 13.49 సెంటీమీటర్లే..
- రాష్ట్రంలో మూడింట రెండొంతుల జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- వానాకాలం మొదలై నెలన్నర కావస్తున్నా దక్షిణ జిల్లాల్లో జాడలేని వర్షాలు
- ఈసారి వర్షాలు సాధారణం కంటే తక్కువే!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కలవరపెడుతున్నాయి. వానాకాలం మొదలై దాదాపు నెలన్నర కావొస్తున్నా, నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి మూడు వారాలు దాటినా ఎక్కడా సరైన వర్షపాతం నమోదు కాలేదు. జూన్‌లో వానల జాడే లేక పోగా.. జులైలో అక్కడక్కడా చిరుజల్లులు, మోస్తరు వానలు మాత్రమే కురుస్తున్నాయి. భారీ వర్షాల ఊసే లేదు. దీనితో పంటల సాగుకు అదును దాటిపోతుండగా.. సీజన్‌పై ఆధారపడ్డ ఇతర రంగాలు కూడా వర్షాల కోసం ఎదురు చూస్తున్నాయి. గత మూడేళ్లుగా సమృద్ధిగా వానలు పడ్డాయని.. కానీ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొందని, ఇది కరువు తరహా పరిస్థితులకు సంకేతమని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైన నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించింది. వ్యవసాయం, మిగతా 5వ పేజీలో ▶

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం భట్టుగూడెంలో సరిగా మొలవని పత్తి చేను



క్లుప్తంగా...

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ 'మహిళా డిక్లరేషన్'

- ప్రియాంక హాజరయ్యే సభలో జూపల్లితో సహా పలువురు కాంగ్రెస్‌లోకి
- ఈనెల 12న గాంధీభవన్‌లో 'సత్యాగ్రహ దీక్ష': మాజీ ఎంపీ మల్లురవి



సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఈనెల 20వ తేదీన జరిగే భారీ బహిరంగ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ 'మహిళా డిక్లరేషన్'ను ప్రకటిస్తారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి తెలిపారు. ఈ సభలో మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్ రెడ్డి, వనపర్తి ఎంపీపీ మేఘారెడ్డి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరతారని ఆయన చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ కొల్లాపూర్ సభలో పలువురు బీజేపీ నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరతారని, అయితే ఆ పేర్లు ఇప్పుడే చెప్పబోమని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 100కు పైగా స్థానాల్లో గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. అలాగే జాతీయ స్థాయిలో 200 లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్ పార్టీకి వస్తాయని, మరో 100 స్థానాలు గెలిచే మిత్రపక్షాలతో కలసి తామే కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇక, రాహుల్ గాంధీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత వైఖరికి నిరసనగా ఈనెల 12వ తేదీన 'సత్యాగ్రహ దీక్ష'చేపట్టనున్నట్టు వెల్లడించారు.


సామాజిక న్యాయం కోసం అవసరమైతే పదవీ త్యాగం

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, యాదాద్రి: పార్టీ టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం కోసం తాను పదవీ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన వార్డు సభ్యురాలు గుండ్లపల్లి వాణి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక తరహాలో వచ్చే ఎన్నికల్లో సామాజికపరంగా టికెట్ల కేటాయింపు ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ నాయకులంతా విభేదాలు వీడి పార్టీ గెలుపు కోసం కలసికట్టుగా పనిచేయాలన్నారు. సీనియర్ అయిన తనకు పీసీసీ అధ్యక్ష పదవి రాలేదని కొంత కాలం బాధపడ్డానని, తెలంగాణలో పార్టీ విజయం కోసం రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్కలతో కలిసి పనిచేస్తున్నానన్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ప్రతి పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు బీసీలకు కేటాయించాలని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ సమక్షంలో చెప్పినట్లు తెలిపారు. 45 రోజుల్లో ఈ ప్రభుత్వం రద్దు అవుతుందని, తెలంగాణలో మన ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. అధికారంలోకి వస్తే అందరికీ పదవు లు ఇప్పించే బాధ్యతలను తాను తీసుకుంటానన్నారు.

పేరు గొప్ప, ఊరు దిబ్బలా కాళేశ్వరం: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: కష్టమొస్తేనే కాళేశ్వరం విలువ తెలుస్తుందని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలకు, వాస్తవంగా ప్రాజెక్టు పరిస్థితికి పొంతనే లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. సోమవారం ఆమె ట్విట్టర్ వేదికగా కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు. 'ఊరు గొప్ప, పేరు దిబ్బ లెక్కుంది.. దొర గారి డ్రీమ్ ప్రాజెక్ట్ కాళేశ్వరం దుస్థితి'అని మండిపడ్డారు. ఎగువ నుంచి వరద నీరు పోటెత్తుతున్నా.. ఎత్తిపోయాల్సిన బాహుబలి మోటార్లు దొర లెక్కనే నిద్రపోతున్నాయంటూ ధ్వజమెత్తారు. '17 మోటార్లకు పట్టుమని పది మోటార్లు కూడా నడుస్తలేవు.. ఇదేనా దొర సాధించిన జలకళ'అని నిలదీశారు. వర్షాలు లేకున్నా కోటి ఎకరాల మాగాణికి సాగునీరు అందిస్తామని చెప్పారని, ఇప్పుడేమో నార్లు పోసేందుకు కూడా చుక్క నీరు లేదని విచారం వ్యక్తంచేశారు. రైతు పండించే పంటకు వచ్చే లాభం కన్నా.. కాళేశ్వరంపై పెట్టే ఖర్చే తడిసిమోపెడవుతోందన్నారు. ఒక్క తడికి సాగునీరు పారాలంటే ఎకరాకు రూ.46 వేల ఖర్చవుతుందన్నారు.

బీజేపీని వీడను: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: పార్టీ మారుతున్నట్టుగా తనపై జరుగుతున్న ప్రచారాన్ని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఖండించారు. ఒక వర్గం వారు పనిగట్టుకుని దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని, తాను బీజేపీని వీడి ఏ పార్టీలోకి కూడా వెళ్లడంలేదని స్పష్టం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నూతన అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని కలిసి ఇదే విషయాన్ని తెలియజేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

గవర్నర్ కోటా చాన్స్ ఎవరికో..?

రెండు ఎమ్మెల్సీ ఖాళీల భర్తీపై సీఎం కేసీఆర్ కసరత్తు

- రేసులో 20 మంది వరకు ఆశావహులు
- మళ్లీ తమకే అవకాశం ఇవ్వాలంటున్న ఫారూఖ్, రాజేశ్వర్
- పరిశీలనలో ఘంటా చక్రపాణి, దాసోజు తదితరుల పేర్లు
- వారం రోజుల్లో గవర్నర్‌కు ప్రతిపాదనలు!



సాక్షి, హైదరాబాద్: సుమారు నెలన్నరకు పైగా ఖాళీగా ఉన్న రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి సంబంధించిన ప్రక్రియపై బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు కసరత్తు చేపట్టారు. అభ్యర్థులను ఖరారు చేసి ప్రతిపాదనలు పంపడంపై దృష్టి సారించారు. ఇద్దరి పేర్లను వారం రోజుల్లోనే గవర్నర్ ఆమోదానికి పంపే అవకాశ ముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది మే 27న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా పనిచేసిన ఫారూఖ్ హుస్సేన్, డి.రాజేశ్వర్ ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. వీరి స్థానంలో ఎవరినీ నామినేట్ చేయకపోవడంతో సుమారు నెలన్నర రోజులుగా ఈ రెండు పదవులు ఖాళీగా ఉన్నాయి.

భారీ సంఖ్యలో ఆశావహులు

మైనార్టీ వర్గానికి చెందిన ఫారూఖ్ హుస్సేన్, డి.రాజేశ్వర్ ఇద్దరూ తమకు మరోమారు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన రాయిడిన్ రోచ్.. తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పలు సంఘాలు చేసిన తీర్మానాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. వీరితో సుమారు 20 మంది నేతలు ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తుండగా పలువురి పేర్లు ముఖ్యమంత్రి పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, దాసోజు శ్రవణ్, పీఎల్ శ్రీనివాస్ తదితరుల పేర్లకు సంబంధించి వడపోత జరుగుతున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. 40 మంది సభ్యులున్న శాసనమండలిలో ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలను మినహాయిస్తే ఇప్పట్లో ఇతర కోటాల్లో ఖాళీలు ఏర్పడే అవకాశం లేదు. సుమారు మూడొంతులకు పైగా మండలి సభ్యులు 2027 నుంచి 2029 మధ్యకాలంలో ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకోనున్నారు. వచ్చే ఏడాది ఒక్క ఖాళీ కూడా ఏర్పడే అవకాశం లేకపోగా, 2025లో మాత్రం కేవలం ఇద్దరు ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్, టి.జీవన్‌రెడ్డి పదవీ విరమణ చేస్తారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు గట్టి పోటీ నెలకొందని, ఈ కారణంగానే సీఎం కేసీఆర్ వీటి భర్తీ విషయంలో నెలన్నర రోజులుగా తాత్సారం చేస్తున్నట్లు చెబుతున్నారు.

త్వరలో మండలికి కూచుకుళ్ల గుడ్‌బై!

బీఆర్ఎస్ నాయకత్వంపై కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి త్వరలో పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. కూచుకుళ్ల కుమారుడు నాగర్‌కర్నూల్ అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తుండటం, సిట్టింగ్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో విభేదాల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. కూచుకుళ్ల కుమారుడు ఇప్పటికే రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, ఈనెల 20న కొల్లాపూర్‌లో జరిగే ప్రియాంకాగాంధీ సభలో ఆయన కూడా చేరనున్నారు. ప్రస్తుతం అమెరికా నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఆయనతో చర్చించి ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని కూచుకుళ్ల భావిస్తున్నట్టు తెలిసింది. అదే జరిగితే ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు ఈ ఏడాది చివర్లో కాని, వచ్చే ఏడాది ప్రారంభంలో కానీ ఈ ఖాళీ భర్తీకి ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది.

రేవంత్‌తో కడియం టచ్‌లో ఉన్నారు

- ఆయన ఘన్‌పూర్, కుమార్తె కావ్య వర్ధన్నపేట టికెట్ ఆశిస్తున్నారు
- శ్రీహరి జీవితకాలం మాదిగలకు శత్రువుగానే..
- ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మరోసారి ఘాటు విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నాడు.. తనకు స్టేషన్‌ఘన్‌పూర్, కుమార్తె కావ్యకు వర్ధన్నపేట అసెంబ్లీ నుంచి టికెట్లు ఆశిస్తున్నాడని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఎంపీటీసీలకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేవాదుల సృష్టికర్త కడియం అంటూ ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి కడియం శ్రీహరి ఆగమేఘాల మీద హెలికాప్టర్‌లో వెళ్లి దేవాదులకు శంకుస్థాపన చేశారని, కానీ 18 నెలలైనా తట్టమట్టి తీయకపోతే కాంగ్రెస్ పార్టీ నుంచి మేము అక్కడ పిండాలు పెట్టి నిరసన చేపట్టామని గుర్తు చేశారు. అనంతరం మహానేత, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దేవాదుల పనులు ప్రారంభించారని, పనులు పూర్తి కాకపోతే అపర భగీరథుడు సీఎం కేసీఆర్ దేవాదులకు రీడిజైనింగ్ చేసి పనులు పూర్తి చేశారని వివరించారు.

శ్రీహరి దళితులను శత్రువుల్లా చూస్తారు..

దళితులను కడియం శ్రీహరి శత్రువుల్లా చూస్తారని, 14 ఏళ్లు మంత్రిగా పనిచేసిన కడియం ఏ ఒక్క దళితుడినైనా రాజకీయంగా ఎదగనిచ్చారా అని రాజయ్య ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తన ఎదుగుదలను, ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎంపీ పసునూరి దయాకర్ ఎదుగుదలను కడియం ఓర్చుకోవడం లేదని, రాచిరంపాన పెడుతున్నాడని ఆరోపించారు. శ్రీహరి అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్ అనుభవిస్తున్నారని, ఆయన తల్లి పద్మశాలి.. తండ్రి బైండ్ల అని, కడియం కులమేదో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కడియంపై ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలు పోరాడాలని కోరారు. దండోరా ఉద్యమాన్ని రెండుగా చేశారని ధ్వజమెత్తారు. ప్రజలు లింగంపల్లి ప్రాజెక్టు కోరుకుంటే ప్రాజెక్టు పూర్తి కాలేదు గాని కాంట్రాక్టర్ ఇచ్చిన డబ్బులతో కడియం ఇల్లు కట్టుకున్నారని ఆరోపించారు. కడియం అవినీతి చిట్టా మొత్తం ఉందని, త్వరలో అన్నీ బయటపెడతానని రాజయ్య హెచ్చరించారు.

ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకం

▶ మొదటి పేజీ తరువాయి

వారి తరతరాల సాంప్రదాయ, సాంస్కృతిక ఆచార వ్యవహారాలకు గొడ్డలిపెట్టుగా కేంద్ర ప్రభుత్వం మారిందని ఆరోపించింది. ఈ సమావేశంలో ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, మంత్రులు మహమూద్ అలీ, కె.తారకరామారావు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తాం...

'కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న యూసీసీ దురుద్దేశంతో కూడుకున్నదని స్పష్టమవుతోంది. దేశంలో ఎన్నో పరిష్కరించాల్సిన సమస్యలున్నా పట్టించుకోకుండా, బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా దేశ ప్రజల అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించింది. ప్రజలను రెచ్చగొట్టి అనవసరమైన గొడవలు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకే యూసీసీ అంటూ మరోసారి విభజన రాజకీయాలకు పాల్పడుతోంది. అందుకే యూసీసీ బిల్లును వ్యతిరేకిస్తున్నాం'అని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని ప్రకటించారు. భావ సారూప్యత కలిగిన పార్టీలను కలుపుకొని బిల్లుపై పోరాడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి పార్లమెంటు ఉభయ సభల్లో చేపట్టే కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకోవాలని పార్లమెంటరీ పార్టీ నేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వర్‌రావుకు సూచించారు. కాగా తమ అభ్యర్థనను అర్థం చేసుకుని ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నందుకు గాను సీఎం కేసీఆర్‌కు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ధన్యవాదాలు తెలిపింది.

ఏపీ సీఎంకు కూడా విజ్ఞప్తి చేస్తాం: అసదుద్దీన్

ఉమ్మడి పౌర స్మృతి వస్తే అన్ని వర్గాలకూ నష్టం జరుగుతుందని మజ్లిస్ అధినేత, అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ముస్లింలు, గిరిజనులతో పాటు హిందూవులకు కూడా మంచిది కాదని చెప్పారు. హిందూ వివాహ చట్టం రద్దు అవుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్‌తో భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ లౌకికవాదాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఒవైసీ ఆరోపించారు. గత పదేళ్లుగా తెలంగాణ ప్రశాంతంగా ఉందని, ఈ పరిస్థితుల్లో కేంద్రం యూసీసీ బిల్లు తెస్తే వ్యతిరేకించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఏపీ సీఎంకు కూడా ఈ మేరకు విజ్ఞప్తి చేస్తామని చెప్పారు.

హైకోర్టుకు హాజరైన బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ హైకోర్టుకు హాజరయ్యారు. గత విచారణ సందర్భంగా పిటిషనర్ సాక్ష్యం రికార్డు చేయాలని న్యాయమూర్తి ఆదేశించడంతో.. బండి సంజయ్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సాక్ష్యాన్ని న్యాయమూర్తి రికార్డు చేశారు. తదుపరి విచారణను జూలై 21వ తేదీకి వాయిదా వేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున గంగుల కమలాకర్ దాదాపు 14 వేల మెజారిటీతో విజయం సాధించారు. అయితే గంగుల పలు అవకతవకలకు పాల్పడ్డారని, ఆయన ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ ఆఫీసర్ ఇచ్చిన ప్రకటనను కొట్టివేసి, తను ఎన్నికైనట్లు ప్రకటించాలని కోరుతూ బండి సంజయ్ 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ చిల్లకూర్ సుమలత సోమవారం విచారణ చేపట్టారు.

నేను నోరు విప్పితే అంతే.. ఎమ్మెల్యే రాజయ్య కుటుంబం

ఆత్మహత్య చేసుకోవాలి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వ్యాఖ్యలు
- ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నేను ఎస్సీనే
- అవినీతి ఆస్తులు నిరూపిస్తే నియోజకవర్గ దళితులకు రాసిస్తానని ప్రకటన



విలేకరులతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్యే రాజయ్య నా కుటుంబం గురించి, నా తల్లి, నా బిడ్డ గురించి సభ్యత, సంస్కారం లేకుండా అడ్డగోలుగా మాట్లాడారు.. నేను నోరు విప్పితే ఆయన కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తీవ్రంగా స్పందించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తల్లి అనేది సత్యం.. తండ్రి అనేది అపోహ అంటూ నా తల్లిదండ్రులను ఉద్దేశిస్తూ రాజయ్య చేసిన వ్యాఖ్యలు సమాజంలో ఉన్న ప్రతి తల్లిని, కుటుంబ వ్యవస్థను అవమానించేలా ఉన్నాయని, ఇందుకు రాజయ్య ముక్కు నేలకు రాసి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ''అవును నాతల్లి బీసీ, తండ్రి ఎస్సీ, సుప్రీంకోర్టు తీర్పు, చట్టం ప్రకారం నేను ఎస్సీ, నా బిడ్డ ఎస్సీ. నాబిడ్డ మతాంతర వివాహం చేసుకుంటే ఆమెకు పుట్టే పిల్లలకు తండ్రి మతం, కులం వర్తిస్తుంది' అని చెప్పారు.

1994కు ముందు ఎన్‌కౌంటర్లు జరగలేదా...

తనను ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అంటూ రాజయ్య వ్యాఖ్యలు చేశారని, రాష్ట్రంలో 1994కు ముందు ఎన్‌కౌంటర్లు జరగలేదా అని కడియం ప్రశ్నించారు. అధిక ఎన్‌కౌంటర్లు 2004–14 మధ్యలో జరిగాయని, అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నక్సలైట్లను చర్చలకు పిలిచిన విషయాన్ని గుర్తుకు చేశారు. 2004 నుంచి 2012 వరకు రాజయ్య కాంగ్రెస్‌లో ఉన్నాడని, ఆ సమయంలో జరిగిన ఎన్‌కౌంటర్లకు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు.

వేల కోట్ల ఆస్తులు నిరూపిస్తే దళితులకు రాసిస్తా..

రాజయ్య ఆరోపిస్తున్న విధంగా వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని నిరూపిస్తే.. వాటిని నియోజకవర్గ దళితులకు రాసిస్తా అని కడియం అన్నారు. నియోజకవర్గంలో పనులు ఇస్తానని, పదవులు ఇస్తానని ఏ ఒక్కరివద్ద డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని వదిలేసి పోటీనుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలు పుస్తెలు, ఇండ్లు, వ్యవసాయ భూములు కుదువపెట్టి డబ్బులు ఇచ్చారని, సమయం వస్తే బాధితులతో కలిసి ప్రెస్‌మీట్ పెట్టి రాజయ్య బండారం బయటపెడతానని హెచ్చరించారు. నీ చేష్టలు, మాటలు అన్నీ పార్టీ అధిష్టానం చూస్తోందని.. త్వరలోనే శిశుపాలుడి వధ జరుగుతుందని కడియం వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఎవ్వరికి టికెట్ ఇచ్చినా నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేసేలా కృషి చేస్తానన్నారు.

తెలంగాణ నుంచి ఒకరు పెద్దల సభకు!

- బీజేపీ అధిష్టానం యోచన
- పరిశీలనలో గరికపాటి మోహన్‌రావు, మురళీధర్ రావు, విజయశాంతి!
- 10 రాజ్యసభ స్థానాలకు ఈ నెల 24న ఎన్నిక
- పశ్చిమబెంగాల్, గుజరాత్, గోవాకు సంబంధించి ఖాళీలు

సాక్షి, న్యూఢిల్లీ: గుజరాత్, పశ్చిమబెంగాల్, గోవా రాష్ట్రాలకు సంబంధించి మొత్తం 10 రాజ్యసభ స్థానాలకు జరుగనున్న ఎన్నికలపై బీజేపీ కసరత్తు ముమ్మరం చేసింది. ఆపరేషన్ దక్షిణ్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ 10 స్థానాల్లో తెలంగాణకు చెందిన ఒక నాయకుడికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. రాష్ట్రంలో పార్టీ బలపడేందుకు ఇది ఉపకరిస్తుందని భావిస్తోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్‌లు ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర నేతలతో నిర్వహించిన సమావేశంలో దీనిపై చర్చించారు. ఇప్పటికే పార్టీ సీనియర్ నాయకుడు కె.లక్ష్మణ్‌ను యూపీ నుంచి రాజ్యసభకు పంపిన బీజేపీ అధిష్టానం.. తెలంగాణ నుంచి పార్టీ సీనియర్ నాయకులు మురళీధర్ రావు, గరికపాటి మోహన్‌రావు, విజయశాంతిల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం.

గుజరాత్ నుంచి ఇప్పటికే జైశంకర్..

గుజరాత్, పశ్చిమ బెంగాల్, గోవాలకు సంబంధించిన 10 మంది సభ్యులు జూలై 28 నుంచి ఆగస్టు 18 మధ్య ఆరేళ్ల పదవీకాలం పూర్తి చేసుకోనున్నారు. టీఎంసీ ఎంపీలు డెరెక్ ఒబ్రెయిన్, డోలా సేన్, సుస్మితా దేవ్, శాంత ఛెత్రి, సుఖేందు శేఖర్ రే, కాంగ్రెస్ సభ్యుడు ప్రదీప్ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్) ఆగస్టు 18న పదవీ విరమణ చేయనున్నారు. బీజేపీ ఎంపీలైన కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, దినేష్ జెమల్భాయ్ అనవాడియా, లోఖండ్‌వాలా జుగల్ సింగ్ మాథుర్జీ (గుజరాత్)ల పదవీ కాలం కూడా ఆగస్టు 18తో ముగుస్తుంది. గోవా నుంచి బీజేపీ ఎంపీ వినయ్.డి.టెండూల్కర్ పదవీ కాలం ఈ నెల 28న ముగియనుంది. గుజరాత్‌కు సంబంధించిన మూడు రాజ్యసభ స్థానాలకు గాను విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను ఇప్పటికే బీజేపీ నామినేట్ చేయగా సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. మరో రెండు స్థానాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నెల 24 న మొత్తం 10 స్థానాలకు ఎన్నికలు జరగనుండగా నామినేషన్ల దాఖలుకు ఈ నెల 13 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ జూలై 17గా కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

బీజేపీ నేతలకు కేంద్ర భద్రత

ఈటలకు వై ప్లస్, అరవింద్‌కు వై కేటగిరీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో ఇద్దరు కీలక నేతలకు కేంద్ర ప్రభుత్వం భద్రత పెంచింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వై ప్లస్ కేటగిరీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వై కేటగిరీ భద్రతను కల్పించినట్టు సమాచారం. ఈ ఇద్దరికీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు కేటాయించారు. వై ప్లస్ కేటగిరీ భద్రతలో ఇద్దరు నుంచి నలుగురు కమాండోలు, తొమ్మిది మంది సాయుధ సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తారు. వై కేటగిరీలో ఎనిమిది మంది సాయుధ సిబ్బంది, ఒకరు లేదా ఇద్దరు కమాండోలు ఉంటారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తనను చంపించేందుకు రూ. 20 కోట్ల సుపారీ ఇచ్చినట్లుగా తనకు సమాచారం ఉందని ఈటల రాజేందర్, ఆయన భార్య జమున ఇటీవల ఆరోపించడం, ఈటల రాజేందర్‌కు భద్రత పెంపుపై సమీక్షించాలని డీజీపీ అంజన్ కుమార్‌కు మంత్రి కేటీఆర్ సూచించిన విషయం తెలిసిందే. కాగా, తనకు సెక్యూరిటీ కావాలని కోరలేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. గతంలో తనపై, తన నివాసంపై దాడులు జరిగిన నేపథ్యంలో ఆయా అంశాలపై విశ్లేషించేందుకు అధికారులు తమ నివాసానికి వచ్చారని, దాడులకు సంబంధించి వివరాలను, జరిగిన తీరును వారికి తెలియజేశానని, సెక్యూరిటీ విషయమై తనకేమీ తెలియదని పార్టీ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో కమిటీల లొల్లి

- 70 మందితో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్
- తెలుగుదేశం ఎన్ఆర్ఐ సెల్‌ను ప్రకటించినట్టుంది... ప్రవాస తెలంగాణ కాంగ్రెస్ వాదుల అసంతృప్తి
- మండల కమిటీలపైనా కొనసాగుతున్న నిరసనలు


సాక్షి, హైదరాబాద్: ఓవైపు పార్టీ మండల కమిటీల ఏర్పాటు గొడవ జరుగుతుండగానే, తెలంగాణ కాంగ్రెస్‌లో మరో లొల్లి మొదలైంది. అది ఈసారి ఏకంగా అమెరికాకు పాకింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉండగానే 70 మందితో ఎన్ఆర్ఐసెల్–యూఎస్ఏను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో కోర్ కమిటీ, ఎగ్జిక్యూటివ్, మహిళా, అడ్వైజరీ, యూత్, సోషల్ మీడియా, కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు కెంటకీ, మసాచుసెట్స్, న్యూజెర్సీ, పెన్సిల్వేనియా, వర్జీనియా, టెక్సాస్, ఆర్కన్సాస్, నార్త్ కరోలినా, జార్జియా, అలబామా, కాలిఫోర్నియా, ఆరిజోనా, వాషింగ్టన్, కనాస్, డెలవేర్ రాష్ట్రాలకు ఇంచార్జులను నియమించారు. అయితే, ఈ కమిటీల ఏర్పాటుపై అమెరికాలోని తెలంగాణ కాంగ్రెస్ అభిమానులు, పార్టీకి చాలా కాలంగా సానుభూతిపరులుగా ఉన్న పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'టీపీసీసీ ప్రకటించిన ఎన్ఆర్ఐసెల్.. తెలంగాణ కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్‌లా లేదు. తెలంగాణ తెలుగుదేశం ఎన్ఆర్ఐ సెల్‌లా ఉంది'అంటూ స్రవంత్ పోరెడ్డి అనే ప్రవాస తెలంగాణ వాసి సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను విడుదల చేయడం చర్చనీయాంశమవుతోంది. 'రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్‌లో చేరి, ఆయనతో తిరుగుతున్నవారికే ప్రాధాన్యం ఇచ్చారు. కాంగ్రెస్ వల్ల ప్రజలకు ఎలాంటి లాభం కలుగుతుందనే అభిప్రాయాన్ని కలగజేసే శక్తి ఎన్ఆర్ఐలకు ఉంటుంది. మీరు ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ సెల్‌లో ఎవరైనా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయగలిగిన వారున్నారా? జై బాలయ్య, జై రేవంత్‌రెడ్డి అనే వారికే కమిటీల్లో ప్రాధాన్యం కల్పించారు. దీని వల్ల ఏం ఉపయోగం లేదు. మేం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తాం. ఇండియన్ నేషనల్ ఓవర్సీస్ కాంగ్రెస్‌లో ఉంటాం. మా పేర్లు తీసేయండి. మమ్మల్ని అడగకుండా మా పేర్లు పెట్టకండి. మీరు ఏమైనా చేసుకోండి.'అంటూ వీడియోలో ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కారు.

కామారెడ్డి నేతల నిరసన..

కాగా, ఇటీవల ఏర్పాటు చేసిన కాంగ్రెస్ మండల కమిటీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ గాంధీభవన్‌కు జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తల రాక కొనసాగుతోంది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నంవరకు కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు గాంధీభవన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేసి పాత కమిటీలనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ మల్లు రవి వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

రాష్ట్రంలో మిగిలేది రెండు పార్టీలే

- అధికార బీఆర్ఎస్ ఓవైపు.. ప్రత్యామ్నాయ కాంగ్రెస్ మరోవైపు: పొంగులేటి
- రాష్ట్రానికి పట్టిన శని కేసీఆర్‌ను ఇంటికి పంపించడమే మా ప్రధాన ఎజెండా
- బీఆర్ఎస్‌కు చెందిన డబుల్ డిజిట్ నేతలు మాతో టచ్‌లో ఉన్నారు
- ఈనెలాఖరు తర్వాత కాంగ్రెస్‌లోకి ప్రవాహం మొదలవుతుందని వెల్లడి
- హైదరాబాద్‌లో భట్టి విక్రమార్కతో భేటీ.. తాజా రాజకీయాలపై చర్చ
- భట్టి నివాసానికి వచ్చిన మాజీ మంత్రి జూపల్లి.. కొల్లాపూర్ సభపై సమాలోచనలు



భట్టి విక్రమార్కతో భేటీ అయిన పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో రెండే పార్టీలు మిగులుతాయని.. అధికార బీఆర్ఎస్ ఒకవైపు, కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయమనే ప్రజల అభిప్రాయం మరోవైపు ఉన్నాయని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలో బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున వలసలు ఉంటాయని చెప్పారు. పొంగులేటి పలువురు ఖమ్మం జిల్లా నేతలతో కలసి సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నివాసానికి వచ్చారు. ఇరువురు నేతలు జిల్లా రాజకీయాలు, రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. తర్వాత పొంగులేటి మీడియాతో మాట్లాడారు. ''కాంగ్రెస్ నేతలు ఎవరు సమావేశమైనా, ఎప్పుడు సమావేశమైనా ఒకటే ఎజెండా ఉంటుంది. తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న విధంగా రాష్ట్రానికి పట్టిన శని కేసీఆర్‌ను ఇంటికి పంపించాలన్నదే మా ప్రధాన ఎజెండా. మా ఆలోచన, ఆశయం కేసీఆర్‌ను ఇంటికి పంపడమే. బీఆర్ఎస్‌లో పెద్ద స్థాయిలో ఉన్న నాయకులు కూడా మాతో టచ్‌లో ఉన్నారు. ఈ నెలాఖరు తర్వాత ఆ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వలసల ప్రవాహం మొదలవుతుంది.''అని పొంగులేటి చెప్పారు. ప్రధాని మోదీ పర్యటనను బహిష్కరించినట్టు బీఆర్ఎస్ నటిస్తోందని, ఆ నటన ఏదో ఒకరోజు బయటికి వస్తుందని పేర్కొన్నారు. తాను ఏపీకి వెళ్లినప్పుడు సీఎం వైఎస్ జగన్‌ను కలవలేదని, తన వ్యాపార అంశాలకు సంబంధించి సీఎంవోలోని సీనియర్ అధికారులను కలిశానని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణపై ఆసక్తి లేదని వైఎస్ జగన్ గతంలోనే స్పష్టత ఇచ్చారని చెప్పారు.

బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో పడేస్తాం: భట్టి

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో పడేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నదే తమ లక్ష్యమని, ప్రజల అభిప్రాయం కూడా అదేనని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. చాలా రోజుల పాటు పాదయాత్ర చేసినందున కొన్ని ఆరోగ్య సమస్యల నేపథ్యంలో విశ్రాంతి తీసుకుంటున్నానని.. త్వరలో టీపీసీసీ నేతలతో సమావేశమై పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యల గురించి వెల్లడిస్తానని, పార్టీ అధిష్టానానికి కూడా వివరిస్తానని తెలిపారు. పీపుల్స్ మార్చ్ యాత్ర సందర్భంగా గుర్తించిన సమస్యలకు పరిష్కారాలు చూపే దిశలో ఎన్నికల ఎజెండాను సిద్ధం చేస్తామన్నారు.

చేరికల జాబితా పెద్దదే..

సోమవారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా భట్టి నివాసానికి వచ్చి కలిశారు. జూపల్లి తనను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చారని, పార్టీలో చేరుతున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభపై చర్చించామని భట్టి తెలిపారు. సభకు రావాలని తనను ఆహ్వానించారన్నారు. జూపల్లితోపాటు పార్టీలో చేరే వారి జాబితా పెద్దదిగానే ఉంటుందని, ప్రతి చోటా భారీ బహిరంగ సభ నిర్వహించాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు.

అవసరమైతే సీతక్కే సీఎం..

▶ మొదటి పేజీ తరువాయి


ఎస్సీల నుంచి భట్టివిక్రమార్కను సీఎంగా ప్రతిపాదిస్తున్నారు. ఎస్టీల నుంచి సీతక్కకు కనీసం ఉపముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన రేవంత్.. కాంగ్రెస్ నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ముగ్గురు సీఎంలు ఓబీసీలేనని చెప్పారు. పేదలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పక్షాన పార్టీకి స్పష్టమైన విధానం ఉందని చెప్పారు. అయితే, ఫలానా పోస్టుకు ఫలానా నేతను ఎంపిక చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పదని స్పష్టం చేశారు. సీతక్కకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్న ఎన్ఆర్ఐల సూచనను పార్టీ వేదికల మీద చర్చిస్తామని, అవసరమనుకుంటే సందర్భాన్ని బట్టి సీతక్క సీఎం కూడా అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

మనం కలసికట్టుగా అభివృద్ధి చెందాలి

మీట్ అండ్ గ్రీట్‌లో భాగంగా రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు వేర్వేరనే భావనను రానీయవద్దని పిలుపునిచ్చారు. 'తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వేరు కాదు. అభివృద్ధిలో మనం అమెరికాతో పోటీ పడాలి. ఏపీ, తెలంగాణ కలసికట్టుగా మన ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటేనే ప్రపంచంతో పోటీపడతాం'అని వ్యాఖ్యానించారు. అంతకుముందు తానా మహాసభల్లోనూ రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తానా ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ప్రవాస తెలంగాణీయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఇక అప్పు పుట్టడం కష్టమే!

- లోన్ దరఖాస్తులను బ్యాంకులకు పంపొద్దని యూనిట్ అధికారులకు ఆర్టీసీ ఆదేశం
- దీంతో కార్మికులకు రుణాలు అందని పరిస్థితి
- ఇప్పటికే సీసీఎస్ నిర్వీర్యంతో లోన్లు దొరక్క తిప్పలు
- ఆర్టీసీ ఆదేశంపై కార్మికుల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్

'ఆర్టీసీ ఉద్యోగులు రుణం కోసం అందించే దరఖాస్తులను మీరు బ్యాంకులకు, రుణాలు అందించే ఆర్థిక సంస్థలకు ఫార్వర్డ్ చేయొద్దు.. ఉద్యోగుల వేతన బిల్లుల నుంచి రుణ రికవరీలకు వీలు కల్పించవద్దు'
– ఇటీవల యూనిట్ అధికారులకు ఆర్టీసీ జారీ చేసిన ఆదేశం ఇది.

ఆర్టీసీ కార్మికులకు రుణం పుట్టడం కష్టంగా ఉన్న సమయంలో ఈ ఆదేశం ఉద్యోగులకు అశనిపాతంగా మారింది. వాస్తవానికి ఇది కొత్త సర్క్యులర్ కాదు. 2003లోనే దీనిపై నిర్ణయం తీసుకున్నా ఇప్పటివరకు పెద్దగా అమలు కాలేదు. పాత సర్క్యులర్‌ను కోట్ చేస్తూ దాన్ని ఇప్పుడు కచ్చితంగా అమలు చేసేలా తాజాగా మరో సర్క్యులర్‌ను ఆర్టీసీ ఉన్నతాధికారులు జారీ చేశారు. కాగా, ఇప్పుడు నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో ఈ ఆదేశాలు తమపై తీవ్ర ప్రభావం చూపుతాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకీ ఆదేశం.. ఏమిటా విపత్కర పరిస్థితి..

ఆర్టీసీ ఉద్యోగులు గతంలో స్వేచ్ఛగా బ్యాంకుల నుంచి రుణం పొందేవారు. కొంతకాలం క్రితం వరకు వేతనాల ఖాతాలున్న బ్యాంకు వారికి రుణాలు ఇచ్చే విషయంలో కొంత ఉదారంగా వ్యవహరించేది. ఇటీవలే వేతనాల ఖాతాలు మరో బ్యాంకుకు మార్చారు. రుణాలిచ్చే విషయంలో కొత్త బ్యాంకు రకరకాల కొర్రీలు, కఠిన నిబంధనలు పెడుతోందని, దీంతో రుణాలకు ఇబ్బందిగా మారిందని కార్మికులు పేర్కొంటున్నారు. దీంతో వేరే బ్యాంకుల నుంచి రుణాలు పొందేవారు. సాధారణంగా ఆర్టీసీ అధికారుల ద్వారా రుణ దరఖాస్తు వస్తే బ్యాంకులు సులభంగా రుణమిస్తాయి. ఒకవేళ కార్మికులు తిరిగి చెల్లించకున్నా, ఆర్టీసీ పూచీగా ఉంటుందన్న ధీమా బ్యాంకులకు ఉంటుంది. ఇప్పుడు రుణాలకు సిఫారసు చేయొద్దని, వేతనాల నుంచి రికవరీకి బ్యాంకులకు అవకాశం ఇవ్వవద్దని పేర్కొంటూ పాత ఆదేశాలను తిరిగి తెరపైకి తేవడం విశేషం.

సీసీఎస్ దివాలాతో..

గతంలో ఆర్టీసీ కార్మికులకు బ్యాంకు రుణాల అంశం పెద్ద సమస్యగా ఉండేది కాదు. ఆర్టీసీ సహకార పరపతి సంఘం (సీసీఎస్) సుభిక్షంగా ఉండటంతో దాని ద్వారానే కావాల్సిన రుణాలు పొందేవారు. కొంతకాలంగా దాని నిల్వ నిధులను ఆర్టీసీ సొంతానికి వాడేసుకుని, దాదాపు వేయి కోట్లకుపైగా బకాయి (వడ్డీతో సహా) పడటం, నెలనెలా దానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకపోవటంతో సీసీఎస్ దాదాపు దివాలా దశకు చేరిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడి నుంచి రుణాలు నిలిచిపోవడం కార్మికులకు పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు బ్యాంకుల నుంచి సులభంగా రుణం పొందే వీలు లేకపోవటంతో వారికి ప్రైవేటు వడ్డీ వ్యాపారులే దిక్కయ్యారు. గతంలో బ్యాంకుల నుంచి రుణం తీసుకుని సమయానికి చెల్లించిన రికార్డు ఉన్న వారు పాత పరిచయాలతో రుణాలు పొందగలుగుతున్నా... మిగతా వారికి మాత్రం ఆర్టీసీ నుంచి సిఫారసు లేకుండా రుణం రాని పరిస్థితి నెలకొంది.

'ఇదేం ఘోరం'

అటు సీసీఎస్‌ను నిర్వీర్యం చేసి రుణాలు అందని పరిస్థితి తెచ్చి, ఇటు బ్యాంకుల నుంచి రుణ సిఫారసులు లేకుండా చేసి కార్మికులను ఇబ్బంది పెట్టడం ఏమాత్రం సరికాదని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఎస్‌ను పునరుద్ధరించే దాకా బ్యాంకుల నుంచి స్వేచ్ఛగా రుణాలు పొందే వీలు కల్పించాలని, తాజా సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మాది పేగుబంధం.. వాళ్లది ఫేక్ బంధం

- కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నది రిజెక్టెడ్ లీడర్లే!
- అసలైన ఉద్యమకారులు, రైతులు బీఆర్ఎస్ వెంటే: హరీశ్‌రావు
- బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం.. రెండో స్థానం కోసమే కాంగ్రెస్, బీజేపీల పోటీ
- బీఆర్ఎస్‌లో చేరిన సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్



మంత్రి హరీశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణతో సీఎం కేసీఆర్‌ది పేగుబంధమైతే ప్రతిపక్ష పార్టీల నేతలది ఫేక్ బంధమని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ పక్కనపెట్టేసిన నాయకులే కాంగ్రెస్, బీజేపీలలో చేరుతున్నారని.. అలాంటి రిజెక్టెడ్ లీడర్లను చేర్చుకుని ప్రతిపక్షాలు సంబురపడుతున్నాయని ఆయన అన్నారు. అసలైన ఉద్యమకారులు, రైతుబిడ్డలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని చీప్ ట్రిక్కులు చేసినా.. బీఆర్ఎస్ హ్యాట్రిక్‌ను ఆపలేరన్నారు. సోమవారం జహీరాబాద్ నియోజకవర్గం సామాజిక ఉద్యమకారుడు, రైతుసంఘం నాయకుడు ఢిల్లీ వసంత్ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని, కాంగ్రెస్, బీజేపీలు రెండోస్థానం కోసమే పోటీ పడతాయని.. ప్రతిపక్ష హోదా ఏ పార్టీకి దక్కుతుందో తేలాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. దేశంలో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని, మహారాష్ట్ర ప్రజలు కూడా సీఎం కేసీఆర్‌నే కోరుకుంటున్నారని చెప్పారు. ఉద్యోగాల కల్పన, ఐటీ, రోడ్లు, పారిశ్రామిక వృద్ధి, రైతుబంధు, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందుతోందని.. కేంద్రం ఇస్తున్న అవార్డులే దీనికి నిదర్శనమని చెప్పారు.

తెలంగాణలో బీజేపీకి స్థానం లేదు

బీజేపీ నేతలవి అన్నీ ఉత్తమాటలేనని, ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని మంత్రి అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న బీజేపీ.. తప్పుడు మాటలు చెప్పి, మోసం చేసిందని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి పది స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

కేయూ పార్ట్ టైం లెక్చరర్లకు చేదు కబురు

- కాంట్రాక్టు లెక్చరర్లుగా మార్చలేమని స్పష్టం చేసిన విద్యాశాఖ
- యూజీసీ నిబంధనలు ఒప్పుకోవని లేఖ

సాక్షి, హైదరాబాద్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లను కాంట్రాక్ట్ లెక్చరర్లుగా మార్చే ప్రక్రియను విద్యాశాఖ తిరస్కరించింది. యూజీసీ నిబంధనలు, మార్గదర్శకాల్లో ఈ విధానం ఎక్కడా ప్రస్తావించలేదని స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఇటీవల కాకతీయ యూనివర్సిటీకి లేఖ రాశారు. దీంతో పార్ట్ టైం లెక్చరర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్ట్ టైం లెక్చరర్ల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ ప్రభుత్వానికి గతంలో లేఖ రాశారు. దీంతో యూనివర్సిటీలో పూర్తిస్థాయి పనిభారం ఉన్న పార్ట్ టైం లెక్చరర్లందరి వివరాలు పంపాలని కాకతీయ యూనివర్సిటీని ఉన్నత విద్యా మండలి కోరింది. 70 మంది పార్ట్‌టైం అధ్యాపకులు ఉంటే, యూనివర్సిటీ అధికారులు మాత్రం 30 మంది పేర్లే పంపడం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంలో పెద్దల స్థాయిలో అవినీతి ఆరోపణలూ వచ్చాయి. దీంతో ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకుంది. ఫలితంగా ఎన్నో ఏళ్లుగా ఆశ పడుతున్న పార్ట్ టైం లెక్చరర్లకు ప్రభుత్వ నిర్ణయం నిరాశ మిగిల్చింది. పార్ట్ టైం లెక్చరర్లను కాంట్రాక్ట్ లెక్చరర్లుగా మార్చడం సాధారణ విషయమేనని అధ్యాపకులు అంటున్నారు. ఇప్పుడు పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లంతా ఒకప్పుడు పార్ట్ టైం ఫ్యాకల్టీగా చేరినవాళ్లేనని చెబుతున్నారు. 15 ఏళ్లుగా ఇదే ప్రక్రియను అన్ని యూనివర్సిటీల్లో అనుసరించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ విధానానికి బ్రేక్ పడిందని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొఫెసర్లు రిటైర్డ్ అవుతున్న కొద్దీ.. కొందరు పార్ట్ టైం లెక్చరర్లు ఫుల్ వర్క్‌లోడ్‌కు చేరినా, కాంట్రాక్ట్ లెక్చరర్లుగా వారిని మార్చకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో కలిపి సుమారు 800 మంది పార్ట్ టైం లెక్చరర్లు ఫుల్ వర్క్‌లోడ్‌తో పని చేస్తున్నారని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి పీజీ చదివేవాళ్లకు పాఠాలు చెప్పే ఈ పార్ట్ టైం లెక్చరర్లకు ఆర్నెల్లకు ఒకసారి బిల్లులు చెల్లిస్తున్నారని, సగటున నెలకు వీరి జీతం రూ.20 వేలు కూడా మించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవాలని కోరుతున్నారు.

రెరాతో రియల్ దందాకు చెక్

ఇకపై రెరా నిబంధనలు పక్కాగా అమలు

- 598 చ.మీ దాటిన వెంచర్‌కు రెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- 9 ఫ్లాట్లు ఉన్నా రిజిస్ట్రేషన్ చేయాల్సిందే
- రాష్ట్రంలో పంచాయతీ, మునిసిపాలిటీ పరిధిలోని ఏ వెంచర్ అయినా రిజిస్టర్ చేసుకోవలసిందే
- రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు సైతం రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఫిర్యాదులు వస్తే పాత లావాదేవీలపైనా చర్యలు : రెరా చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రియల్ దందాలకు ఆస్కారం లేకుండా టీఎస్ రెరా (తెలంగాణ స్టేట్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) కృషి చేస్తుందని 'రెరా' చైర్మన్ సత్యనారాయణ వెల్లడించారు. ''రాష్ట్రంలో 598 చదరపు మీటర్ల విస్తీర్ణం దాటిన ఏ రియల్ ఎస్టేట్ వెంచర్ అయినా, 8 ఫ్లాట్లను మించి నిర్మించే ఏ అపార్ట్‌మెంట్‌కు అయినా... రెరా రిజిస్ట్రేషన్, అనుమతి తప్పనిసరి చేయనున్నారు. 'ఏ వెంచర్ కోసం కొనుగోలు దారుల నుంచి వసూలు చేశారో.. ఆ మొత్తంలో 70 శాతం అదే వెంచర్‌లో ఖర్చు చేయాలి. ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం మాత్రమే అగ్రిమెంట్ సమయంలో చెల్లించాలి. ప్రాజెక్టు ప్లాన్ మార్చాలన్నా... కొనుగోలు దారుల్లో మూడింట రెండొంతుల మంది అనుమతి తప్పనిసరి'... ఇలాంటి నిబంధనలన్నింటినీ తప్పనిసరి చేసేందుకు 'రెరా' పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది.'' అని 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు.



'రెరా' నిబంధనలకు లోబడే.. ప్రతీ ప్రాజెక్టు

రియల్ వెంచర్ అయినా, భారీ అపార్ట్‌మెంట్ అయినా.. ఒప్పందాన్ని ఉల్లంఘించి, ముందుగా చెప్పిన దానికి భిన్నంగా నిర్మాణం జరిపినా, పూర్తిస్థాయిలో అనుమతులు లేకపోయినా, సౌకర్యాలు కల్పించకపోయినా 'రెరా' చర్యలకు ఉపక్రమిస్తుంది. రాష్ట్రంలో ఏమూలన రియల్ ఎస్టేట్ వెంచర్ చేసినా, అపార్ట్‌మెంట్ కట్టినా 'రెరా' వద్ద ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయించాలి. దీంతో కొనుగోలు దారుడికి, రియల్ వ్యాపారికి అనుసంధానంగా ఈ సంస్థ పనిచేస్తుంది. 2017లో రెరా అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 6,805 వెంచర్లు, ఫ్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ కోసం 'రెరా' వద్దకు రాగా, అందులో 6,770కి అనుమతులు లభించాయి. మరో 35 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నిర్దేశిత గడువులోగా ఈ దరఖాస్తులను కూడా పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్లు సైతం రిజిస్ట్రేషన్ చేయాల్సిందే

'రెరా' చట్టం ప్రకారం రియల్ వెంచర్లు, ఫ్లాట్లతో పాటు రియల్ ఎస్టేట్ ఏజెంట్లు (బ్రోకర్లు) కూడా 'రెరా' వద్ద రిజిస్టర్ అయి ఉండాల్సిందే. ఇప్పటి వరకు 2,912 మంది ఏజెంట్లు రిజిస్టర్ కాగా, మిగతా వారిని కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చైర్మన్ సత్యనారాయణ సూచించారు. కాగా, గతంలో జరిగిన రియల్ దందాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తే ఆ లావాదేవీలపైనా విచారించి తప్పు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీపీగెట్‌కు 87 శాతం మంది హాజరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్(సీపీగెట్) ప్రవేశ పరీక్షలు సోమవారం ముగిశాయి. మొత్తం 45 సబ్జెక్టులకు జూన్ 30 తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తంగా 69,377 మంది విద్యార్థులకుగాను 60,443 (87.12 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రాథమిక 'కీ'ని https://cpget. tsche.ac.in వెబ్‌సైట్‌లో ఉంచినట్టు సీపీగెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ నెల 22లోగా అభ్యంతరాలను వెల్లడించవచ్చని సూచించారు.

- డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పాలిసెట్ తుది విడత వెబ్ ఆప్షన్ల గడువు మంగళవారంతో ముగియనుంది. ఈ నెల 11తో వెబ్ ఆప్షన్ల గడువు ముగియనుండగా, 14న సీట్లను కేటాయించనున్నారు.

ఎలక్షన్.. యాక్షన్.. 100 డేస్!

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో కొనసాగించాలని, ఓటర్ల నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నేతలను ఆదేశించారు. పోలింగ్ బూత్ కమిటీల నియామకాన్ని పూర్తిచేసి, క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలని సూచించారు.

16న టిఫిన్ బాక్స్ మీటింగ్‌లు

ఈ నెల 16న రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో టిఫిన్ బాక్స్ బైఠక్ (మీటింగ్)లు నిర్వహించాలని సోమవారం జరిగిన సమావేశంలో నేతలు నిర్ణయించారు. ఆ రోజున పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ టిఫిన్ బాక్స్‌లతో ఎక్కడికక్కడ సమావేశమై.. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం, ప్రజల మద్దతు కూడగట్టడం, మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన విజయాలు తదితర అంశాలపై ఇష్టాగోష్టిగా చర్చించాలని తీర్మానించారు.



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో జవదేకర్, సునీల్ బన్సల్

ఇక వచ్చే నెల 15వ తేదీలోగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బహిరంగ సభల నిర్వహణను పూర్తి చేయాలని జాతీయ నేతలు ఆదేశించారు. ముఖ్యంగా బీజేపీ మిషన్–31లో భాగంగా 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లలో పార్టీ బలోపేతానికి ప్రణాళికలు అమలు చేయడంతోపాటు, ఆ స్థానాల్లో తప్పనిసరిగా సభలు నిర్వహించాలని సూచించారు. 'మహా జన సంపర్క్ అభియాన్'లో భాగంగా వారం, పదిరోజుల్లోగా అన్ని లోక్‌సభ స్థానాల పరిధిలో రాష్ట్ర పార్టీ ఆఫీస్ బేరర్లు ఒక్కొక్కరు 25 మంది చొప్పున (ఒక్కో ఎంపీ స్థానం పరిధిలో వెయ్యి మందిచొప్పున) వివిధ రంగాల ప్రముఖులు, తటస్థులు, మేధావులు, పుర ప్రముఖులను కలుసుకుని పార్టీకి మద్దతును కూడగట్టే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

బీఆర్ఎస్‌తో పొత్తు ముచ్చటే లేదు

ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని, గట్టిగా పోరాడాలని రాష్ట్ర నేతలకు సునీల్ బన్సల్ సూచించారు. బీఆర్ఎస్‌తో బీజేపీ దోస్తీ అంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని, ఎక్కడికక్కడ ప్రజలకు స్పష్టతనివ్వాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను గట్టిగా నిలదీస్తున్నది బీజేపీనే అనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని, ఈ విషయంలో ఎలాంటి మొహమాటానికి తావు లేదన్నారు.

కొత్త కార్యవర్గం నియామకానికి గ్రీన్‌సిగ్నల్!

రాష్ట్ర బీజేపీకి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకునేందుకు, ఎన్నికల టీమ్‌ను సిద్ధం చేసుకునేందుకు రాష్ట్ర నూతన అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు పార్టీవర్గాలు చెప్తున్నాయి. మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలోని రాష్ట్ర కార్యవర్గం, పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఏడు మోర్చాల అధ్యక్ష కార్యవర్గాల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో కొత్త కార్యవర్గాన్ని నియమించుకునేందుకు అనుమతించారని వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వర్గాలకు తగిన ప్రాతినిధ్యం దక్కేలా, చురుకుగా పనిచేసే నాయకులకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించేందుకు కిషన్‌రెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జుల మార్పు కూడా జరగనున్నట్టు సమాచారం.

మీ సాయం కోరే చిన్నారులం

బదిలీల కోసం టీచరు దంపతుల ఆందోళనకు తోడుగా చిన్నారులు, వృద్ధుల వేడుకోలు

- ఇక మిగిలింది ముట్టడే... ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: నిలిచిపోయిన ఉపాధ్యాయ దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలని సోమవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ఆవేదన దీక్ష తల్లిదండ్రులతో పాటు చిన్నారుల, వృద్ధుల వేడుకోళ్లతో ఉద్విగ్నవాతావరణంలో సాగింది. 13 జిల్లాల నుంచి ఉపాధ్యాయ దంపతులతో పాటు వారి పిల్లలు, వయోధికులైన వారి తల్లిదండ్రులు కూడా దీక్షకు తరలివచ్చారు. స్పౌజ్ బదిలీలు నిర్వహించి తమ తల్లిదండ్రులను, కుటుంబాలను కలపాలని చిన్నారులు ఆవేదన చెందడం అందరినీ కలచివేసింది. తమ తల్లిదండ్రుల బదిలీలు జరగకపోవడంతో వారి కుటుంబాలు అనుభవిస్తున్న ఇబ్బందులను పిల్లలు కన్నీటి రోదనల మధ్య వివరించారు. ఇప్పటికైనా తమ తల్లిదండ్రులను కుటుంబాలను కలపాలని చిన్నారులు ఆ సభ ద్వారా ముఖ్యమంత్రిని వేడుకున్నారు.



ఆవేదన దీక్షలో కంటతడి పెడుతున్న చిన్నారి

బోనాలతో ప్రత్యేక ర్యాలీ..

బోనాలతో తెలంగాణ అంతటా పండుగ వాతావరణం ఉన్న ఈ సందర్భంలోనూ.... తమ బదిలీలు జరగక ఆవేదనలో ఉన్నామని.. అమ్మవారికి ప్రత్యేక బోనాలను తయారు చేయించి.. మహిళా ఉపాధ్యాయులు ర్యాలీగా అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బదిలీలు వెంటనే చేపట్టాలని.. భార్య ఒక జిల్లాలో, భర్త మరొక జిల్లాలో 18 నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి స్పౌజ్ బదిలీలు జరిపించాలని అభ్యర్థించారు.

ప్రగతిభవన్ ముట్టడికి సైతం వెనుకాడం: ఉపాధ్యాయ సంఘాలు

ఈ ఆవేదన సభకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలికాయి. యుటీఎఫ్, టీపీటీఎఫ్, తపస్, ఎస్టీయూ, ఆర్.యూ.పీ.పీ, పీఆర్‌టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు దీక్షా శిబిరానికి చేరుకొని తమ మద్దతును ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, అవసరమైతే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని, ప్రగతి భవన్ ముట్టడించడానికి కూడా వెనకాడమని నాయకులు హెచ్చరించారు.

క్లుప్తంగా...

పాతబస్తీకి మెట్రో సేవలు: కేటీఆర్

పురపాలక శాఖను సీఎం కేసీఆర్ ఆదేశించారని ట్వీట్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పాత నగరానికి మెట్రో రైలు సేవలు విస్తరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పురపాలక శాఖను ఆదేశించినట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం ట్వీట్ చేశారు. ఈ విషయమై ఎల్ అండ్ టీ చైర్మన్‌తో కూడా సీఎం కేసీఆర్ మాట్లాడారని పేర్కొన్నారు. మెట్రోరైలు ప్రాజెక్టుకు అవసరమైతే తగిన సహకారం అందిస్తానని ఎల్ అండ్ టీ చైర్మన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పాన్-ఆధార్ లింక్ చేయని వారిపై జరిమానా వద్దు

కేంద్రానికి కోమటిరెడ్డి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: పాన్ కార్డుతో ఆధార్ నంబర్‌ను అనుసంధానానికి కేంద్రం నిర్దేశించిన గడువు తర్వాత అనుసంధానం చేసుకునే పౌరులకు జరిమానా విధించాలన్న నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు సోమవారం ఓ లేఖ రాశారు. గత మార్చి 31తోనే గడువు ముగిసినా, దేశంలో 30 కోట్ల మంది ఇంకా పాన్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయలేదని, వీరిపై రూ.1000 చొప్పున జరిమానా విధిస్తే మొత్తం రూ.30వేల కోట్ల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యారంగంలో సంస్కరణలు అవసరం

ఢిల్లీ నీపా సదస్సులో ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి



సాక్షి, హైదరాబాద్: భారత విద్యారంగంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు నెలకొల్పేందుకు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అభిప్రాయపడ్డారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. ఢిల్లీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్(నీపా) సోమవారం నిర్వహించిన సమావేశానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ దండెబోయిన రవీందర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల చైర్మన్ల సమన్వయంతో సెప్టెంబర్‌లోగా ఈ–న్యూస్ లెటర్ తీసుకురావాలని నిర్ణయించింది. ఉన్నత విద్యామండళ్లలో నీపా, విశ్వవిద్యాలయాల సమన్వయంతో సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించి దేశంలో ఉన్నతవిద్య బలోపేతానికి కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు. వివిధ కోర్సులు, పాఠ్య ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. కోర్సులు, కరికులానికి సంబంధించిన అంశాలపై లోతుగా చర్చించారు. కార్యక్రమంలో నీపా న్యూఢిల్లీ ఉపకులపతి ప్రొఫెసర్ శశికళ వంజరి, నీపా ఉన్నత విద్యావిభాగాధిపతి ప్రొ సుధాంశు భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్‌సీఆర్‌హెచ్ఆర్డీలో ఎమ్ఈఎస్ ఆఫీసర్స్‌కు శిక్షణ



సాక్షి, హైదరాబాద్: మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్ (ఎమ్ఈఎస్)అధికారుల శిక్షణలో భాగంగా ఐదవ ఫౌండేషన్ కోర్సు సోమవారం ప్రారంభించింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కోర్సును ఎమ్‌సీఆర్‌హెచ్ఆర్డీ డీజీ ఐఏఎస్ బన్వర్ మహేశ్‌దత్ ఎక్కా ప్రారంభించారు. 12 రాష్ట్రాల నుంచి హాజరైన 34 మంది అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దేశంలోని సామాజిక, ఆర్థిక, పరిపాలనా, రాజకీయ, న్యాయ, పర్యావరణ సమస్యలను ఎమ్ఈఎస్ అధికారులు కూలంకుషంగా అర్థం చేసుకోవడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుందని తెలిపారు. అధికారులు ఒక్కరుగా సాధించలేని ఎన్నో లక్ష్యాలను రోజువారీగా ఎదుర్కోవాల్సి వస్తుందని, అందుకు అనుగుణంగా వారు నేను నుంచి మనంగా ఎదిగేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందనిఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐడీఎస్ఈ చీఫ్ ఇంజనీర్ విజయ్‌కుమార్ గుప్తా, శిక్షణ చీఫ్ కన్సల్టెంట్ విశ్రాంత ఐఎఫ్ఎస్ కె.తిరుపతయ్య, కోర్సు డైరెక్టర్ శ్రీదేవి అయలూరి తదితరులు పాల్గొన్నారు.

సంతోషాలను దాటిపెట్టి, ఎప్పుడూ కష్టాలనే ఏకరువు పెట్టే స్నేహితులను అస్సలు నమ్మకండి.
- జుడాయిజం

ఫోకస్

సాక్షి
మంగళవారం, 11 జూలై 2023

సరికొత్త 'డేటా పరిరక్షణ'

వ్యక్తిగత గోప్యత పౌరుల ప్రాథమిక హక్కని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పి ఆరేళ్లవుతుండగా మళ్లీ సరికొత్తగా ముస్తాబై డిజిటల్ పర్సనల్ డేటా పరిరక్షణ బిల్లు పార్లమెంటు ముందుకు రాబోతోంది. పట్టు వదలని విక్రమార్కుడి నుంచి పదే పదే తప్పించుకునే బేతాళుడి మాదిరి ఎప్పటికప్పుడు వెనక్కిపోతున్న బిల్లు ఈసారైనా ఈనెల 20 నుంచి మొదలయ్యే సమావేశాల్లో ఆమోదం పొందుతుందా లేదా అన్నది చూడాలి. అంతకన్నా ముఖ్యం– ముసాయిదా బిల్లుపై నిపుణుల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలను ఏ మేరకు పరిగణనలోకి తీసుకున్నారో తెలియాల్సివుంది. డేటా పరిరక్షణ ఎంతో సవాలుతో కూడుకున్న వ్యవహారం. దాన్ని రూపొందించేవారికి డిజిటల్ రంగంపైనా, అందులో వస్తున్న, రావడానికి ఆస్కారం ఉన్న మార్పులపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే నిజమైన పరిరక్షణ సాధ్యమవుతుంది.

మన దేశంలో డిజిటల్ యుగం ప్రవేశించి దాదాపు మూడు దశాబ్దాలవుతోంది. పేరుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–2000 చట్టం వచ్చినా అది పౌరుల గోప్యతకు సంబంధించి కొరగాని చట్టంగా మిగిలిపోయింది. వేలిముద్రలతో సహా పౌరుల సమస్త వివరాలూ సేకరించే ఆధార్‌ను ఆదరాబాదరాగా తీసుకొచ్చిన ఆనాటి యూపీఏ సర్కారు ఆ డేటా పరిరక్షణకు అనువైన చట్టం అవసరమన్న సంగతి మరిచింది. దానిపై నిపుణుల నుంచి విమర్శలు వెల్లువెత్తాక 2012లో జస్టిస్ ఏపీ షా నేతృత్వంలోని కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఒక సమగ్ర నివేదిక కూడా ఇచ్చింది. ఈలోగా యూపీఏ ఏలుబడి ముగిసిపోయింది. తగిన చట్టాలు లేకుండా ఆధార్ కోసం వ్యక్తిగత వివరాలు సేకరించడాన్ని సవాలు చేస్తూ 2017లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పుట్టస్వామి సుప్రీంకోర్టు తలుపు తట్టాక కేంద్రంలో కదలిక మొదలైంది. వ్యక్తిగత గోప్యత హక్కు పౌరుల జీవించే హక్కులో అంతర్భాగమని, అందుకు అనుగుణంగా చట్టం ఉండితీరాలని సర్వోన్నత న్యాయస్థానం ఆ కేసులో తీర్పునిచ్చాక జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నాయకత్వాన కమిటీ ఏర్పాటయింది. అన్ని వర్గాల ప్రజలతోనూ, నిపుణులతోనూ మాట్లాడి మరుసటేడాది జస్టిస్ శ్రీకృష్ణకమిటీ ముసాయిదా బిల్లు సమర్పించింది. మార్పులు, చేర్పులతో ఆ బిల్లు 2019లో పార్లమెంటు ముందుకు వచ్చింది. ఆ తర్వాత దానిపై సంయుక్త పార్లమెంటరీ సంఘం(జేపీసీ) ఏర్పాటైంది. మరో రెండేళ్లకు జేపీసీ నివేదిక సమర్పించగా, దాని ఆధారంగా 2021లో కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. దానిపైనా అనేక అభ్యంతరాలు వ్యక్తం కావటంతో నిరుడు ఆగస్టులో ఆ బిల్లును ఉపసంహరించుకున్నారు. తర్వాత రూపొందిన మరో ముసాయిదా బిల్లును నిరుడు నవంబర్‌లో ప్రజల పరిశీలనకు విడుదల చేశారు. అందులో వ్యక్తమైన అభిప్రాయాలేమిటో, వేటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోబోతున్నదో చెప్పలేదు. మొత్తానికి ఆరేళ్లుగా సాగుతున్న కసరత్తు పర్యవసానంగా కొత్త బిల్లు రాబోతోంది. ఐరాస సభ్యదేశాల్లో ఇప్పటికే 137 దేశాలు డేటా పరిరక్షణ చట్టాలు తీసుకొచ్చాయి. చెప్పాలంటే ఆ విషయంలో మనం వెనకబడేవున్నాం.

దేశ పౌరుల డేటా బజారునపడుతున్న వైనం అప్పుడప్పుడు వెల్లడవుతూనే ఉంటోంది. ఎక్కడెక్కడో డేటా సంపాదించి పౌరుల బ్యాంకు ఖాతాలను దుండగులు ఖాళీ చేస్తున్న ఉదంతాలు పెరిగాయి. అయినా డేటా పరిరక్షణ బిల్లు తీసుకురావటంలో అలవిమాలిన జాప్యం జరిగింది. ఏమైతేనేం... బిల్లు రాబోతున్నది. సంస్థల అజాగ్రత్త వల్ల లేదా ఉద్దేశపూర్వక చర్య వల్ల డేటా లీకైనపక్షంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు, చర్యలు తీసుకునేందుకు డేటా పరిరక్షణ ప్రాధికార సంస్థ(డీపీఏ) ఏర్పాటు చేయాలన్న బిల్లులోని ప్రతిపాదన మెచ్చదగిందే. ప్రతి సంస్థా తమ ఖాతాదార్ల గోప్యత దెబ్బతినకుండా చూసేందుకు డేటా పరిరక్షణ ప్రత్యేక అధికారిని నియమించుకోవటం, నిఘా పెట్టడం ఇక తప్పనిసరవుతుంది. ఉద్దేశిత ప్రయోజనం నెరవేరగానే సేకరించిన డేటాను పూర్తిగా తొలగిస్తామన్న హామీ ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా చట్టంలో ఉంటుందంటున్నారు. అది మంచి ప్రతిపాదనే. డేటా లీక్ అరికట్టడంలో విఫలమయ్యే సంస్థకు రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధించాలని ప్రతిపాదించారు. అవసరాన్నిబట్టి కేబినెట్ ఆమోదంతో ఈ జరిమానాను రూ. 500 కోట్ల వరకూ పెంచడానికి బిల్లులో ఏర్పాటుందని చెబుతున్నారు. ప్రతిపాదన కూడా అవసరమైనదే.

అయితే పౌరుల డేటా లీక్‌కు సంబంధించినంతవరకూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను సమంగా చూడాలి. పౌరుల అనుమతి లేకుండా వారి డేటాను సేకరించే ప్రభుత్వ సంస్థలకు కూడా వర్తించేలా చర్యలుండాలని, వాటికి కూడా కళ్లెం వేయాలని ఇంటర్నెట్ ఫ్రీడం ఫౌండేషన్ వంటి సంస్థల డిమాండ్. అమెరికా, యూరోప్ దేశాల్లో ప్రైవేటు సంస్థలకైనా, ప్రభుత్వ సంస్థలకైనా సమానంగా వర్తించేలా చట్టాలున్నాయి. దేశ భద్రత తదితర అంశాల్లో తన ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలకు కేంద్రం మినహాయింపు ఇవ్వొచ్చని తాజా బిల్లులో ఉన్నదంటున్నారు. కొన్ని సందర్భాల్లో అది అవసరమే కావొచ్చు కూడా. కానీ ఆ క్రమం పారదర్శకంగా ఉండాలి. మినహాయింపులిస్తే సరిపోదు. చట్టవిరుద్ధత చోటుచేసుకున్న పక్షంలో చర్యలేమిటో ప్రతిపాదించాలి. తప్పుడు ఫిర్యాదులని తేలితే రూ. 10,000 వరకూ జరిమానా విధించవచ్చన్న పాత ముసాయిదా నిబంధన కూడా మార్చలేదంటున్నారు. సాధారణ పౌరులు ఫిర్యాదు చేయాలంటేనే సవాలక్ష అడ్డంకులుంటాయి. ఈమాదిరి జరిమానాలు తోడైతే ఇక చెప్పేదేముంది? పౌరులను బెదరగొట్టే ఈ నిబంధనను పరిహరిస్తేనే మంచిది. డీపీఏ ఒక స్వతంత్ర సంస్థగా మనగలిగితేనే దాని పని తీరు ప్రభావవంతంగా ఉంటుందని పాలకులు గుర్తిస్తే అది దేశానికెంతో మేలు చేస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: బ.నవమి రా. 10.04 వరకు, తదుపరి దశమి
నక్షత్రం: అశ్విని రా.11.31 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: రా. 7.36 నుండి 9.11 వరకు, దుర్ముహూర్తం: ఉ. 8.10 నుండి 9.04 వరకు తదుపరి రా. 10.58 నుండి 11.44 వరకు
అమృతఘడియలు: సా.4.32 నుండి 5.43 వరకు.

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సమాఖ్య స్ఫూర్తికి తిలోదకాలు!


ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రాష్ట్రాల అధికారాలను కేంద్ర పాలక వర్గ పార్టీలు మింగేయడం, ఎన్నడూ లేని విధంగా గవర్నర్ల అధికారాలకు కొమ్ములు మొలవడం బాబూ రాజేంద్ర ప్రసాద్ దేశాధ్యక్షుడిగా ఉన్నంతవరకూ మనం ఎరగం! ఆ తర్వాతి పాలక వర్గాల ఇష్టానుసార పరిపాలనకు ఉత్తరప్రదేశ్‌కు పార్లమెంటులో అత్యధికంగా ఉన్న 80 స్థానాలు ఆసరా అయి, దేశ రాజకీయాల్ని శాసిస్తూ దక్షిణాది రాష్ట్రాల్ని శాసింపజూస్తూ వస్తున్నాయి. ఆ ధోరణిలో భాగమే తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వాన్ని శాసించే విధంగా అక్కడి గవర్నర్ రాష్ట్ర మంత్రుల్ని బర్తరఫ్ చేయడానికి సాహసించడం! మరీ విచిత్రమైన విషయం.. వలసపాలనలో గవర్నర్‌లుగా పనిచేసిన వారు చలాయించిన అధికారాలకు, స్వతంత్ర భారతంలో గవర్నర్ల అధికారాలకు మధ్య భేదాన్ని కూడా గ్రహించలేనంతగా దృష్టి లోపంతో ఉన్నారు నేటి పాలకులు.

ఒకనాడు తమదంటూ 'చిరునామా' కూడా లేక పరాయి పంచల్లో బతుకుతోన్న తెలుగువారిని వెన్ను తట్టి వేల సంవత్సరాల తెలుగు భాషా, సాంస్కృతిక మూలాలను గుర్తు చేసి వారిలో చైతన్యం నింపిన మహా నాయకులెందరో! ఆ నాయకులలో ఆచరణశీలురు, ఉద్యమస్ఫూర్తి ప్రదాతలు అయిన పొట్టి శ్రీరాములు, ఎన్.టి. రామారావు ముఖ్యులు. ఆంధ్రోద్యమ ఉద్ధృతిలో ఈ ఇరువురి ప్రవేశం ఉత్తరోత్తర భారతదేశ ఫెడరల్ స్ఫూర్తికే తలమానికంగా నిలిచింది. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినవారిలో 112మంది కన్నడిగులు కాగా, కన్నడ తెలుగువారు 69మంది! ఈ విశిష్టతను వెల్లడిస్తూ ఒక కన్నడ తెలుగు మిత్రుడు ఒక లేఖను విడుదల చేశారు.

దాని సారాంశం – ''ఆంధ్ర, తెలంగాణాలు మట్టుకే తెలుగు తావులు కావు. తెలుగు నేల ఎంత పెద్దదంటే, వింధ్య మల నుండి వాన మాముల వరకూ, వంగ కడలి నుండి పడమటి కనుమల దాకా పరుచుకున్నది తెలుగు నేల. ఈ నేలను కొన్ని కోట్ల మంది తెలుగువారితో పాటు కన్నడిగులు, తమిళులు, ఒరియా, మరాఠీ, గోండీ వాళ్లూ పంచుకుని ఉన్నారు. ఈ క్రమంలో తెలుగు 'నుడి' అన్నది భాషా సంబంధమైన నుడికారాలు, నానుడుల సంపదలో బాగా నష్టపోయింది. తెలుగు జాతికి గల ఈ సంపదను గుర్తించాల్సింది బయటి వాళ్లు కాదు, తెలుగు వాళ్లమైన మనమే''నని కన్నడ – తెలుగు సోదరులు జ్ఞాపకం చేయవలసి వచ్చింది! తెలుగు జాతికి గల అటువంటి సంపద గుర్తింపునకు ఉద్యమరూపంలో స్ఫూర్తిదాయకంగా నిలిచిన వారు పదహారణాల ఆంధ్రులైన పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్.

దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిందని అందరూ సంబరపడుతున్న వేళ.. ఆ ముహూర్తాన్ని ముమ్మూర్తులా అనుభవించడానికి నోచుకోనిది పరాయి పంచన జీవిస్తున్న మహోన్నత చారిత్రక, సాంస్కృతిక చరిత్ర గల ఆంధ్రులేనన్న సంగతి మరచిపోరాని ఘట్టం! నాటి చీకటి రోజుల నుంచి ఆంధ్రులను చైతన్యంలోకి, ఆచరణలో తీసుకురావడంలో పొట్టి శ్రీరాములు, ఎన్టీ రామారావుల పాత్ర అనుపమానం! అలాగే, అడుగడుగునా కేంద్ర పాలకులపైన రాష్ట్ర ముఖ్యమంత్రులు ఆధారపడే పాలకవర్గ సంస్కృతిని రాష్ట్రాలు ఛేదించేటట్టు చేసిన ఖ్యాతి ఎన్టీఆర్‌ది! కేంద్ర రాష్ట్ర సంబంధాలు కేవలం ఫెడరల్ సంబంధాలే గాని, కేంద్ర పాలకులకుల యుక్తులపై ఆధారపడేవి కావని చాటి చెప్పి రాష్ట్రాల ఫెడరల్ స్ఫూర్తికి దోహదం చేశారాయన. అలా పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్‌ల దూరదృష్టి ఫలితమే నేడు దేశంలోని పలు కాంగ్రెస్, బీజేపీ పాలకుల కుయుక్తులకు అడ్డుకట్టలు వేయడానికి అవకాశమిస్తోంది!

రెండో మాట


తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, గవర్నర్ ఆర్.ఎన్. రవి

రాష్ట్రాల అధికారాలను కేంద్ర పాలక వర్గ పార్టీలు మింగేయడం, ఎన్నడూ లేని విధంగా గవర్నర్ల అధికారాలకు కొమ్ములు మొలవడం డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ దేశాధ్యక్షుడిగా ఉన్నంతవరకూ మనం ఎరగం! ఆ తర్వాత కాంగ్రెస్, బీజేపీ పాలక వర్గాల ఇష్టానుసార పరిపాలనకు ఉత్తరప్రదేశ్‌కు పార్లమెంటులో అత్యధికంగా ఉన్న 80 స్థానాలు ఆసరా అయి, దేశ రాజకీయాల్ని శాసిస్తూ దక్షిణాది రాష్ట్రాల్ని శాసించజూస్తూ వస్తున్నాయి. కనుకనే తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వాన్ని శాసించే విధంగా అక్కడి గవర్నర్ మంత్రుల్ని బర్తరఫ్ చేయడానికి సాహసించడం! రాజ్యాంగ నియమాలను త్రోసిరాజని పలువురు గవర్నర్లు వ్యవహరిస్తున్నారు. ఇందుకు తాజా ఉదాహరణలు... మణిపూర్, త్రిపురలు! చివరికి, ఆదివాసీలు అటవీ భూముల్ని సాగు చేసుకుని బతికే హక్కును చట్టరీత్యా సుప్రీంకోర్టు ఏనాడో (1996 లోనే) అనుమతించి రక్షణ కల్పించినా, ఆ చట్టంలోని పలు రక్షణ నిబంధనలను సవరింపజేసి ఆ భూముల్ని అధికార పక్ష మోతుబరులు అనుభవించడానికి వీలు కల్పించేలా పాలకులు తాము 'బ్రూట్' మెజారిటీ అనుభవిస్తున్న పార్లమెంటు ఆమోదం కోసం పంపడం జరిగింది!

అలాగే ఢిల్లీ చుట్టూ రాష్ట్రాల పాలకుల్ని తిప్పించాలనుకునే 'సంస్కృతి'కి కాంగ్రెస్, బీజేపీ పాలకులు అలవాటు పడ్డారు. ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలలోని కొన్ని ప్రతిపక్ష పాలకులూ ఢిల్లీకి సలాం కొడుతున్నారు! రాజ్యాంగ ఫెడరల్ స్వభావానికి విరుద్ధమైన కేంద్ర పాలకుల ధోరణికి మరొక తిరుగులేని ఉదాహరణ... 2002లో గుజరాత్ ప్రభుత్వం ప్రజలపై అమలు జరుపుతున్న దమనకాండను నిరసిస్తూ ఉద్యమించిన నేరానికి తీస్తా సెతల్వాడ్‌ను అరెస్టు చేసి, జైలు పాలు చేసి సుప్రీంకోర్టు ఆమెకు కల్పించిన వెసులుబాటును సహితం పనిగట్టుకుని ఏళ్ల తరబడిగా వ్యతిరేకిస్తూ ఉండటం! శ్రీమతి సెతల్వాడ్ మహిళ అయినందున సి.ఆర్.పి.సి 437 నిబంధన ప్రకారం అందవలసిన సౌకర్యాలు ఆమెకు అందాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా ప్రస్తుత పాలకులు ఆమెపై వేధింపులు మానలేదు.

అంతేగాదు, మరీ విచిత్రమైన విషయం.. వలస పాలనలో గవర్నర్‌లుగా పనిచేసిన వారు చలాయించిన అధికారాలకూ, స్వతంత్ర భారతంలో గవర్నర్ల అధికారాలకూ మధ్య భేదాన్ని కూడా గ్రహించలేనంతగా దృష్టి లోపంతో ఉన్నారు నేటి పాలకులు. కనుకనే స్వతంత్ర భారత లోక్‌సభకు సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన పి.డి.టి. ఆచార్య బ్రిటిష్ వలస పాలనలోని గవర్నర్ల పాత్రకూ, స్వతంత్ర భారత రాష్ట్రాల్లోని గవర్నర్ల పాత్రకూ స్వభావంలోనే పొసగదని తేల్చేశారు. అనేక కేసుల్లో స్వతంత్ర భారత సుప్రీంకోర్టు, స్వతంత్ర భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం లేదా ఆమోదం మేరకే రాష్ట్ర గవర్నర్లు నడుచుకోవాలని 1974 నాటి అనేక కేసులలో ఏడుగురు న్యాయమూర్తులు గల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది! (షంషేర్ సింగ్ – స్టేట్ ఆఫ్ పంజాబ్). ఈ నేపథ్యంలోనే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి సొంత నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధ ప్రకటనలూ తమ వద్ద చెల్లవని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ బాహాటంగానే ఖండించాల్సి వచ్చింది. ప్రజాస్వామ్యానికి, మతాతీత, సామాజిక న్యాయ వ్యవస్థకు, సమాఖ్య (ఫెడరల్) వ్యవస్థకు, లౌకిక రాజ్యాంగానికే డి.ఎం.కె కట్టుబడి ఉంటుందని స్టాలిన్ స్పష్టం చేశారు.

ఎప్పుడైతే ఒక దేశం, ఒక పాలకుడు, ఒకే ప్రభుత్వం, ఒకే ఎన్నిక తన లక్ష్యమని ప్రధాని ప్రకటించారో ఆ రోజునే దేశ భవిష్యత్తుకు రానున్న ప్రమాదాన్ని చెప్పకనే చెప్పినట్టయింది. అయితే ఈలోగా సామాజిక స్పృహ కలిగిన డి.వై చంద్రచూడ్ లాంటి న్యాయమూర్తి సుప్రీంకోర్టును 2025 చివరి వరకూ అధిష్ఠిస్తారన్న 'చేదు నిజాన్ని' తాను భరించాల్సి వస్తుందని ప్రధాని బహుశా అనుకొని ఉండరు! అసలు విషాదం అంతా అందులోనే దాగి ఉంది! ఎందుకంటే–

ఓ మహా కవి అననే అన్నాడు గదా...
''చిటికెడు పేరు కోసం నీతిని నిలువునా చీల్చేస్తుంది స్వార్థం
మూరెడు గద్దె కోసం జాతి పరువునే ఆరవేస్తుంది స్వార్థం!''

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

రన్ రాజా రన్


ఆనందాల బౌండరీలు, విజయాల సిక్సర్లతో జీవితం ముందుకు సాగాలని కోరుకుంటూ సునీల్ గవాస్కర్‌కు జన్మదిన శుభాకాంక్షలు (10 జూలై). ఆట పట్ల ఆయన భావావేశం తరతరాలకూ స్ఫూర్తి.
- సురేశ్ రైనా, క్రికెటర్

ఎప్పటికీ ఇంతేనా?


భారీ వర్షపాతం, తర్వాత నగరాలలో ఏర్పడే నీటి ఎద్దడి... రెండు హెచ్చరికలు చేస్తున్నాయి. 1. వాతావరణ మార్పులు వేగంగా ఉంటాయి. 2. పట్టణ ప్రణాళికల్లో అభివృద్ధి చెందిన దేశాలకు మనం తూగలేం.
- కమల్ కాంత్, జర్నలిస్ట్

రెండు నాలుకలు


ఒకవైపు 'ఆప్' జనరల్ సెక్రెటరీ, రాజ్యసభ సభ్యుడు సందీప్ పాఠక్ ఉమ్మడి పౌర స్మృతికి మద్దతు ఇస్తూ ఉంటే, 'ఆప్'కే చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌జీ అందుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఆశ్చర్యపోనవసరం లేదు. 'ఆప్'ని అందరూ ప్రపంచంలోనే అతి పెద్ద మోసపూరితమైన పార్టీ అనే కదా అంటారు.
- మంజీందర్ సింగ్ సిర్సా, సామాజిక కార్యకర్త

కూర్చున్న కొమ్మ


ఈ నవంబరుకు మనం 800 కోట్ల మందిమి కాబోతున్నామని అంచనా. సృష్టిలోని అన్ని జీవరాశులలో ఇది కేవలం 0.01 శాతమే. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సంభవించే ప్రకృతి వైపరీత్యాలకు మనమే కారణం. ప్రకృతితో నువ్వు ఆడుకుంటే ప్రకృతి నీతో ఆడుకుంటుంది!!
- ఆంబ్రోసియా, మినిమలిస్టు

ఆదుకుందాం పదండి


పర్వత ప్రాంతాలను ఇష్టపడే నా స్నేహితులందరికీ ఒక విజ్ఞప్తి. ప్రకృతి ఆగ్రహాన్ని ఎదుర్కొంటున్న హిమాచల్ ప్రదేశ్ కోసం, అక్కడి ప్రజల కోసం మనమంతా ఏదైనా చేయడానికి వెంటనే సమాయత్తం అవుదాం. ఆ రాష్ట్రంలోని ప్రస్తుత వరద బీభత్సానికీ, గందరగోళానికీ పర్యాటకులుగా మనం బాధ్యత వహించాలి.
- మాచయ్య కళెంగడ, ప్రాజెక్ట్ మేనేజర్

అడ్డు తొలగించండి


ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీలో పి.డబ్ల్యు.డి గానీ, ఎం.సి.డి గానీ చేయలేకపోతున్న డీసిల్టింగ్‌ని ఒక స్థానిక శునకం చేస్తోంది! (వీడియోను జతపరుస్తూ). అరవింద్ కేజ్రీవాల్ 'డీసిల్టింగ్' అనే మాటను నమ్ముతారు. అంటే ప్రవాహానికి అడ్డు పడే చెత్తను తొలగించడం. అదే జరిగి ఉంటే ఢిల్లీ వాసులు ఇప్పుడీ వరదలతో బాధపడేవారు కాదు.
- అభిషేక్ దత్, ఐ.ఎన్.సి. జాతీయ కార్యదర్శి

అనుభవం అయింది


రిలయన్స్‌కు తమ వ్యాపారాలలోని వ్యక్తులను డబ్బు సంపాదించడానికి అనుమతించని అలవాటు ఉంది. నా తొలినాళ్ల వ్యవస్థాపక ప్రయాణంలో రిలయన్స్ ఫ్యూయల్ స్టేషన్‌ను ప్రారంభించాలని అనుకున్నప్పుడే నేను దీనిని గ్రహించాను. ఆ అనుభవం నన్ను వారికి దూరంగా ఉంచింది. (పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ని రిలయన్స్ రిటైల్ రద్దు చేయబోతోందన్న వార్తను చూసి).
- సచిన్ చంద్ర, సి.ఐ.ఐ. (జహోర్) ఛైర్మన్

ఆమె ఒక పోరాట ప్రదీప్తి!

అది 1952. హైదరాబాద్ స్టేట్‌లో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రోజులు. రెవెన్యూ మంత్రిగా పనిచేస్తున్న ముందుముల నర్సింగరావు ఆ సమయంలో కొల్లాపూర్ తాలూకా సాతాపూర్ గ్రామంలో ఒక సభలో పాల్గొన్నారు. ఆ సభలోకి కొందరు సాయుధులు ప్రవేశించారు. వారిలో ఒక సాయుధురాలైన మహిళ తెలంగాణ రైతుల, రైతు కూలీల సమస్యలపై, భూస్వాముల దౌర్జన్యాలపై, ప్రభుత్వ తీరు పట్ల తన ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆమే 'కమ్యూనిస్టు రంగమ్మ'గా, 'రంగక్క'గా ప్రఖ్యాతి గాంచిన కె. సత్యవతి. పుట్టింది నల్లగొండ జిల్లా. ప్రజా పోరాటాలు చేసింది పాలమూరు జిల్లాలో. ప్రజా ఉద్యమాల చరిత్రలో ఆమెది ఒక అధ్యాయం. మొగిలిగిద్ద శ్రీనివాసరావు, కందాళై లక్ష్మణాచార్యులు వంటి వారితో కలిసి స్ఫూర్తిమంతమైన పోరాటం చేశారు.

కామ్రేడ్ రంగక్క అసలు పేరు కె. సత్యవతి. ప్రస్తుత సూర్యాపేట జిల్లా 'చివ్వెంల'లో 1933లో జన్మించారు. తమ పొలం వద్దకు వచ్చి ఆశ్రయం పొందే నాటి కమ్యూనిస్టుల ప్రభావానికి లోనై తన 13వ ఏటనే విజయవాడకు వెళ్లి అక్కడ కమ్యూనిస్టు పార్టీలో చేరి 'రంగమ్మ'గా పేరు మార్చుకుని తుపాకీ చేతబట్టారు. నల్లమల ఆమె కార్యక్షేత్రమైంది. నల్లమల ప్రాంతంలో ఆధిపత్య వాదులకు, భూస్వాములకు, దొరలకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. అచ్చంపేట, అమ్రాబాద్, కొల్లాపూర్, లింగాల, పెద్ద కొత్తపల్లి ప్రాంతాలలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తిరుగులేని పోరాటాలు చేశారు. చెంచులను కూడగట్టి అటవీ అధికారుల దుర్మార్గాలను నిలువరించారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, పోరాడారామె. 'బల్మూరు'లో పోలీసులకు ఎదురుపడి కాల్పులు జరిపిన ధీశాలి రంగమ్మ. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దుర్మార్గంగా 'లెవీ' పేరుతో నిజాం సైనికులు కొల్లగొడితే తిరిగి స్వాధీనం చేసుకుని రైతులకు అప్పజెప్పారు.


కామ్రేడ్ రంగమ్మ

మహబూబ్ నగర్ జిల్లాలో రంగక్క ప్రభంజనాన్ని చూసి నాటి హైదరాబాద్ స్టేట్ ప్రభుత్వం ఆందోళన చెందింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు అసెంబ్లీలో ఒక ప్రకటన చేస్తూ 'నేడు మహబూబ్ నగర్ జిల్లాను ఒక ఆడమనిషి వణికిస్తున్నది' అని ప్రకటించారంటే ఆమె పోరాట పటిమ ఎంతటిదో మనం అర్థంచేసుకోవచ్చు. రంగమ్మపై పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. తుదకు పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఒక చేతికి బేడీలు, ఒక సంకలో చంటి బిడ్డతో ఆమెను నాగర్ కర్నూల్ జైలుకు తరలిస్తుండగా వేలాదిమంది పేద ప్రజలు ఆమె అరెస్టును ఖండించి, బారులు తీరి మద్దతు పలికారు.

రంగక్క తన ఉద్యమ సహచరుడైన కొణిజర్ల నారాయణను వివాహం చేసుకున్నారు. సాయుధపోరాటం తర్వాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో, ఆ తర్వాత సీపీఎంలో క్రియాశీలంగా ఉన్నారు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పెంచికలదిన్నెలో శేషజీవితం గడుపుతున్నారు. ఆమె పోరాటాన్నీ, స్ఫూర్తినీ ఈ తరానికి తెలియ చేయడం కోసం నాగర్ కర్నూల్ జిల్లా సీఎస్ఆర్ విద్యాసంస్థల వారు 2023కి గాను 'చింతలపల్లి నిర్మలాదేవి– నారాయణరావు జీవన సాఫల్య పురస్కారాన్ని' జూలై 12న అందజేస్తున్నారు.

– హెచ్. రమేశ్ బాబు, జర్నలిస్ట్ ।7780 736 386

కౌమారానికి పరీక్ష పెట్టకండి!

అభిప్రాయం


కొల్లు మధుసూదనరావు

కౌమార దశ బాల్యానికి తరువాత యవ్వనానికి ముందు వచ్చే ముఖ్యమైన దశ. 11 నుండి 19 ఏళ్ల మధ్య కాలాన్ని కౌమారదశ లేక టీనేజ్. ఇది మానవ జీవితంలో అతి ముఖ్యమైనదిగా జీవితపరివర్తన కాలంగా కూడా చెప్పుకోవచ్చు. కౌమారంలో తిరిగి మూడు దశలుంటాయి. ఒకటి యుక్త వయస్సు ప్రారంభదశ (10–14). యుక్త వయస్సు ప్రారంభదశలో పరిమితమైన ఆసక్తి కలిగి ఆలోచనను అభివృద్ధి చేసుకుంటారు. రెండోది మధ్యయుక్త వయస్సు (15–17). దీనిలోనే జీవితానికి అవసరమైన దీర్ఘకాలిక లక్ష్యాలు ఏర్పరుచుకొని భావోద్వేగాల్ని అనుభవిస్తారు. మూడోది యుక్తవయస్సు (18–24). కౌమారంలో ఇది చివరిదశ. హేతుబద్ధంగా ఆలోచించడం, భవిష్యత్తు కోసం పథకాలు రూపొందించడం, స్థిరమైన గుర్తింపు పొందుతారు. వీటిలో కూడా విద్యాదశలో ఇంటర్మీడియట్ ఎంత ముఖ్యమైనదో, కౌమారంలో మధ్యస్థ దశ అంత ప్రధానమైనది. ఈ దశలోనే వ్యక్తి ప్రవర్తన, వైఖరులపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుంది. ఇంతటి ముఖ్యమైన దశలో అసలు వదిలి కొసరు కోసం అన్నట్టుగా అందరూ పాఠశాల, ఇంటర్మీడియట్ చదువుకు స్వస్తి చెప్పి ఆరో తరగతి నుండీ వృత్తివిద్యల ప్రవేశ పోటీ పరీక్షల ఉత్తీర్ణతే ధ్యేయంగా, జేఈఈలో కానీ, 'నీట్'లో కానీ ప్రవేశ పరీక్షల్లో ర్యాంక్‌ను సాధించడం లక్ష్యంగా శ్రమిస్తున్నారు. ప్రవేశ పరీక్షే జీవిత సర్వస్వంగా భావించి తమ యావత్ శక్తి, యుక్తిని వినియోగించినా కొద్ది మంది మాత్రమే ప్రయోజనం పొందుతుంటే లక్షలాది విద్యార్థులు వైఫల్యం చెంది నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. ఇందులో ఎంతో మంది తమ జీవితాల్ని వ్యర్థం చేసుకుంటుండగా, కొద్ది మంది ఆత్మహత్యలకు సైతం పాల్పడడం అత్యంత దురదృష్టకరం.

ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే పైచదువులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైతే చాలు, మార్కులతో సంబంధం లేదు. అంటే ఇంటర్మీడియట్ మార్కుల పట్ల, పరీక్షల పట్ల ప్రభుత్వానికే నమ్మకం లేక ప్రత్యేక ప్రవేశ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పుకోవచ్చు.

ప్రత్యేక కోచింగ్ అనేది ఇంటర్ తదనంతరం ఆసక్తి, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇస్తే ప్రయోజనం ఉంటుంది. కానీ సంపాదనే ధ్యేయంగా ఆసక్తి, ప్రతిభ, అవకాశం లేని ఆరు నుండి ఇంటర్ విద్యార్థులకు కూడా కోచింగ్‌తో సీటు గ్యారంటీ అంటూ మభ్యపెట్టి కోచింగ్ ఇవ్వడం వల్ల ఎంతో నష్టం వాటిల్లుతోంది. ప్రతీ సంవత్సరం లక్షలాది విద్యార్థులు ఈ వృత్తివిద్యా ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించలేక, పైచదువులు కొనసాగించలేక శారీరకంగా, మానసికంగా ఎంతగానో నష్టపోతున్నారనేది వాస్తవం.



పాఠశాల చదువుకు స్వస్తి చెప్పి, కేవలం ఫౌండేషన్, కోచింగ్ సంస్థలలో చదివే విద్యార్థులే జేఈఈ నీట్ పరీక్షల్లో సీట్లు సంపాదించగలుగుతున్నారని భావిస్తే అది భ్రమ మాత్రమే! కొన్ని సంస్థలు తమ సంపాదన పెంచుకోడానికి చేస్తున్న దుష్ప్రచారమేనని కేంద్రీయ విద్యా సంస్థల ఫలితాలు రుజువు పరుస్తున్నాయి. ఫౌండేషన్ కోర్సుకానీ, ప్రత్యేక కోచింగ్ కూడా చేపట్టకుండా కేవలం సామాన్య విద్యా కార్యకలాపాలు నిర్వహించే కేంద్రీయ విద్యాలయాలు 2019లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో 6019 మంది విద్యార్థులు పాల్గొనగా 1019 మంది అర్హత సాధించారు. అదే సంవత్సరం జరిగిన నీట్ పరీక్షల్లో జవహర్ నవోదయ విద్యార్థులు 14,500 మంది పాల్గొనగా 12,654 మంది అర్హత సాధించారు. 2022లో జవహర్ నవోదయ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 7,585 మంది పాల్గొనగా 1010 మంది, నీట్‌లో 24,809 పాల్గొనగా 19,352 మంది అర్హత సాధించారు. ఫౌండేషన్ కోచింగ్‌ల ద్వారా ప్రత్యేక ప్రయోజనం సమకూరకపోగా లక్షలాది విద్యార్థులు నష్టపోతున్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి.

ఇక 2023వ సంవత్సరం పోటీ ఫలితాలు పరిశీలిస్తే అతి ముఖ్యమైన ఇంజనీరింగ్ విద్యకు సంబంధించిన జేఈఈ మెయిన్స్‌కు 9.5 లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 1,80,372 మంది మాత్రమే ఎంపిక కాగా వారిలో కేవలం 43,733 మంది విద్యార్థులే అర్హత సాధించారు. ఇక వైద్యవిద్యకు సంబంధించిన నీట్ పరీక్షలో 20.87 లక్షల మంది విద్యార్థులు రిజిష్టరు చేసుకోగా, 20,38,586 మంది మాత్రమే పరీక్ష రాయగా 11.4 లక్షల మంది విద్యార్థులే అర్హత సాధించారు. మిగతా పోటీ పరీక్షా ఫలితాలు కూడా ఈ మాదిరిగానే ఉండే అవకాశముంది.

వృత్తి విద్యా కోర్సులకు ప్రస్తుతం నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు సత్వరంగా సంస్కరణలు చేపట్టాలి. పాఠశాల స్థాయిలో కెరీర్ గైడెన్స్ ఏర్పాటు చేస్తే ఆసక్తి, సామర్థ్యం గలవారే తమ అభీష్టానికి అనుగుణంగా కోర్సులు ఎంపిక చేసుకోగలుగుతారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో సాధించిన మార్కులకు అనుగుణంగానే ప్రవేశాలు కల్పించాలి. కాని పక్షంలో ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్ మార్కుల వెయిటేజ్ 50 శాతం, ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు 50శాతంతో ప్రవేశాలు కల్పించాలి. దీనివల్ల ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్ చదువుకు కూడా తగు ప్రాధాన్యం చేకూరుతుంది. అలాగే, ఇంటర్ సిలబస్ ఆధారంగానే పోటీ పరీక్షలు నిర్వహించాలి. 'పోటీ నుండి విద్యార్థుల్ని తొలగించాలనే' ఉద్దేశ్యంతో తికమకపర్చే కఠినమైన, కొన్ని సందర్భాల్లో సిలబస్‌కు అతీతమైన ప్రశ్నలు రూపొందించే ప్రస్తుత విధానాన్ని విడనాడాలి. శారీరక, మానసిక, నైతిక, జ్ఞానాత్మక రంగాల్లో సాధించిన అభివృద్ధిని మూల్యాంకనం చేసేలా ఉండాలి. ఇందుకు అనుగుణంగా ప్రవేశ పరీక్షల విధానాన్ని సమూలంగా సంస్కరించాలి. అప్పుడే దేశానికి మేలు చేకూరుతుంది.

వ్యాస రచయిత జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

క్లుప్తంగా...

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న గవర్నర్

- ట్రాఫిక్ పోలీసుల సమన్వయలోపం
- గవర్నర్ భద్రతా సిబ్బంది చొరవతో సజావుగా వెళ్లిన వాహనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అనూహ్యమైన రీతిలో ట్రాఫిక్ దిగ్బంధనంలో చిక్కుకున్నారు. గవర్నర్ సోమవారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని హనుమాన్ ఆలయానికి వచ్చారు. ఆ సమయంలో ఎర్రమంజిల్ నుంచి ఖైరతాబాద్ వెళ్లే మార్గంలో విపరీతంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడడంతో గవర్నర్ వాహనం అందులో ఇరుక్కుంది. వెంటనే గవర్నర్ భద్రతా సిబ్బంది అప్రమత్తమై ట్రాఫిక్‌ను సరిచేసి వాహనం సజావుగా వెళ్లిపోయేలా చేశారు. గవర్నర్ కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకోవడానికి ట్రాఫిక్ పోలీసుల సమన్వయ లోపమే కారణమని సమాచారం.

ప్రభుత్వోద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలి

- గవర్నర్ తమిళిసై


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై

శ్రీనగర్ కాలనీ: ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల మొదటివారం కచ్చితంగా చేనేత వస్త్రాలు ధరిస్తే చేనేత కళాకారులకు మరింత గుర్తింపును ఇచ్చిన వారమవుతామని గవర్నర్ తమిళిసై అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటుచేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... చేనేత కళాకారులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తున్నదని తెలిపారు.

బీసీలకు 60 % సీట్లు ఇవ్వకుంటే తిరుగుబాటే

మునుగోడు: అరవై శాతానికిపైగా ఉన్న బీసీల వాటాకు తగిన స్థానాలను అసెంబ్లీ ఎన్నికల్లో కేటాయించని పార్టీలపై తిరుగుబాటు తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీ నివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో జరగనున్న బీసీల రాజకీయ ప్లీనరీ నేపథ్యంలో సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 15న హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించే బీసీ రాజకీయ ప్లీనరీకి అధిక సంఖ్యలో వచ్చి సత్తా చాటాలని కోరారు.

విద్యార్థి ఉసురు తీసిన యాప్ లోన్ భయం

నెల్లికుదురు: యాప్ లోన్ ఎలా తీర్చాలో తెలియక భయాందోళనకు గురైన ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో జరిగింది. కొండెంగల గుట్టతండాకు చెందిన బానోతు కిషన్, అచ్చాలి దంపతుల కుమారుడు బానోతు ఆకాశ్(22) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో బీటెక్ చదుతున్నాడు. అవసరాల కోసం ఓ యాప్ ద్వారా రూ.30 వేల లోన్ తీసుకున్నాడు. అనంతరం లోన్ చెల్లించడం ఎలాగో తెలియక ఆందోళన చెందాడు. ఈ నెల 9న స్వగ్రామానికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం చెప్పగా, 'లోన్ చెల్లిదాం.. బాధపడొద్దు'అని ధైర్యం చెప్పారు. అయినా ఆకాశ్ మనసు కుదుటపడలేదు. మనస్తాపంతో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

నిర్లక్ష్యపు జలపాతం

వాంకిడి(ఆసిఫాబాద్): నిరంతరంగా పారుతున్న ఈ జలపాతం ఎక్కడుందబ్బా అనుకుంటున్నారా? అది జలపాతం కాదు.. కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని అడ(కుమురంభీం) ప్రాజెక్టు ఎడమ కాలువ. వర్షాలకు దెబ్బతిని ఇలా నీరు వృథా అవుతోంది. అడ ప్రాజెక్టు నీటిని వాంకిడి, కాగజ్‌నగర్ మండలాల్లోని పొలాలకు మళ్లించేందుకు ఈ ఎడమ కాలువను నిర్మించారు. 2021, 2022లో కురిసిన వర్షాలకు ఈ కాలువ చిన్నవాంకిడి, లంజన్‌వీర గ్రామాల సమీపంలో దెబ్బతింది. అప్పటినుంచి మరమ్మతు సరిగ్గా చేయలేదు. 2021 వేసవిలో జిల్లాలో పర్యటించిన సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్ ఈ కాలువను పరిశీలించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినా ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. లంజన్‌వీర గ్రామ సమీపంలో వాగు పైనుంచి వెళ్తున్న కాలువకు లీకేజీలతో సాగునీరు వృథాగా పోతూ సోమవారం ఇలా కనిపించింది. పలుచోట్ల సిమెంట్ లైనింగ్ కూడా వేయకుండా వదిలేశారని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


జలపాతాన్ని తలపిస్తున్న కాలువ లీకేజీ

నైరుతి వాన.. 30శాతం లోటే!

▶ మొదటి పేజీ తరువాయి

సాగునీటితోపాటు పలు ఇతర శాఖలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే రెండు దఫాలుగా భేటీ అయిన వివిధ శాఖల ఉన్నతాధికారులు.. కరువు పరిస్థితులు ఏర్పడితే ఎదుర్కొనేందుకు ఏం చేయాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు.

ఇప్పటికే 30శాతం లోటు

సాధారణంగా మే నెలాఖరు లేదా జూన్ తొలివారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. కానీ ఈసారి జూన్ మూడో వారంలో రాష్ట్రాన్ని తాకాయి. మూడు రోజుల్లోనే రాష్ట్రమంతటా విస్తరించడంతో.. వానలు ఆశాజనకంగా ఉంటాయని తొలుత భావించినా, తర్వాత ఆ ఆశలు సన్నగిల్లాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర ప్రాంత జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వానలు పడగా.. మిగతా ప్రాంతాల్లో అడపాదడపా తేలికపాటి వానలు మాత్రమే కురుస్తున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో తీవ్ర స్థాయిలో లోటు ఉంది. రాష్ట్రంలో సాధారణంగా నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు(జూలై 10వ తేదీ వరకు) సగటున 19.19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఈసారి 13.49 సెంటీమీటర్ల మేర మాత్రమే కురిసింది. అంటే 30శాతం లోటు ఉంది. ఇందులోనూ కొన్ని జిల్లాల్లో తీవ్రమైన లోటు ఉంది.

కొనసాగుతున్న లోటు..

జూన్ నెలలో రాష్ట్రంలో సగటున 12.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... కేవలం 7.20 సెంటీమీటర్లు అంటే 55.68 శాతమే వర్షం మాత్రమే కురిసింది. జూలైలో ఇప్పటివరకు 6.29 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణమే అయినా.. ఇప్పట్లో వానలు పడే అవకాశాలు కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. తొలకరి వానలతో సాగు మొదలుపెట్టిన రైతులు ఆందోళనలో పడ్డారు.

23 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

రాష్ట్రంలోని మెజార్టీ జిల్లాల్లో వర్షాలు ఆశించినంతగా లేవు. 23 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులే కనిపిస్తున్నాయి. నిర్మల్, సంగారెడ్డి, సిద్దిపేట, జనగాం, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. అయితే ఈ జిల్లాల్లోనూ కొన్నిప్రాంతాలకే వానలు పరిమితం అయ్యాయని అధికారులు చెప్తున్నారు. మిగతా 23 జిల్లాల్లో లోటు, అత్యంత లోటు వర్షపాతమే ఉన్నట్టు వివరిస్తున్నారు.

ప్రత్యామ్నాయాలపై కసరత్తు

లోటు వర్షపాతం కొనసాగితే ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఉన్నతాధికారులు వివిధ రంగాలు, అంశాల వారీగా పడే ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పరిస్థితులను పూర్తిగా అంచనా వేసి, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని అధికారులు తెలిపారు.

దక్షిణ జిల్లాల్లో లోటు తప్పనట్టే!

రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. ఉత్తర ప్రాంత జిల్లాల్లో సాధారణ వర్షపాతానికి కాస్త అటూ ఇటూగా వానలు పడినా.. దక్షిణ ప్రాంత జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదవుతుంది. జూన్, జూలై నెలల్లో ఈ పరిస్థితులే కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాల కదలికలు, బంగాళాఖాతంలో నెలకొనే పరిస్థితులను బట్టి వానల తీరు ఆధారపడి ఉంటుంది.– వాతావరణ శాఖ తాజా అంచనా ఇదీ..

భూ తగాదా తీరితేనే | నాన్న శవానికి అంత్యక్రియలు

- భూమి కోసం ఘర్షణలో అన్న దాడిలో తమ్ముడి మృతి
- ఆ భూమి దక్కే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని తమ్ముడి కుటుంబసభ్యుల పట్టు
- ఆస్పత్రిలోనే మృతదేహాన్ని ఉంచి నిరసన

హాలియా: భూమి కోసం ఇద్దరి అన్నదమ్ముల కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు మృతి చెందాడు. అయితే ఆస్తి దక్కే వరకు మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించేది లేదని మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో ఉంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారుణ ఘటన అనుముల మండలంలోని యాచారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బైరు చెన్నయ్య, బైరు సైదులు సొంత అన్నదమ్ములు. చెన్నయ్యకు ముగ్గురు కుమారులు సంతానం కాగా సైదులుకు ఇద్దరు కుమార్తెలు. యాచారంలో తండ్రి వారసత్వంగా వచ్చిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో ఇరువురు అన్నదమ్ములు చెరో రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. కాగా తండ్రి మరణాంతరం ఇంటికి పెద్ద కుమారుడైన బైరు చెన్నయ్య పేరున నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి పట్టా అయ్యింది. ఈ భూమి పట్టా విషయంలో కొంత కాలంగా అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో నడుస్తోంది.


సైదులు

చనిపోయి మూడురోజులైనా..

కాగా ఈ నెల 8న ఇరు కుటుంబాల వారు మరోసారి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో చెన్నయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు కలిసి బైరు సైదులును కొట్టడంతో ఊపిరాడక కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే సైదులు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుమార్తె పూజిత హాలియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బైరు చెన్నయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది. కాగా ఆస్తి విషయంలో తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని గత మూడు రోజులుగా మృతదేహాన్ని నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రిలో ఉంచి సైదులు కుటుంబ సభ్యులు నిరసన తెలుపుతున్నారు. భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేసే వరకు మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించేదిలేదని కుటుంబ సభ్యులు భీష్మించుకు కూర్చున్నారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఈ వివాదానికి పరిష్కార మార్గం చూపుతున్నట్లు తెలిసింది.

టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసులో 18 మంది అరెస్టు

- అంతా ఏఈ ప్రశ్నపత్రం రమేశ్ నుంచి ఖరీదు చేసిన వాళ్లే
- ఇప్పటివరకు 74 మంది కటకటాల్లోకి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ అధికారులు సోమవారం 18 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ ఏడాది మార్చ్‌లో వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ఒకేసారి ఇంతమందిని అరెస్టు చేయడం ఇదే తొలిసారి. ఈ నిందితులంతా మాజీ ఏఈ పూల రమేశ్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ప్రశ్నపత్రం ఖరీదు చేసిన లేదా ఆ వ్యవహారంలో దళారులుగా వ్యవహరించిన వారే. వీరితో కలిపి ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 74కు చేరింది. పూల రమేశ్‌తో నెట్‌వర్క్‌ను ఛేదిస్తున్న సిట్ ఒక్కొక్కరిని అరెస్ట్ చేస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కమిషన్ కార్యదర్శి మాజీ వ్యక్తిగత సహాయకుడు పులిదిండి ప్రవీణ్‌కుమార్ ద్వారా ఏఈ పేపర్ పూల రమేశ్‌కు చేరింది. ఇతగాడు దాన్ని తన స్నేహితులు, పరిచయస్తులతో పాటు ఇతర మార్గాల్లోనూ విక్రయానికి పెట్టాడు. అభ్యర్థులకు రూ.30 లక్షలకు అమ్ముదామని, వారిని తీసుకువచ్చిన వారికి భారీ కమీషన్లు ఇస్తానని ఎర వేశాడు. అప్పటికే హైటెక్ మాస్ కాపీయింగ్ వ్యవహారాలు నడుపుతున్న రమేశ్‌కు అనేక మంది దళారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఏఈ పరీక్షలో కాపీయింగ్‌తో పని లేకుండా ప్రశ్నపత్రాలే దొరికాయి. దీంతో ఆయన పని మరింత తేలికై.. అనేక మందికి వివిధ ప్రశ్నపత్రాలు విక్రయించాడు. ఈ నెట్‌వర్క్‌ను ఛేదిస్తున్న సిట్ అధికారులు వరుస అరెస్టులు చేస్తున్నారు. సోమవారం అరెస్టయిన వారిలో హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ సహా వివిధ జిల్లాలకు చెందిన డి.శివకుమార్, పి.సురేందర్, హరికృష్ణ, ధరావత్ రాజేష్, జెన్నాయిల అశోక్, ధరావత్ కళ్యాణ్, బానోతు నాగరాజు, తోట విజయ్‌కుమార్, గడ్డం అజయ్ కుమార్, గుగులోతు సునీల్, కోడి సంతోష్, మర్కి రాములు తదితరులు ఉన్నారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరచగా.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. తుదపరి విచారణ కోసం వీరిని పోలీసు కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సిట్ నిర్ణయించింది. రమేశ్ లింకులో మరికొందరినీ అరెస్టు చేయాల్సి ఉందని, దళారులు, పరీక్ష రాసిన వారు కలిపి మొత్తం నిందితుల సంఖ్య 100కు పైగానే ఉండవచ్చని భావిస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థి అదృశ్యం

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్‌ఐటీ విద్యార్థి బన్నీ(19) కనిపించడంలేదు. ఈ మేరకు బన్నీ తల్లిదండ్రులు బాసర పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన కత్తుల వెంకటేశ్, పద్మ దంపతుల రెండో కుమారుడైన బన్నీ ట్రిపుల్ ఐటీలో సెకండియర్ చదువుతున్నాడు. ఈ నెల 6న ఇంటికి వెళ్తున్నానని చెప్పి అతను అవుట్‌పాస్ తీసుకుని వెళ్లాడు. ట్రిపుల్‌ఐటీ నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అయితే కుమారుడి నుంచి ఫోన్ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆదివారం బన్నీ మిత్రులకు ఫోన్ చేసి తమ కుమారుడి గురించి అడిగారు. బన్నీ ఈ నెల 6వ తేదీనే అవుట్‌పాస్ తీసుకుని వెళ్లాడని చెప్పడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజులైనా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆదివారమే బన్నీ తల్లిదండ్రులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సంఘటన జరిగిన ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాలని అక్కడ సూచించడంతో సోమవారం బాసర పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బన్నీ

మహారాష్ట్ర వైపు ప్రయాణం!

పోలీసులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు బన్నీకి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. గురువారం బాసర రైల్వేస్టేషన్ వెళ్లిన బన్నీ, మహారాష్ట్రలోని పుణేవైపు వెళ్లే రైలులో ప్రయాణించినట్లు తెలుస్తోంది. బన్నీ సెల్ స్విచ్ఛాఫ్ వస్తోందని సమాచారం. అయితే అతను మరో నంబరు వాడుతున్నట్లు తెలుస్తోంది. కొత్త నంబరుకు మెసెజ్ చేయగా సోమవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారి ఆన్‌చేసి మళ్లీ వెంటనే ఆఫ్ చేశాడని చెబుతున్నారు. పర్బని ప్రాంతంలో అతను ఉన్నట్లు మొబైల్ సిగ్నల్స్ ద్వారా తెలుస్తోంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

దళారులను నమ్మి మత్స్యకారులు మోసపోవద్దు

- తక్కువ ధరకు చేపలు అమ్ముకోవద్దు
- చేపల చెరువుల లీజును నేరుగా మీ సేవలో చెల్లించవచ్చు
- మత్స్యకారుల సమస్యలపై 90444–80333 హెల్ప్‌లైన్ ప్రారంభం
- జాతీయ మత్స్యకారుల దినోత్సవంలో మంత్రి తలసాని



సాక్షి, హైదరాబాద్: దళారుల మాయమాటలు నమ్మి చేపలను తక్కువ ధరకు అమ్ముకోవద్దని మత్స్యకారులకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవుపలికారు. చేపల చెరువులపై దళారుల పెత్తనాన్ని నిర్మూలించి మత్స్యకారులకే పూర్తి హక్కులు కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. మత్స్యకారులు చేపల చెరువుల లీజును నేరుగా మీ సేవలో చెల్లించవచ్చునని, పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న చెరువులను కూడా మత్స్యశాఖ పరిధిలోకి తీసు కొచ్చామని గుర్తు చేశారు. జాతీయ మత్స్యకారుల దినోత్సవం సోమవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్‌సిన్హా, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, వివిధ జిల్లాలకు చెందిన మత్స్యకారులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం 90444–80333 హెల్ప్‌లైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి మత్స్యకారులలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలనే సంకల్పంతో అర్హులైన లక్షమంది మత్స్యకారులను మత్స్య సొసైటీలలో సభ్యులుగా చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఇప్పటి వరకు 45 వేల మందికి సభ్యత్వం ఇచ్చామన్నారు. మత్స్యకారుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మెరుగైన సేవలను అందించిన మత్స్య శాఖ అధికారులకు మంత్రి ప్రశంసాపత్రం, మెమెంటోలను అందజేసి సత్కరించారు.

జేఎన్‌జేకు పేట్‌బషీరాబాద్ స్థలం ఎందుకు అప్పగించరు?

- రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు

పంజగుట్ట (హైదరాబాద్): సుప్రీంకోర్టు తీర్పు వచ్చి 10 నెలలు గడుస్తున్నా జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్‌మ్యాక్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన రెండు స్థలాల్లోని పేట్‌బషీరాబాద్ భూమిని సొసైటీకి ఎందుకు అప్పగించరని పలువురు సీనియర్ పాత్రికేయులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థలాల స్వాధీనం కోసం అన్ని రాజకీయ పక్షాలను సమన్వయం చేసుకుని, ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగుదామని వారు పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జవహర్‌లాల్ నెహ్రూ మ్యాక్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 'జేఎన్‌జే మ్యాక్స్ హౌసింగ్ సొసైటీ స్థలాలు–సుప్రీం కోర్టు తీర్పు అమలుపై' రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు పి.వి.రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయులు దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్, పాశం యాదగిరి, మిట్టపల్లి శ్రీనివాస్, మ్యాడం మధు, జగన్మోహన్ రెడ్డి, అంబటి ఆంజనేయులు, నాగేశ్వరరావు, సూర్యారావు, ఆకుల అమరయ్య, మాలకొండయ్య, సుందర్‌శర్మ, కె.వి.ఎస్.సుబ్రమణ్యం మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా సుదీర్ఘకాలంగా తీర్పును అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. జేఎన్‌జేకి చెందిన 1,100 మంది సభ్యుల సమస్యను మిగతా 5 వేల మందితో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల సహకారం తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. సీనియర్ సంపాదకుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎంతో మంది సభ్యులు మృతి చెందారని, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 3 దఫాలుగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి న చరిత్ర ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే గాంధేయ మార్గంలో ఉద్యమించాలని చెప్పారు.

ఇద్దరు బిడ్డలను చంపేసి తండ్రి పరార్


గోపాలరావు


ఆరాధ్య

మధిర: ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన ఓ కసాయి తండ్రి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి పరారయ్యాడు. సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా. గ్రామానికి చెందిన పార్శపు శివరామ గోపాలరావు అదే గ్రామానికి చెందిన ఏసుమణి(చిన్నమ్మాయి)ని పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు రామకృష్ణ(8), కుమార్తె ఆరాధ్య(6) ఉన్నారు. నెల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రాగా, ఏసుమణి ఇద్దరు పిల్లలతో కలిసి అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. ఇక అడ్డుఅదుపు లేక గోపాలరావు చెడు వ్యసనాలకు బానిసై చివరికి చోరీల బాట పట్టాడు. వారం క్రితం ఓ చోరీ కేసులో మధిర టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. కాగా, గోపాలరావు సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామంలో ఉన్న స్కూలుకి వెళ్లి ఇద్దరు పిల్లలను ఇంటికి తీసుకొచ్చాడు. ఎవరూ లేని సమయంలో ఇద్దరు పిల్లల గొంతు నులిమి చంపి దుప్పట్లో మూటకట్టి పరారయ్యాడు. సాయంత్రం ఐదు దాటినా పిల్లలు రాక పోవడంతో ఏసుమణి ఆరా తీయగా తండ్రి తీసుకెళ్లినట్లు స్థానికులు చెప్పారు. దీంతో ఇంటికి వెళ్లి చూడగా బీరువా పక్కన ఇద్దరు పిల్లలను ఉంచిన మూట బయటపడింది. రోదిస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే రామకృష్ణ, ఆరాధ్య మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. వైరా ఏసీపీ రెహమాన్, సీఐ వసంత్ కుమార్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ రాయపట్నం చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

మధ్యతరగతి మందహాసం!

సాక్షి, హైదరాబాద్: దేశమేదైనా మధ్యతరగతి వివిధ రూపాల్లో నిర్వహించే పాత్ర ప్రత్యేకతను చాటుతున్న విషయం తెలిసిందే. సమాజంలో కీలకమైన వర్గంగా పేరుబడిన ఈ నడిమి తరగతి క్రమంగా దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. దీనికి తగ్గట్టుగానే భారత్‌లోని మధ్యతరగతి 2047 నాటికి అంటే దేశం స్వాతంత్య్రం సాధించి వందేళ్లు పూర్తిచేసుకునే నాటికి మొత్తం జనాభాలో 61 శాతానికి చేరుకోబోతున్నట్టుగా అధ్యయనాలు చెపుతున్నాయి. మనదేశంలో 2020–21లో 43.2 కోట్లున్న నడిమి తరగతి జనాభా 2030–31కల్లా 71.5 కోట్లకు, 2047నాటికి 102కోట్లకు (ఆనాటికి... మొత్తం 166 కోట్ల భారత జనాభాలో) పైగా చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 31 శాతంగా ఉన్న దేశ మిడిల్‌క్లాస్ వచ్చే పాతికేళ్లలో రెండింతలకు పైగా వృద్ధి నమోదు చేస్తుందని అంటున్నారు. తాజాగా పీపుల్స్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) 'ద రైజ్ ఆఫ్ ఇండియాస్ మిడిల్‌క్లాస్' నివేదికలో పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. 25 రాష్ట్రాల్లోని 40 వేల కుటుంబాలకు పైగా చే సిన అధ్యయనం ఆధారంగా నివేదిక తయారు చేశారు.

2020–21లో 43.2 కోట్లున్న నడిమి తరగతి జనాభా

- 2030–31కల్లా 71.5 కోట్లకు, 2047 నాటికి 100 కోట్లకుపైగా చేరిక
- ప్రస్తుత 31 శాతం నుంచి... 25 ఏళ్లలో రెండింతలకు వృద్ధి
- కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షలదాకా ఉన్నవారిని మధ్యతరగతిగా పరిగణన
- 'ద రైజ్ ఆఫ్ ఇండియాస్ మిడిల్ క్లాస్' నివేదికలో పలు అంశాల వెల్లడి



ఇదీ నివేదిక...

దేశంలో రాజకీయ స్థిరత్వం కొనసాగింపుతో పాటు ఆర్థిక సంస్కరణల అమలు ద్వారా ప్రతీ ఏడాది 6 నుంచి 7 శాతం వార్షిక వృద్ధి రేటును సాధించడం కొనసాగిస్తే వచ్చే రెండు, రెండున్నర దశాబ్దాల కాలంలోనే భారత్ ప్రపంచంలోని అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటిగా అవతరిస్తుందని ఈ నివేదిక అంచనా వేస్తోంది. ధనికవర్గం సంపాదించే ఆదాయం ఎక్కువగానే ఉన్నా...జనాభారీత్యా భారత మధ్యతరగతి సంఖ్యాపరంగా అధికంగా ఉన్నందున ఆర్థికరంగాన్ని నడిపించడంలో ఈవర్గం కీలకపాత్ర పోషించనుందని ఇందులో పేర్కొన్నారు. ఈ దశాబ్ది చివరికల్లా తక్కువ ఆదాయం ఆర్జించే వర్గం కాస్తా క్రమంగా నడిమితరగతిలో భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. మధ్యతరగతిలో భారీగా పెరుగుదల, ధనికుల క్రీమీలేయర్‌గా అత్యున్నత స్థాయిలో నిలవడంతో అల్పాదాయ, ఇతర కిందిస్థాయి వర్గాల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని అంచనా వేస్తోంది. ఇదిలా ఉంటే...2030–31 కల్లా దేశంలోని 'సూపర్‌రిచ్ హౌస్‌హోల్డ్స్' ఐదింతలు పెరగడంతో పాటు, ఈ వర్గాలు అధికంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పెరుగుతాయని పేర్కొంది.

మధ్యతరగతి పరిగణన ఎలా?

మధ్యతరగతి అంటే ఏమిటి అన్న దానికి ప్రపంచవ్యాప్తంగా ఒక స్పష్టమైన, ఒకేవిధమైన నిర్వచనమంటూ ఇంకా స్థిరపడలేదు. భారత్‌లో 2020-21 ధరల ఆధారంగా చూస్తే మాత్రం... ఏడాదికి రూ.1.09 లక్షల నుంచి రూ.6.46 లక్షల వార్షికాదాయం సంపాదించే వారిని లేదా కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్యలో ఉన్న వారిని మధ్యతరగతిగా పరిగణిస్తున్నారు.

నిపుణులేమంటున్నారంటే...

భారత్‌లో మధ్యతరగతి కుటుంబాలు పెరిగేకొద్దీ నడిమి తరగతి వర్గం (కేటగిరి) వృద్ధి చెందడం ద్వారా నాణ్యమైన వైద్య ఆరోగ్యసేవలు, విద్య, గృహ నిర్మాణరంగం, వినిమయ వస్తువులు తదితరాలకు డిమాండ్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడం కోసం విద్య, వైద్యంపై మరింత ఫోకస్‌ను పెంచాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఏతావాతా చూస్తే... మధ్యతరగతి జనాభా పెరుగుదల ద్వారా 2047 నాటికి పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ విధంగా భారత్ వృద్ధికి, పురోగతి విషయంలో మధ్యతరగతి కీలకపాత్ర పోషిస్తుందని వారు భావిస్తున్నారు.

క్లుప్తంగా...

టమాటా లోడుతో పరారీ

యశవంతపుర: టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ.. బెంగళూరులో టమాటాలతో ఉన్న బొలెరో వ్యాన్‌తో దుండగులు పరారయ్యారు. చిత్రదుర్గకు చెందిన రైతులు బొలెరో వాహనంలో టమాటా లోడుతో బెంగళూరు ఆర్‌ఎంసీకి వచ్చారు. మార్కెట్ యార్డులో వాహనాన్ని నిలిపి టీ తాగడానికి వెళ్లారు. ఇదే అదనుగా ముగ్గురు వ్యక్తులు ఆ వ్యాన్‌ను స్టార్ట్ చేశారు. అడ్డగించగా రైతులే తమ వాహనాన్ని ఢీకొట్టారంటూ బుకాయించారు. దెబ్బతిన్న తమ వాహనం చూపిస్తామంటూ రైతులను కూడా బొలెరోలోకి ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక రైతులను బయటకు తోసేసి వాహనంతో పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంసీ యార్డ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బొలెరో వాహనంలో 250కి పైగా ట్రేల్లో టమాటాలున్నాయి. కిలో టమాటా ధర కనీసం రూ.100 లెక్కన 2 టన్నుల టమాటా విలువ రూ.2 లక్షలుంటుంది.

300 మంది శరణార్థులు సముద్రంలో గల్లంతు

దాకర్: ఆఫ్రికా దేశమైన సెనెగల్ నుంచి దాదాపు 300 మంది శరణార్థులతో స్పెయిన్‌కు బయలుదేరిన మూడు పడవలు అట్లాంటిక్ సముద్రంలో గల్లంతయ్యాయి. స్పెయిన్‌కు చెందిన వాకింగ్ బోర్డర్స్ అనే స్వచ్ఛంద సంస్థ సోమవారం ఈ విషయం వెల్లడించింది. రెండు పడవలు జూన్ 23న సెంట్రల్ సెనెగల్‌లోని కోస్తా తీర ప్రాంత నగరం ఎంబౌర్ నుంచి బయలుదేరింది. వీటిలో 100 మంది ఉన్నారు. 200 మందితో రెండో పడవ జూన్ 27న కఫౌంటైన్ పట్టణం నుంచి బయలుదేరింది. తర్వాత మూడు పడవల నుంచి హఠాత్తుగా సంకేతాలు నిలిచిపోయాయి. అవి సముద్రంలో గల్లంతైనట్లు గుర్తించారు. స్పెయిన్ అధికారులు విమానాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

'ఆర్డినెన్స్'పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సర్వీసులను నియంత్రిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై వైఖరిని తెలియజేయాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆర్డినెన్స్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పిటిషన్‌లో సవరణ చేయాలని, ఇందులో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను కూడా ప్రతివాదిగా చేర్చాలని ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీకి సూచించింది.



కరోనాతోనూ వస్తుంది...!

చిలీని వణికిస్తున్న వింత వైరస్!

నరాలు, కండరాలు నిర్వీర్యం | పక్షవాతానికీ దారి తీయొచ్చు
దేశమంతా పెరుగుతున్న కేసులు | మూణ్నెల్లు నేషనల్ ఎమర్జెన్సీ!

జీబీ సిండ్రోమ్ ఎందుకు వస్తుందన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. తరచూ ఇన్ఫెక్షన్లు, ముఖ్యంగా కాంపిలోబాక్టర్ జెజునీ బ్యాక్టీరియా ఈ సిండ్రోమ్‌కు కారణంగా మారుతున్నట్టు మాత్రం తేలింది. అయితే ఇన్‌ఫ్లుయెంజా, సైటోమెగలూ, ఎప్‌స్టెయిన్ బర్‌తో పాటు కోవిడ్ వైరస్ కూడా జీబీఎస్‌కు దారి తీసే ప్రమాదం పుష్కలంగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తుండటం కలవరానికి గురి చేస్తోంది!

శాంటియాగో: గిలాన్ బరే (జీబీఎస్) అని పిలిచే అరుదైన సిండ్రోమ్ ఒకటి దక్షిణ అమెరికా దేశం చిలీని నిలువునా వణికిస్తోంది. ఈ వింత వ్యాధి బారిన పడి జనం అల్లాడుతున్నారు. అసలేం చేయాలో ప్రభుత్వానికే పాలుపోవడం లేదు. చివరికి దేశవ్యాప్తంగా ఏకంగా మూడు నెలల పాటు ఎమర్జెన్సీ విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది...



ఏమిటీ జీబీ సిండ్రోమ్?

ఒంట్లోని వ్యాధి నిరోధక శక్తే నరాల వ్యవస్థను శత్రువుగా భావించి దాడికి దిగే అత్యంత అరుదైన (ఆటో ఇమ్యూన్) సిండ్రోమ్ ఇది. నరాలపై ఈ దాడి చివరికి ఒంట్లోని కండరాల వ్యవస్థ మొత్తాన్నీ పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది. దాంతో విపరీతమైన నిస్సత్తువ, అవయవాలు మొద్దుబారడం వంటి దుర్లక్షణాలు వేధిస్తాయి. ఇది సాధారణంగా కాళ్లలో మొదలై నెమ్మదిగా పైకి పాకుతూ ఒళ్లంతా ఆక్రమిస్తుంది. జీబీఎస్ బాగా ముదిరితే పక్షవాతానికి కూడా దారి తీస్తుందని జిన్ హువా వార్తా సంస్థ పేర్కొంది. పెద్దవాళ్లకు, ముఖ్యంగా మగవాళ్లకు ఇది ఎక్కువగా సంక్రమిస్తుంది. అయితే అన్ని వయసులవారికీ దీనితో రిస్కే!

గుర్తించడమెలా?

ప్రధానంగా రోగ లక్షణాలు, నరాల పరీక్ష ద్వారా జీబీఎస్ ఉనికి బయట పడుతుంది. ముఖ్యంగా స్పైనల్ టాప్, ఎలక్ట్రోమియోగ్రఫీ వంటివి దీన్ని కచ్చితంగా పట్టిస్తాయి.

ఇవీ లక్షణాలు...

జీబీఎస్ తాలూకు అత్యంత ప్రధాన లక్షణం విపరీతమైన నీరసమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరొలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్ వెల్లడించింది. తొలి దశలో మెట్లెక్కుతుంటేనో, నడుస్తుంటేనో కూడా విపరీతమైన నీరసం రావడాన్ని దీని తొలి లక్షణంగా భావించవచ్చు. తర్వాతి దశలో శ్వాసప్రక్రియను నియంత్రించే కండరాలు బాగా బలహీనపడతాయి. ఎంతలా అంటే, మెషీన్ సాయంతో ఊపిరి తీసుకోవాల్సి కూడా రావచ్చు! ఈ లక్షణాలు తలెత్తిన రెండే రెండు వారాల్లో సమస్య బాగా ముదిరి రోగిని కదల్లేని స్థితికి చేరుకుంటాడు! నరాలు బాగా దెబ్బ తింటాయి గనుక నరాల వ్యవస్థ నుంచి మెదడుకు అస్తవ్యస్త సంకేతాలు అందుతుంటాయి. దాంతో చర్మం లోపల పురుగులు పాకుతున్నట్టు చెప్పలేని బాధ సలుపుతుంటుంది.

ఇతర లక్షణాలు

- చూపు తగ్గడం, కంటి కండరాలు దెబ్బ తినడం.. మాట్లాడటం, నమలడం, మింగడం కష్టంగా మారడం
- చేతులు, అరికాళ్లలో సూదులతో గుచ్చుతున్నట్టు విపరీతమైన బాధ
- విపరీతమైన ఒళ్లు నొప్పులు, ముఖ్యంగా రాత్రిపూట
- శారీరక, మానసిక సమన్వయ లోపం, నిలకడలేమి
- హృదయస్పందన, రక్తపోటు విపరీతంగా పెరిగిపోవడం
- జీర్ణాశయ, పిత్తాశయ సంబంధిత సమస్యలు

చికిత్స ఉందా?

జీబీఎస్‌కు ఇప్పటికైతే ఇదమిత్థంగా చికిత్స అంటూ ఏమీ లేదు. సమస్య తీవ్రతను తగ్గించి, త్వరగా కోలుకునేందుకు సాయపడే మార్గాలు మాత్రమే ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. దీనికి ప్రధానంగా వాడుతున్న చికిత్స ఇంట్రావీనస్ ఇమ్యునోగ్లోబులిన్ (ఐవీఐజీ). నరాలపై దాడికి దిగకుండా రోగ నిరోధక శక్తిని ఇది నియంత్రిస్తుంది.

సాక్షి, నేషనల్ డెస్క్



మణిపూర్‌లో హింసను అరికట్టాల్సింది అధికారులే

శాంతి భద్రతల యంత్రాంగాన్ని మా చేతుల్లోకి తీసుకోలేం
సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసాకాండను అరికట్టే విషయంలో శాంతి భద్రతల యంత్రాంగాన్ని తమ చేతుల్లోకి తీసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో హింస మరింత పెచ్చరిల్లడానికి న్యాయస్థానం ఒక వేదిక కాకూడదని పేర్కొంది. హింసను నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్దాలని మాత్రమే అధికారులకు తాము సూచించగలమని వెల్లడించింది. మణిపూర్‌లో హింసకు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వివిధ సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొనడానికి సానుకూల సూచనలు మంగళవారంలోగా ఇవ్వాలని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరవేస్తామని పిటిషనర్లకు తెలియజేసింది.

ఇప్పటిదాకా 142 మంది మృతి

రాష్ట్రంలో గత రెండు నెలలుగా కొనసాగుతున్న హింసాకాండలో 142 మంది మరణించారని మణిపూర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు సోమవారం ఒక నివేదిక సమర్పించింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటిదాకా 5,995 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 6,745 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామని మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషీ తెలియజేశారు. తదుపరి విచారణ కోసం ఆరు కేసులను సీబీఐకి బదిలీ చేశామన్నారు.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. సోమవారం ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పీ జిల్లాల సరిహద్దులోని రెండు గ్రామాల్లో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒక పౌరుడు మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పాయేంగ్, సింగ్‌డా గ్రామాల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఒకరు చనిపోయారు. ఇద్దరు గాయాలపాలయ్యారు. కాల్పులకు ఉపయోగించిన రైఫిల్‌ను పోలీసుల నుంచే దొంగిలించినట్లు అధికారులు గుర్తించారు. కాల్పుల ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దుకాణాలను, వ్యాపార సంస్థలను మూసివేశారు.

14న ఎల్‌వీఎం.. 23న పీఎస్‌ఎల్‌వీ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెలలో రెండు ప్రయోగాలు చేయనుంది. ఈనెల 14వ తేదీన ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ ద్వారా అత్యంత ముఖ్యమైన చంద్రయాన్‌–3 ప్రాజెక్టు ప్రయోగాన్ని, 23వ తేదీన పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఇకపై ఏటా కనీసం 12 రాకెట్లు ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు.

ఒకేసారి ఐదు రాకెట్లను అనుసంధానం చేసే సత్తా

మొదటి ప్రయోగవేదికకు సంబంధించి పీఎస్‌ఎల్‌వీ ఇంటిగ్రేషన్ బిల్డింగ్ (ఫిఫ్), మొబైల్ సర్వీస్ టవర్‌ల ద్వారా ఒకేసారి రెండు రాకెట్లను అసెంబ్లింగ్ చేయొచ్చు. రెండో ప్రయోగవేదికకు సంబంధించి మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్, శాటిలైట్ ఇంటిగ్రేషన్ బిల్డింగ్, రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లూ అందుబాటులో ఉన్నాయి. అంటే శ్రీహరికోటలో ఒకేసారి వేర్వేరు వేదికలపై ఐదు రాకెట్లను అనుసంధానం చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. వీటికి తోడ్పాటుగా రెండు ప్రయోగవేదికలు ఉన్నాయి. మరోవైపు ప్రైవేట్ అంతరిక్ష సంస్థల రాకెట్ల ప్రయోగాల కోసం ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్‌ను ప్రైవేట్‌పరం చేయాలని ఇస్రో భావిస్తోంది.

చంద్రయాన్‌-3లో అధిక ఇంధనం, అత్యున్నత ప్రమాణాలు

న్యూఢిల్లీ: 14వ తేదీన ప్రయోగించబోయే ప్రతిష్టాత్మక చంద్రయాన్‌–3 రాకెట్‌లో అదనపు ఇంధనం నింపామని, అత్యున్నత 'ప్రమాణాలు' పాటిస్తున్నామని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చంద్రయాన్‌–2 ప్రాజెక్టులో విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై కూలిపోయిన అంశంపై మాట్లాడారు. ' 2019 సెప్టెంబర్‌లో సెన్సార్ ఫెయిల్యూర్, ఇంజిన్ ఫెయిల్యూర్, ఆల్గారిథమ్ ఫెయిల్యూర్, కాలిక్యులేషన్ ఫెయిల్యూర్ ఇలా తొలి విఫలం నుంచి చాలా నేర్చుకున్నాం. గత విజయాల నుంచి స్ఫూర్తి పొంది చంద్రయాన్‌–2ను రూపొందించాం. చంద్రయాన్‌–2 వైఫల్యం నుంచి గుణపాఠాలు నేర్చుకుని చంద్రయాన్‌–3ని సిద్ధంచేశాం. ఈసారి ఒకవేళ పరిస్థితులు అదుపు తప్పితే ఎలా పరిష్కరించాలి, ల్యాండర్‌ను ఎలా భద్రంగా జాబిల్లిపై దించాలనే అంశాలపై మరింత దృష్టిపెట్టాం. ల్యాండింగ్ స్థలాన్ని పెద్దదిగా నిర్ణయించుకున్నాం' అని చెప్పారు.

మిస్ నెదర్లాండ్స్‌గా ట్రాన్స్‌జెండర్ మహిళ

అమ్‌స్టర్‌డ్యామ్: మిస్ నెదర్లాండ్స్ కిరీటాన్ని ఓ ట్రాన్స్‌జెండర్ మహిళ రిక్కీ వలేరి కొల్లే గెలుచుకుంది. అందగత్తెల పోటీలో ట్రాన్స్‌జెండర్ మహిళ ఈ ఘనత సాధించడం నెదర్లాండ్స్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ విధంగా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించింది. 22 ఏళ్ల రిక్కీ వలేరి కొల్లే ప్రముఖ మోడల్స్ నుంచి ఎదురైన పోటీని అవలీలగా అధిగమించింది. విజేతగా నిలిచింది. మిస్ నెదర్లాండ్స్ టైటిల్ సాధించడం గర్వంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేసింది. మహిళలకు ఆదర్శం కావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది. ఎల్‌సాల్వేడార్‌లో జరుగనున్న మిస్ యూనివర్స్ పోటీల్లో రిక్కీ నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహించనుంది.



మోదీకి తిలక్ జాతీయ అవార్డు

పుణే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు అందజేయనున్నట్లు తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్(హింద్ స్వరాజ్ సంఘ్) తెలిపింది. ఆయన అత్యున్నత నాయకత్వానికి గుర్తుగా, ప్రజల్లో దేశభక్తి భావాన్ని మేలుకొల్పుతున్నందుకు గాను ఆయన్ను ఎంపిక చేసినట్లు వివరించింది. అవార్డు కింద జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామంది. పుణేలో ఆగస్టు ఒకటో తేదీన లోకమాన్య తిలక్ 103వ వర్ధంతి సందర్భంగా జరిగే ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శరద్‌పవార్‌ను ఆహ్వానించారు.

ఉత్తరాది అతలాకుతలం

- మూడో రోజూ కొనసాగిన భారీ వర్షాలు
- ప్రమాదస్థాయికి చేరుకున్న యమున
- వరదల్లో ఇప్పటిదాకా 37 మంది మృత్యువాత



హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో బియాస్ నది ఉధృతి ధాటికి కొట్టుకుపోయిన వంతెన



హరియాణాలోని పంచకులలో కోసుకుపోయిన రహదారి

న్యూఢిల్లీ/సిమ్లా/జైపూర్: ఉత్తరభారతంలో మూడో రోజూ వర్ష బీభత్సం కొనసాగింది. ఆకస్మిక వరదల్లో వాహనాలు, రహదారులు కొట్టుకుపోయాయి. పంటపొలాలు, నివాస ప్రాంతాలు నీటమునిగాయి. వానల ప్రభావం హిమాచల్ ప్రదేశ్‌పైనే ఎక్కువగా పడింది. ఇళ్లు కూలి, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఇప్పటి వరకు 18 మంది, పంజాబ్, హరియాణాల్లో 9 మంది, రాజస్తాన్‌లో ఏడుగురు, యూపీలో ముగ్గురు చనిపోయారు. దీంతో ఉత్తరాదిన వరదల్లో ఇప్పటిదాకా 37 మంది చనిపోయారు. హిమాచల్‌లోని వివిధ ప్రాంతాల్లో 200 మంది పర్యాటకులు చిక్కుబడిపోయారు. ఢిల్లీలో యమునా నది ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఆదివారం రికార్డు స్థాయిలో కురిసిన వర్షంతో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలిచిపోయింది. ప్రధాని మోదీ సోమవారం సీనియర్ మంత్రులు, అధికారులతో కలిసి ఉత్తరాదిన భారీ వర్షాలతో ఉత్పన్నమైన పరిస్థితులపై చర్చించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు స్థానిక యంత్రాంగాలతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ, సహాయక కార్యక్రమాలను చేపట్టాలని ప్రధాని కోరారని పీఎంవో తెలిపింది. ప్రధాని మోదీ హిమాచల్, ఉత్తరాఖండ్ సీఎంలతో మాట్లాడి, అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో కుండపోతగా వానలు కురుస్తున్నాయి. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో సోమవారం మరో నలుగురు చనిపోయారు. సిమ్లా–కాల్కా హైవేలో కొంత భాగం కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సిమ్లా–కాల్కా మార్గంలో పట్టాలపై కొండచరియలు విరిగిపడటంతో మంగళవారం వరకు రైళ్ల రాకపోకలను ఆపేశారు. రాష్ట్రంలో విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. వాతావరణ శాఖ రాగల 24 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా 120 రోడ్లపై రాకపోకలు బందయ్యాయని, 484 నీటి సరఫరా పథకాలపై ప్రభావం పడిందని అధికారులు తెలిపారు. జూలై 1–9 తేదీల మధ్య సాధారణ వర్షపాతం 160.6 మిల్లీమీటర్లకు మించి 69 శాతం ఎక్కువగా 271.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాజ్‌పుర విద్యుత్‌ప్లాంట్‌లోకి చేరిన నీరు

ఎగువనున్న హరియాణాలోని హత్నికుండ్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఢిల్లీలో యమునా నదిలో వరద పెరుగుతోంది. సోమవారం మధ్యాహ్నానికి ప్రమాద స్థాయి దాటి 205.33 మీటర్లకు చేరింది. మంగళవారం మధ్యాహ్నానికి 206.65 మీటర్లకు చేరి, క్రమేపీ తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. నదిలో నీరు 206 మీటర్ల మార్కును దాటితే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని సీఎం కేజ్రీవాల్ చెప్పారు. యమునా నదికి అత్యంత సమీపంలో సుమారు 41 వేల మంది నివసిస్తున్నట్లు అంచనా. గత ఏడాది సెప్టెంబర్‌లో రెండుసార్లు యమునా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహించింది. పంజాబ్, హరియాణాల్లో వానల తీవ్రత సోమవారమూ కొనసాగింది. పంజాబ్ రాష్ట్రం పటియాలా జిల్లాలోని రాజ్‌పుర విద్యుత్ ప్లాంట్‌లోకి వరద చేరడంతో 700 మెగావాట్ల యూనిట్‌ను అధికారులు మూసివేశారు. సట్లెజ్ యయునా లింక్ కెనాల్ పొంగిపొర్లి రాజ్‌పురలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలోకి నీరు చేరింది.

ఆస్పత్రుల్లోకి చేరిన వరద

రాజస్తాన్‌లోని 14 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అజ్మీర్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి, జేఎల్ఎన్ ఆస్పత్రి వార్డుల్లోకి వరద నీరు ప్రవేశించింది. టోంక్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్, బదౌన్ జిల్లాల్లో ఇళ్లు కూలిన ఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. షహరాన్‌పూర్‌లో 15 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాదిన మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది.

విపక్షాల భేటీకి సోనియా గాంధీ!



బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ నెల 17, 18న జరిగే ప్రతిపక్షాల కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సైతం హాజరయ్యే అవకాశం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సోమవారం చెప్పారు. ఈ భేటీలో పాల్గొనాలని సోనియాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారని తెలిపారు. ఆమె రాబోతున్నట్లు తమకు సమాచారం అందిందని అన్నారు. కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ ఒక్కటి కావాలని సూచించారు. దేశంలో మార్పు కోసం జరుగుతున్న మహా యుద్ధంలో పాల్గొనేందుకు ఎవరు ముందుకు వచ్చినా స్వాగతిస్తామని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తొలి సమావేశం జూన్ 23న బిహార్ రాజధాని పాట్నాలో జరిగిన సంగతి తెలిసిందే.

కిండర్‌గార్టెన్ వద్ద కత్తిపోట్లు.. ఆరుగురు మృత్యువాత

బీజింగ్: తన కుమారుడు కారు ప్రమాదానికి గురయ్యాడని ఓ వ్యక్తి ఉన్మాదిలా మారాడు. అతడి కత్తి పోట్లకు గురై ఆరుగురు చనిపోయారు. ఈ ఘటన చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని లిజియాంగ్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక కిండర్‌గార్టెన్ వద్ద ఉదయం 25 ఏళ్ల ఓ వ్యక్తి కత్తి చేతబట్టుకుని ఏడుగురిని పొడిచాడు. వీరిలో ఆరుగురు చనిపోయారు. మృతుల్లో ఒక టీచర్, ఇద్దరు చిన్నారులు, మరో ముగ్గురు ఉన్నారు. మరొకరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో నిందితుడి కుమారుడిని కారుతో గుద్దిన వ్యక్తి ఉన్నారని వార్తా వెబ్‌సైట్లు చెబుతున్నాయి. దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఉద్ధవ్ 'ఈసీ ఉత్తర్వు' పిటిషన్ 31న విచారణ



న్యూఢిల్లీ: శివసేన పేరు, ధనస్సు, విల్లంబు గుర్తు ఏక్‌నాథ్ షిండే వర్గానికి దక్కుతుందంటూ కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ నెలాఖరున విచారించనుంది. 'మే 11వ తేదీన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు ఈసీ వెలువర్చిన ఉత్తర్వు పూర్తిగా చట్టవ్యతిరేకం. పార్టీ పేరు, గుర్తును షిండే అక్రమంగా వినియోగిస్తున్నారు. త్వరలో వచ్చే ఎన్నికలు ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి కీలకం. అందుకే ఈ అంశాన్ని అత్యవసరంగా విచారణకు స్వీకరించండి' అంటూ న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ సుప్రీంకోర్టుకు కోరారు. దీంతో ఆ పిటిషన్‌ను 31వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం తెలిపింది. కాగా ఈ అంశంపై మహారాష్ట్రలో పార్టీ కార్యకర్తలతో భేటీ సందర్భంగా ఉద్ధవ్ మాట్లాడారు.' ఒక రాజకీయపార్టీకి ఎన్నికల గుర్తును కేటాయించే అధికారం ఈసీకి ఉంది. కానీ పార్టీ పేరును మార్చే అధికారం ఈసీకి లేదు' అని వ్యాఖ్యానించారు.

రాజ్యసభ బరిలో ఆరుగురు టీఎంసీ అభ్యర్థులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులను బరిలోకి దించాలని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. తమ అభ్యర్థులుగా డెరెక్ ఓబ్రెయిన్, సుఖేందు శేఖర్ రే, డోలా సేన్, బంగ్లా సంస్కృతీ మంచా అధ్యక్షుడు సమీరుల్ ఇస్లామ్, టీఎంసీ నేత ప్రకాశ్ చిక్ బరాయిక్, సమాచార హక్కు చట్టం కార్యకర్త, టీఎంసీ సీనియర్ నాయకుడు సాకేత్ గోఖలే పేర్లను సోమవారం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో ఆరు రాజ్యసభ స్థానాలను భర్తీ చేయడానికి ఈ నెల 24న ఎన్నికలు జరుగనున్నాయి. గుజరాత్, గోవాలో మొత్తం నాలుగు స్థానాలకు సైతం ఎన్నికలు జరుగుతాయి.

ఏడాది చివరికి పూర్తి 'ఆవాస్'..!

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించే లక్ష్యంతో చేపట్టిన ప్రధాని మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకాన్ని ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టి ఆదేశాలిచ్చింది. పీఎంఏవై(అర్బన్) కింద పట్టణ ప్రాంతాల్లో మొత్తం రూ.2 లక్షల కోట్లతో 1.18 కోట్ల గృహాలు నిర్మించాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇందులో ఇప్పటికే 76 లక్షల గృహాలు పూర్తయినట్లు కేంద్రం వెల్లడించింది. మరో 42 లక్షల గృహాల నిర్మాణాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర గణాంకాల లెక్కల ప్రకారం తెలంగాణలో 2.50 లక్షల గృహాలకు మంజూరులివ్వగా, ఇందులో 2.23 లక్షల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికే కేంద్రం తన వాటాగా ఇవ్వాల్సిన రూ.4,475 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.3,314 కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 21.32 లక్షల గృహాలకు మంజూరునివ్వగా, ఇందులో 7.95 లక్షల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీనికై కేంద్రం తన వాటాగా రూ.32,499 కోట్లకు గాను రూ.20,045 కోట్లు విడుదల చేసింది. ఇక పీఎంఏవై(గ్రామీణ్) కింద కేంద్రం మొత్తంగా 2.93 కోట్ల గృహాల నిర్మాణాలను మంజూరులివ్వగా, అందులో 2.40 కోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 53 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాల్సి ఉంది.



విద్వేష మెగామాల్ నడిపిస్తున్న రాహుల్: నడ్డా

గోద్రా: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మరోసారి విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ప్రేమ దుకాణం కాదు విద్వేష మెగా మాల్ నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్‌తోపాటు కాంగ్రెస్ నేతలంతా ప్రధాని నరేంద్ర మోదీపై ద్వేషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. నడ్డా సోమవారం గుజరాత్‌లోని గోద్రాలో ఓ ర్యాలీలో మాట్లాడారు. విపక్షాలు పూర్తిగా కుటుంబ పార్టీలుగా మారిపోయాయని ఎద్దేవా చేశారు. ఆయా పార్టీలకు సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మన ప్రధానమంత్రిని వ్యతిరేకించేందుకు ప్రయత్నిస్తూ దేశాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని నడ్డా దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి మన దేశం గురించి అసత్యాలు ప్రచారం చేశారని ఆక్షేపించారు.

ప్రిగోజిన్‌తో పుతిన్ భేటీ!



కీవ్: ఉక్రెయిన్‌లో యుద్ధంలో అరాచకాలకు పాల్పడుతూ అనూహ్యంగా రష్యా సైనిక నాయకత్వంపై తిరుగుబాటు చేసిన ప్రైవేట్ సైన్యం వాగ్నర్ గ్రూప్ అధిపతి ప్రిగోజిన్ ఇటీవల రష్యా అధ్యక్షుడితో భేటీ అయినట్లు తాజాగా వెల్లడైంది. ఈ వివరాలను రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ సోమవారం బహిర్గతంచేశారు. ఈ భేటీలో ప్రిగోజిన్‌తోపాటు ఆయన ప్రైవేట్ సైన్యం కమాండర్లు పాల్గొని తిరుగుబాటునాటి పరిస్థితులను పుతిన్‌కు వివరించారు. ఈ భేటీ ఏకంగా మూడు గంటలపాటు కొనసాగింది. జూన్ 24వ తేదీన తిరుగుబాటు జరగ్గా ఐదు రోజుల తర్వాత అంటే జూన్ 29వ తేదీన ఈ భేటీ జరిగినట్లు దిమిత్రి వెల్లడించారు. తిరుగుబాటుకు దారితీసిన కారణాలు, ఘటనలన్నింటినీ పుతిన్‌కు వాగ్నర్ చీఫ్, కమాండర్లు వివరించారు. ఇకమీదటా యుద్ధంలో సాయపడే అంశాన్ని పరిశీలించాలని వారికి పుతిన్ సూచించారు. మాతృభూమి కోసం పోరాటం చేసేందుకు, రష్యా అధినేత ఆజ్ఞానుసారం పనిచేసేందుకు సిద్ధమని వారు హామీ ఇచ్చారు. ఈ భేటీలో మొత్తంగా 35 మంది పాల్గొన్నారు. మరోవైపు ఉక్రెయిన్ భూభాగాలపై రష్యా వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఒరిఖీవ్ పట్టణంలో ఒక పాఠశాలలో మానవతా సాయం కార్యక్రమం జరుగుతున్నపుడు భవనంపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలుసహా నలుగురు మరణించారు. 11 మంది గాయపడ్డారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 11 । జూలై । 2023



తుపాకీతో తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

అక్రమంగా తుపాకీతో తిరుగుతున్న జార్ఖండ్ వాసిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు ఖాళీ మ్యాగజైన్‌లు, కంట్రీ మేడ్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. -8లో



అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.46 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. -8లో

దరఖాస్తుల గడువు పొడిగింపు

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం 2023–24వ విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని జులై 15 వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలుగుయూనివర్శిటీ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

మహిళల కోసం ‘స్త్రీ’ సమ్మిట్

- లోగో ఆవిష్కరించిన కొత్వాల్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళల భద్రతను మరింత పెంచడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి సిటీ పోలీసులు ‘స్త్రీ’ పేరుతో సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. నగర పోలీసు ప్రధాన కార్యాలయంగా ఉన్న బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో బుధవారం దీన్ని హోం మంత్రి మహమూద్ అలీ ప్రారంభించనున్నారు. ‘షి ట్రంప్స్ విత్ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్’ అనే దాన్నే స్త్రీగా పరిగణిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లోగోను కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. వివిధ వర్గాలకు చెందిన మహిళలు, యువతులతో పాటు నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తారు. స్త్రీ సమ్మిట్‌లో రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సైతం పాల్గొననున్నారు.

హెచ్‌ఎండీఏలో ఉన్నతాధికారుల బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్లు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా అలాగే హెచ్‌ఎండీఏ ప్లానింగ్–1 ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎస్.బాలకృష్ణను హైదరాబాద్‌మెట్రో రైల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. అలాగే ఆయనకు రేరా కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. డీటీసీపీ డైరెక్టర్‌గా ఉన్న కె.విద్యాధర్ హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్–1గా బాలకృష్ణ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే హెచ్‌ఎండీఏ–2 డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జీ. శివ శరణప్పను ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ (హౌసింగ్ నంబర్) డైరెక్టర్ కె.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టనున్నారు. మరోవైపు హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎం.రాజేంద్రప్రసాద్ నాయక్ సీసీపీగా బదిలీ అయ్యారు.

వేర్వేరు కేసుల్లో రూ.1.17 కోట్ల బంగారం పట్టివేత



శంషాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో 1.93 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..సోమవారం తెల్లవారు జామున దుబాయ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ముందస్తు ప్రణాళికతో తమ వద్ద ఉన్న అక్రమ బంగారు బిస్కెట్లు 1 కేజీ 399 గ్రాములను ఎయిర్‌పోర్టులో ఉద్యోగికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కస్టమ్స్ అధికారులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో జెడ్డా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడిని తనిఖీలు చేయగా మలద్వారంలో క్యాప్సుల్స్ చేసి తీసుకొచ్చిన 526 గ్రాముల బంగారం బయటపడింది. రెండు కేసుల్లో కలిపి బంగారం విలువ 1.17 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

సోమవారం తెల్లవారు జామున బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుంచి పెద్ద మొత్తంలో విదేశీ సిగరేట్లను స్వాధీనం చేసుకున్నారు. 62400 సిగరేట్లు ఇందులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కస్టమ్స్ సుంకం చెల్లించకుండా విదేశీ సిగరేట్లను తీసుకొచ్చిన ఇద్దరి అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్పా ముసుగులో...

బంజారాహిల్స్: స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తుండగా సహ నిర్వాహకుడితో పాటు నలుగురు విటులను అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.12లోని పీస్ రెయిన్ స్పాలో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు చేశారు. సహ నిర్వాహకుడు సయ్యద్ బిల్లాల్, విటులు ఫహద్, హసీదుద్దీన్, మహ్మద్ ఇమ్రానంద్, కమల్ కిషోర్‌లను అరెస్టు చేశారు. వీరంతా నగరంలోని ప్రముఖుల కుమారులని తెలిసింది. స్పాలో ఉద్యోగం పేరిట ఐదుగురు యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు తేలింది. ఈ ఐదుగురిని రెస్క్యూ హోంకు తరలించారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఉత్సాహంగా ‘ఊరేగింపు’

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల వేడుకల్లో రెండవ రోజు సోమవారం అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీలు ఈ ఊరేగింపులో పాల్గొని నృత్యాలతో అలరించారు. మొదట టకారబస్తీ, ఆదయ్యనగర్ ఏరియాల నుంచి దప్పు దరువులు..పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల నడుమ గొర్రెపోతుల సాయంతో భారీ అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు బయలుదేరింది. ఊరేగింపు వెంబడి వందలాది మంది ప్రజలు, యువకులు నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు.







మూసీపై వంతెనలు!

మొత్తం 14 ప్రాంతాల్లో నిర్మాణం

- మొదట ఐదు చోట్ల హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో...
- సుమారు రూ.130 కోట్లతో పనులు
- ఈ నెల 27వ తేదీ నాటికి బిడ్డింగ్ గడువు



సాక్షి, సిటీబ్యూరో: మూసీ నదిపై ఇక రయ్‌మంటూ వాహనాలు పరుగులు తీయనున్నాయి. ట్రాఫిక్ చిక్కులకు చక్కటి పరిష్కారం లభించనుంది. నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలకు ఆటంకంగా ఉన్న మూసీ నదిపైన వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూసీ, ఈసీ నదులపైన మొత్తం 14 చోట్ల బ్రిడ్జిలను నిర్మించనున్నారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ వంతెనల నిర్మాణంలో భాగంగా 9 చోట్ల హెచ్‌ఆర్‌డీసీఎల్, జీహెచ్‌ఎంసీ, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) సంస్థలు పనులు చేపట్టనుండగా, మరో 5 ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ ఈ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనుంది. ఇందుకోసం తాజాగా ఆసక్తి గల నిర్మాణ సంస్థల నుంచి టెండర్లను సైతం ఆహ్వానించింది. హైదరాబాద్ మహానగరం అన్ని వైపులా అనూహ్యంగా విస్తరిస్తోంది. అందుకనుగుణంగా రోడ్డు నెట్‌వర్క్ విస్తరణకు నోచకపోవడంతో అనేక చోట్ల వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఇరుకైన రహదారులు ఆటంకంగా మారాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రహదారుల విస్తరణ, వివిధ ప్రాంతాల మధ్య రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధిపైన సీరియస్‌గా దృష్టి సారించింది. ప్రజలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఈజీగా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల విస్తరణ చేపట్టింది. హెచ్‌ఆర్‌డీసీఎల్ ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున లింక్‌రోడ్లను అభివృద్ధి చేసింది. ప్రధాన రహదారులను కలిపే ఈ లింక్ రోడ్ల వల్ల వందలాది కాలనీలు దగ్గరయ్యాయి. ఇదే క్రమంలో మూసీపైన 14 చోట్ల బ్రిడ్జిల నిర్మించడం ద్వారా నిరాటంకమైన రోడ్డు నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది.

ప్రతి 2 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు..

పడమటి వైపున నార్సింగి నుంచి ఇటు తూర్పు వైపున గౌరెల్లి వరకు సుమారు 48 కిలోమీటర్ల మార్గంలో మూసీ ప్రవహిస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆ చివరి నుంచి ఈ చివర వరకు మూసీ పరవళ్లు తొక్కుతోంది. పాత ఎంసీహెచ్ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్) పరిధిలో ప్రజలు మూసీ నది ఉత్తరం నుంచి దక్షిణం వరకు వెళ్లేందుకు అవసరమైన చోట్ల వంతెనలు అందుబాటులో ఉన్నాయి. ఇంచుమించు ప్రతి 2 నుంచి 3 కిలోమీటర్లకు ఒకటి చొప్పున వంతెనల నిర్మాణం చేపట్టారు. కానీ ప్రస్తుతం హైదరాబాద్ మహానగరం ఔటర్‌ను దాటుకొని విస్తరించింది. దీంతో నగర శివారు ప్రాంతాల్లో మూసీకి ఉత్తర, దక్షిణ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోచోట కనీసం 5 నుంచి 10 కిలోమీటర్ల వరకు అదనంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం(సీటీఎస్) ప్రకారం మూసీ నదిని దాటే ప్రయాణికుల సంఖ్య 2031 నాటికి 36 లక్షల ట్రిప్పుల నుంచి 60 లక్షల ట్రిప్పులకు పెరుగనున్నట్లు అంచనా. శివార్ల వైపు నగరం శరవేగంగా విస్తరిస్తుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు తేలిగ్గా రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రస్తుతం కోర్ సిటీలో ఉన్నట్లుగానే కనీసం ప్రతి 2 కిలోమీటర్‌లకు ఒకటి చొప్పున వంతెనలు అందుబాటులో ఉండేవిధంగా సుమారు రూ.545 కోట్ల అంచనాలతో 14 చోట్ల నిర్మించనున్నారు.ఒక్కోటి 200 మీటర్ల చొప్పున ఉంటుంది.


హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఐదు వంతెనలు

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో మూసీ, ఈసీ నదుల పైన ఐదు చోట్ల వంతెనల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించారు. ఆసక్తిగల నిర్మాణ సంస్థలు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్ దరఖాస్తులను అందజేయవచ్చు. ఈ ప్రాజెక్టుపైన ఈ నెల 18వ తేదీన హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ విభాగంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పడమటి వైపు మంచిరేవుల వద్ద ఒకటి, బుద్వేల్ వద్ద రెండు వంతెనలతో పాటు ఇటు తూర్పు వైపున ఉప్పల్ భగాయత్‌లో ఒకటి, ప్రతాప్ సింగారం వద్ద మరొకటి చొప్పున మొత్తం 5 బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ఐదు వంతెనల నిర్మాణానికి రూ.130 కోట్ల వరకు నిర్మాణ వ్యయంగా అంచనా వేశారు. వచ్చే ఏడాది చివరి నాటికి బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

జూనియర్ కళాశాలల్లో బోధకులేరి?

సబ్జెక్టు లెక్చరర్లు లేక ఇబ్బందులు

- సగానికిపైగా ఖాళీలు
- తగ్గుతున్న విద్యార్థుల హాజరు శాతం
- కుంటుపడుతున్న ఇంటర్ విద్య



సాక్షి, సిటీబ్యూరో: సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేకపోవడంతో తరగతుల నిర్వహణ అంతంత మాత్రంగా తయారైంది. ఫలితంగా విద్యార్థుల హాజరు శాతం కూడా తగ్గుముఖం పడుతోంది. వెరసి ఇంటర్ విద్య ఆశించినంతగా సాగని పరిస్థితి నెలకొంది. గ్రేటర్ పరిధిలో సుమారు 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 22, రంగారెడ్డి జిల్లా పరిధిలో 18, మేడ్చల్ పరిధిలో 6 కళాశాలలు ఉన్నాయి. మొత్తం మీద కళాశాలల్లో సగానికి పైగా అధ్యాపకుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వాస్తవంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులచే బోధన కొనసాగుతూ వస్తోంది. ప్రతి యేట అడ్మిషన్ల సంఖ్య పెరుగుతున్నా..అధ్యాపకుల ఖాళీలు మాత్రం వెక్కిరిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి ముఖ్యమైన సబ్జెక్టులను బోధించే అధ్యాపకుల కొరత ఏర్పడింది. వాస్తవంగా ఈ ఏడాది సిలబస్‌ను త్వరగా పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు లక్ష్యంగా నిర్ణయించుకున్నప్పటికీ ముందుకు సాగని పరిస్థితి. అటు ప్రైవేటులో వేగంగా బోధన జరుగుతున్నా.. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం పూర్తిగా వెనుకబడింది.

ఇంకా విధులకు దూరమే...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంకా గెస్ట్ లెక్చరర్లు విధులకు దూరంగానే ఉన్నారు. అధ్యాపకుల కొరత అధిగమించేందుకు ప్రతియేటా గెస్ట్ లెక్చరర్ల సేవలు వినియోగిస్తుంటారు. కానీ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా.. ఇంకా గెస్ట్ లెక్చరర్ల భర్తీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఫలితంగా విద్యాబోధన ముందుకు సాగడం లేదు. సాధారణంగా గత విద్యా సంవత్సరంలో విధులు నిర్వహించిన పాత గెస్ట్ లెక్చరర్లనే కొనసాగించే అనవాయితీ ఉంది. కానీ, ప్రతి యేట అనుమతి అవసరం. గెస్ట్ లెక్చరర్లకు ఒక్కో తరగతికిగానూ రూ.300 చొప్పున..నెలకు రూ.21,600 వేతనంగా చెల్లిస్తారు. కానీ ఇప్పటి వరకు గ్రీన్ సిగ్నల్ లభించలేదు.

అందని పాఠ్యపుస్తకాలు..

ఇంటర్మీడియట్ తరగతులు మొదలై నెలరోజులు గడిచినా..విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదు. బోధించేందుకు సరిపడా లెక్చరర్లు లేరు. దీంతో ప్రభుత్వ ఇంటర్ విద్యార్థులు మాత్రం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ జూనియర్, మోడల్, కేజీబీవీ, గురుకుల జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తోంది. పుస్తకాల ముద్రణ బాధ్యతను తెలుగు అకాడమీ చూసుకుంటోంది. ఈ ఏడాది పుస్తకాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. ముద్రణకు అవసరమైన కాగితాన్ని సమకూర్చుకోవడంలో జాప్యం కారణంగా ఈ ఆలస్యం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రైవేటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇప్పటికే వారికి సమకూరాయి.

బారాత్‌ల బేరాల కోసం..

పెళ్లి ఊరేగింపుల్లో కత్తులతో నృత్యాలు

- ఆ కస్టమర్ల కోసమే అక్రమంగా ఆయుధ వ్యాపారం
- భారీ డాగర్లతో పాటు డమ్మీ తుపాకులూ విక్రయం
- తండ్రీకొడుకులకు చెక్ చెప్పిన సిటీ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: పెళ్లికి ముందు జరిగే బారాత్‌ల్లో యువత వినియోగించడానికి అనువైన కత్తులు, డమ్మీ తుపాకులను అక్రమంగా విక్రయిస్తున్న తండ్రీకొడుకులకు మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. బోయిన్‌పల్లిలోని వీరి దుకాణంపై దాడి చేసిన అధికారులు డాగర్లు, కత్తులతో పాటు డమ్మీ తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు సోమవారం వెల్లడించారు. న్యూ బోయిన్‌పల్లి సౌజన్య కాలనీకి చెందిన వినయ్ శర్మ కొలారియా జేసీ క్రాఫ్ట్స్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్లుగా ఈ వ్యాపారంలో ఆశించిన లాభాలు రావట్లేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్న ఇతడు పెళ్లి ఊరేగింపులతో పాటు ఉత్సవ ర్యాలీల్లో నృత్యాలు చేసే యువత కత్తులు పట్టుకోవడం చూశారు. ఆ కత్తులు, డాగర్లతో పాటు డమ్మీ తుపాకులను అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించారు. దీనికోసం తన కుమారుడు ఆకాష్‌తో కలిసి రంగంలోకి దిగిన వినయ్ రాజస్థాన్ నుంచి హ్యాండీ క్రాఫ్ట్స్ పేరుతో వీటిని అక్రమంగా ట్రాన్స్‌పోర్టులో తీసుకువచ్చారు. సౌజన్య కాలనీలోని తన దుకాణంలో ఉంచి ఒక్కోటి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఖరీదు చేసే వ్యక్తిని బట్టి రూ.6 వేల నుంచి రూ.15 వేలకు రేటు కట్టి అమ్ముతున్నారు. రానున్న పెళ్లిళ్ల సీజన్‌లో డిమాండ్ భారీగా పెరుగుతుందని, అప్పుడు మరింత ఎక్కువ రేటుకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించారు. వీరి వ్యవహారాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రఘునాథ్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సైలు ఎస్.సాయి కిరణ్, సీహెచ్ నవీన్ కుమార్ తమ బృందాలతో సోమవారం వలపన్ని వినయ్, ఆకాష్‌లను బాపూజీ నగర్‌లో పట్టుకున్నారు. వీరిని తీసుకువెళ్లి సౌజన్య కాలనీలోని దుకాణం, గోదాముల్లో సోదాలు చేశారు. అక్కడ అక్రమంగా దాచి ఉంచిన కత్తులు, డాగర్లు, డమ్మీ తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును బోయిన్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

‘స్కాన్’ చేయండి.. సమస్యలు చెప్పండి

గ్రేటర్‌లో త్వరలో ‘క్యూఆర్ కోడ్’ స్కాన్ సిస్టం

- పారిశుధ్యం, దోమలు, వీధిదీపాలు, గుంతల రోడ్లు తదితరాలపై ఫిర్యాదుల స్వీకరణ
- స్కాన్ చేస్తే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ల ఫోన్ నెంబర్లు
- ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి స్థానికంగానే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ...త్వరలో మరో కొత్త సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తేనుంది. అది అందుబాటులోకి వస్తే.. ఒక రోడ్డుకు (వీధికి) సంబంధించిన వివిధ సమస్యలు సత్వరం పరిష్కారమయ్యే వీలుంది.

సైన్‌బోర్డులపై క్యూఆర్‌కోడ్‌లు..

ఈ విధానంలో ఆయా మార్గాలకు దారి చూపే సైన్ బోర్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేస్తే అది దారి చూపే రోడ్డుకు సంబంధించిన అధికారులు, కాంట్రాక్టర్ల ఫోన్ నెంబర్లు కనిపిస్తాయి. ఆ రోడ్డుకు బాధ్యత వహించే ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన ఏఈ, శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు, వారిని సూపర్‌వైజ్ చేసే ఎస్ఎఫ్ఏ, ఆ రోడ్డులో నిత్యం వెలువడే చెత్త పరిమాణం, రోడ్డులో వీధిదీపాలకు బాధ్యత వహించే ఇన్‌చార్జి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాల్సిన అధికారి, వీధి కుక్కలకు సంబంధించి వెటర్నరీ అధికారి, కూలిన చెట్ల కొమ్మలు తొలగించే అధికారి..ఇలా వివిధ పనులు చేసే అధికారులందరి ఫోన్ నెంబర్లు ఉంటాయన్న మాట. తద్వారా సంబంధిత రోడ్డులోని సమస్యల్ని ప్రజలు నేరుగా వారికే తెలియజేయడం ద్వారా సత్వరం పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. నీటి సమస్యలకు సంబంధించి వాటర్ వార్క్స్ అధికారుల నెంబర్లు కూడా ఉంటాయి.

బెంగళూరులో అమలు..

ఇప్పటికే బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఈ విధానం అందుబాటులోకి రావడం గురించి పౌరొకరు మునిసిపల్ మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలియజేస్తూ.. హైదరాబాద్‌లోనూ దీన్ని అమలు చేయగలరా? అనడంతో స్పందించిన కేటీఆర్, వీలైనంత త్వరితంగా చేస్తామని తెలిపారు. పరిశీలించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. అందుకు స్పందిస్తూ మునిసిపల్ శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అర్వింద్‌కుమార్ 6–8 వారాల్లో చేయగలమని బదులిచ్చారు. ఇతర మునిసిపాలిటీల్లోనూ అమలుకు ప్లాన్ చేద్దామని మంత్రి పేర్కొన్నారు.

రోడ్ రీడర్ ప్రాజెక్ట్ గా ..

బెంగళూరు సౌత్‌జోన్‌లో రోడ్ రీడర్ ప్రాజెక్టు పేరిట ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని చేపట్టారు. ప్రజలనుంచి ప్రశంసలు రావడంతో నగరమంతా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విధానం వల్ల సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు జవాబుదారీ తనం కూడా పెరుగుతుందని భావిస్తున్నారు.అధికారులు బదిలీ అయినా, కాంట్రాక్టర్లు మారినా ఆ వివరాలు కూడా స్కానింగ్ ద్వారా కనిపించే పేజీలో పొందుపరుస్తారు. పనుల్లో పారదర్శకతకు కూడా ఇది మంచి సాధనంగా ఉపకరించగలదనే అభిప్రాయాలున్నాయి. బెంగళూర్ మొత్తం అమలుచేసేందుకు దాదాపు రూ. 1.2 కోట్లు ఖర్చుకాగలదని అంచనా వేశారు.హైదరాబాద్‌లో ఎంత ఖర్చు కానుందో తెలియాల్సి ఉంది.

రోడ్డు చరిత్ర ఉండాలి..

రోడ్డుకు సంబంధించిన వెబ్‌పేజీలో రోడ్డు చరిత్ర మొత్తం ఉండాలని.. అంటే రోడ్డు ఎప్పుడు నిర్మించారు.. అందుకు చేసిన ఖర్చెంత ? రోడ్డు డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ఉందా.. ముగిసిందా ? వంటి వివరాలు కూడా ఉంటే అవినీతికి ఆస్కారం ఉండదని బెంగళూర్‌లోని సామాజిక కార్యకర్త ఒకరు అభిప్రాయపడ్డారు. ఏవైనా అవసరాలకు రోడ్డు తవ్వకానికి అనుమతులిస్తే.. ఆ వివరాలు కూడా పేజీలో పొందుపరచాలని సూచించారు. రోడ్డు ఇన్‌చార్జి వివరాలు ఇతరత్రా ప్రభుత్వ విభాగాలకు తెలియడం వల్ల కూడా ఆయా పనుల సందర్భంగా ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని నగరంలో క్యూఆర్ కోడ్ విధానాన్ని అమల్లోకి తేనున్నారు.

రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

- సీపీఐ నేత కూనంనేని, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సుల్తాన్‌బజార్: గత పదహారు సంవత్సరాల నుండి తెలంగాణలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న 2వ ఏఎన్‌ఎంలను బేషరతుగా రెగ్యులర్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తోక రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో కూనంనేని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..అసలు రెండవ ఏఎన్ఎం అనే పదం లోనే వివక్ష ఉందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా భావిస్తున్నారని అనడానికి ఈ పదమే నిదర్శనమన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవ చేసిన సిబ్బందిని గుర్తించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వాలు, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గురించి ఆలోచన చేసి 20 సంవత్సరాల సేవకుగాను రిటైర్డ్ అయ్యాక పెన్షన్ సౌకర్యాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

హరీష్‌రావు క్షమాపణలు చెప్పాలి: ఆర్.కృష్ణయ్య

చాలీచాలని జీతాలతో బతుకుతున్నామని, కనీసం ఆకలి కూడా తీరడం లేదని మొరపెట్టుకుంటే..జీతాలు చాలకపోతే ఈ పని మానేసి వేరే పనికి వెళ్లండని మంత్రి హరీష్‌రావు ఎగతాళి చేయడం ఎంతవరకు సబబని బీసీ ఉద్యమనేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఈ విషయంలో మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సేవా భావంతో పని చేసే ఏఎన్‌ఎంలను ఇబ్బంది పెడితే ఆ దేవుడు కూడా క్షమించడన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెండవ ఏఎన్‌ఎంల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వనిజ, ప్రధాన కార్యదర్శి మధురిమ, విజయ, మంజుల, పుష్పలత, ప్రవీణ, వందలాది మంది ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తుపాకీతో తిరుగుతున్న జార్ఖండ్ వాసి అరెస్ట్

కంట్రీమేడ్ పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కంట్రీ మేడ్ పిస్టల్‌ను చూపిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ..

నాగోలు: అక్రమంగా తుపాకీతో తిరుగుతున్న వ్యక్తిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రెండు ఖాళీ మ్యాగజైన్‌లు, లైవ్ రౌండ్, కంట్రీ మేడ్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. జార్ఖండ్ రాష్ట్రం, సాహెబ్ గంజ్ జిల్లా, మీర్జాచౌకీ చెందిన మహమ్మద్ షాబుద్దీన్ అన్సారీ నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. బతుకు తెరువు కోసం నగరానికి వలస వచ్చిన అతను కందుకూరులో ఉంటూ ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కూలీగా పని చేస్తున్నాడు. ఇటీవల బీహార్‌కు వెళ్లిన అతను గుర్తు తెలియని వ్యక్తినుంచి లైవ్ రౌండ్‌తో కూడిన కంట్రీ మేడ్ పిస్టల్‌ను కొనుగోలు చేశారు. తుపాకీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి అధిక ధరకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. సికింద్రాబాద్‌లో రైలు దిగి బస్సులో ఎల్‌బీనగర్‌కు వచ్చిన అతను ఆదివారం కందుకూరు వెళ్లేందుకు ఎల్‌బీనగర్ బస్టాప్‌లో బస్సుకోసం వేచి చూస్తుండగా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కంట్రీ మేడ్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరిట టోకరా

ఇద్దరి నుంచి రూ.52 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఇద్దరు వ్యక్తులను సైబర్ మోసగాళ్లు రూ.52 లక్షలు దోచుకున్నారు. సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పార్ట్‌టైం జాబ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి టెలిగ్రామ్ ద్వారా సదరు యువకుడిని సంప్రదించాడు. తమ కంపెనీలో ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపాడు. మొదట్లో కొంత మొత్తంలో ఇన్వెస్ట్ చేయడంతో లాభాలు చెల్లించాడు. నమ్మకం కుదరడంతో పెద్ద మొత్తంలో పలు దఫాలుగా రూ.47 లక్షలు ఇన్వెస్ట్ చేయించి దోచేశారు. రాంనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ నుంచి ఇదే తరహాలో రూ.5లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ. 46 లక్షల విలువ చేసే
- 250 కేజీల గంజాయి స్వాధీనం...
- ఐదుగురు నిందితుల అరెస్టు
- రెండు ఇన్నోవాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.46 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకొకున్నారు. సోమవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. మియాపూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అల్లావుద్దీన్, పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన ఎండీ వాహిద్ ఈ నెల 8న ఏపీలోని మారేడుమిల్లికి వెళ్లి 230 కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఇన్నోవాలో జహీరాబాద్‌కు తరలించేందుకు సన్నాహాలు చేపట్టారు. వీరికి సంగారెడ్డికి చెందిన అజిత్ వంశీ, విజయ్ మరో ఇన్నోవాలో ఎస్కార్ట్‌గా వచ్చారు. దీనిపై సమాచారం అందడంతో కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద మాదాపూర్ ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మారేడుమిల్లి నుంచి కొనుగోలు చేసిన గంజాయిని జహీరాబాద్‌కు తరలించి అక్కడి నుంచి నగరానికి సరఫరా చేయాలని పథకం వేసినట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారు. వారి నుంచి సుమారు 230 కేజీల గంజాయి, రెండు ఇన్నోవా కార్లు, 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరికి మీడియేటర్‌గా పని చేసిన కిషన్‌బాగ్‌కు చెందిన అఖిల్‌ను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా అల్లావుద్దీన్‌పై గతంలో దొంగతనం, మర్డర్ తదితర మూడు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. అతనిపై పీడీ యాక్ట్ నమోదుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ శోభన్, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, ఎస్‌ఓటీ సీఐ శివప్రసాద్, కూకట్‌పల్లి సీఐ సురేందర్ గౌడ్, డిఐ వెంకటేశం, ఎస్‌ఓటీ సిబ్బంది ఉన్నారు.

యజమాని ఇంటికే కన్నం..



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ జోన్ డీసీపీ సందీప్..



పోలీసుల అదుపులో నిందితులు



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

దుండిగల్: ఇద్దరు వ్యక్తులు తాము కిరాయికి ఉంటున్న యజమాని ఇంటికే కన్నం వేశారు. యజమాని ఇంట్లో లేని సమయంలో తాళాలు పగలగొట్టి రూ.21 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దుండిగల్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ జోన్ డీసీపీ సందీప్ వివరాలు వెల్లడించారు. డి.పోచంపల్లి సారెగూడెంలో నివాసం ఉంటున్న ముకేశ్‌కుమార్ టార్పాలిన్ కవర్ల వ్యాపారం చేసేవాడు. రెండేళ్లుగా అతడి ఇంటి పెంట్‌హౌస్‌లో రాజస్థాన్‌కు చెందిన బావా, బావమరుదులు నితీష్ కుమార్, కమలేశ్ అద్దెకు ఉంటున్నారు. నితీష్ ఇంటి యజమాని గోదాములోనే పని చేస్తుండగా, కమలేశ్ ఓ పరిశ్రమలో టెక్నీషియన్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడిన వీరి జీతం మొత్తం మద్యానికే సరిపోయేది. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న వారు యజమాని ఇంట్లో చోరీ చేయాలని పథకం వేశారు. గత నెల 26న ఇంటి యజమాని ముకేశ్‌కుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా సొంతూరికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించి వారు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.21 లక్షలు విలువైన బంగారం, వెండి ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన దుండిగల్ పోలీసులు సోమవారం ఉదయం బహదూర్‌పల్లి చౌరస్తాలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40.6 తులాల బంగారం, 2,969 గ్రాముల వెండి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. 15 రోజుల వ్యవధిలోనే నిందితులను చాకచక్యంగా పట్టుకున్న దుండిగల్ పోలీసులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ సీఐ వై.రామకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వై.హనుమాన్ గౌడ్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ జలజకు ఎక్సలెన్స్ అవార్డు



'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్' నుంచి ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ జలజ వెరోనిక

హిమాయత్‌నగర్: రోగుల పట్ల సేవా భావం, వారికి అత్యుత్తమ చికిత్స అందించి అన్ని విధాల ప్రతిభ కనబరుస్తున్న కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రి మెటర్నిటీ విభాగాధిపతి డాక్టర్ జలజ వెరోనికకు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. వైద్యుల దినోత్సవం సందర్భంగా 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్' నిర్వాహకులు ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో రోగులకు అత్యుత్తమ చికిత్స అందించి, కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో కోవిడ్ రికవరీ విషయంలో జలజ వెరోనికా చేసిన కృషి ఎనలేనిది. కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో ఎక్కువ శాతం సహజ ప్రసవాలకు ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారు. గర్భిణిలకు అవగాహన కల్పించడం, సుఖ ప్రసవం, సిజేరియన్ లాభ, నష్టాలను వివరించి గర్భిణిల్లో నమ్మకాన్ని పెంపొందిస్తున్నారు. ఆయా అంశాల్లో జలజ ప్రతిభను గుర్తించిన 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్' నిర్వాహకులు ఆమెకు ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు



కోట శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

గన్‌ఫౌండ్రీ: కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నటుడు కోట శ్రీనివాసరావు 80వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట శ్రీనివాసరావు సినిమాలతో పాటు రాజకీయాల్లోనూ మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన 1999 ఎన్నికల ప్రచార సమయంలో చోటు చేసుకున్న పలు సంఘటనలను గుర్తుచేశారు. అనంతరం కోట శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ నిర్వహణలో సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం.కీరవాణి, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, రంగస్థల నటుడు సుబ్బరాయశర్మ, దర్శకులు డీఎస్ఎన్ మూర్తి, కవి రమణమూర్తి, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అనుగుణంగా హాస్టల్ వసతి కల్పించాలి



విద్యార్థినులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

సుల్తాన్‌బజార్: విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మహిళా విశ్వవిద్యాలయంలో హాస్టల్ వసతి కల్పించాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏబీవీపీ తెలంగాణ మహిళా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో వర్సిటీ గేటు ఎదుట విద్యార్థినులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ కన్వీనర్ పి.సిరివెన్నెల గౌడ్ మాట్లాడుతూ.... తెలంగాణ మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. యూనివర్సిటీలో మౌలిక వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థినిలు తమ సమస్యలను పలుమార్లు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థినులు ప్రైవేట్ హాస్టల్‌లో ఉండే స్తోమత లేక చదువును అర్ధాంతరంగా నిలిపివేసే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు స్పందించి విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా హాస్టల్‌లో వసతిని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంతోషి, హరిణి, శ్రావణి, ప్రత్యూష, నందిని తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

One Sitting Pass Guaranty Join Direct 10th SSC Regular Private Inter One Sitting MBPC, MPC, BPC, MEC & CEC Brilliant College BHEL X Roads Chandanagar Ligampally. Ph: 9491677226 [H-780938]

Real Estate

12,999/-కే గజం తుక్కుగూడ హైవే కందుకూర్ దగ్గర న్యూవెంచర్‌లో ప్లాట్లు అమ్మబడును. ఫోన్ : 8309376230 [H-781246]

FLAT FOR SALE

For Sale Premium 3BHK & 2BHK Flat at Gachibowli, 2BHK Flat at Sainikpuri Villas at Narapally, Loan Facility. Available. Ph:6301919106. [HA-11276]

Mallapur Near Nacharam, Habsiguda, 3BHK Premium Flats for Re Sale, Gated Community, Club House, Ready to Occupy Brand New. Ph : 9502429292 [H-780835]

HOUSE FOR SALE

Independent houses for sale 136sq yards, ground floor with car parking, near Badangpet, Meerpet, opp to MVSR College road, offer price: 70 lakhs only, Call: 8790665271 [H-189357]

PLOT FOR SALE

బెంగుళూరు హైవే షాద్‌నగర్ @ రాజాపూర్ 104 ఎకరాల ఫ్రూట్ ప్లాంటేషన్ ఫామ్ ల్యాండ్ రిసార్ట్ కలిగిన వెంచర్ లో 2,5 గుంటల ప్లాట్లు కలవు. గజం 6499/- ఫిక్స్‌డ్, 24/7 సెక్యూరిటీ, కాంపౌండ్ వాల్స్, అన్ని డెవలప్‌మెంట్స్ తో కలవు. క్లి॥టై॥ స్పాట్ రిజి॥ సంప్ర: 8790142136 [H-780840]

శ్రీరాంకాలనీ జల్‌పల్లి బాలాపూర్ 118 Sq.Yds. రిజిస్టర్డ్ S/F గజం 25,000/-, క్లియర్ టైటిల్ డైరెక్ట్ ఓనర్. ఫోన్ : 9133503242, 8555846858 [H-781534]

VJA, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. గన్నవరం, బందరు రోడ్డు, కంచికచర్ల దగ్గర శ్రీగంధం మొక్కలతో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/-, నుండి 17,500. సంప్ర : ✆ 93906 65999 [B-96]

TO-LET

హైదరాబాద్, కూకట్‌పల్లి ఏరియాలో ప్రముఖ జ్యూయలరీ షోరూం ప్రారంభించేందుకు 5000Sft గల బిల్డింగ్ అండర్ గ్రౌండ్ సెల్లార్ పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్, 1stఫ్లోర్ అద్దెకు కావలెను. 9490010684, 9493924146 [G-788973]

VILLAS FOR SALE

New-age design premium villas for sale in Raviryala for just Rs.1.80 Crores. Contact: +91 7353585358 Sark Projects [HA-94093]

Services

Tatkal Passport slot@ 5 days, Aadhaar card, Birth & Death corrections, Firm registration,Labour license, Marriage certificate, Home & Martigage Loans. 9849408579/9985559119 [HA-13940]

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788716]

మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 8886456484. [H-189261]

బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 93902 22788 [B-1165687]

BUSINESS OFFER

Home, Mortgage, Business, MSME Loans, OD/CC Limits from Nationalised Banks and NBFC/ MNC, Ph: 6303717362 [HA-11277]

Investors Wanted: Business Opportunity, Wanted Investors for New Technology Business Monthly returns 200% & More Safe and Secure Long Time Business, Good Investment Contact: Genuine Investors. Ph : 6303485202. [H-781523]

PERSONAL CARE

CHANGE OF NAME

I, VADLAMUDI SRUTHIK R/o. Flat No 20/1, Block B, Madhu Park Ridge, I B Lines, Hyderabad 500031 changed my name to CHIRUMAMILLA SRUTHIK [UA-33630]

I, K Laxmi, W/o Perugu Veera Narayana Yadav, R/o Block 7, Flat 305, Rain Tree Park (Malaysian Township), KPHB 4th Phase, Kukatpally, Hyderabad, have changed my name from Perugu Laxmi to K Laxmi vide affidavit 38AA022919 dated 5th July 2023. [HA-3577]

I, Chikatla Satyavathi W/o. C. Rajeshwara Rao R/o. 4-1-51/301, Snehapuri Colony, Nacharam, Hyderabad, Medchal-Malkajgiri Dist, T.S-76. Has changed my name as Chikatla Satyavathi Devi for all purposes. [HA-94150]

I, Nella Kaveri (Old Name) D/o. Nallenki Anjaiah R/o. 2-3-534/1A, Sainagar Colony, New Nagole, Tattiannaram, Hyd. Has Changed my Name as Nallenki Rani (New Name) as per SSC Certificate for all Purposes. [HA-3291]

I, BODDU SAI VIJAY S/o: PRABHAKAR, R/o 12-5-104/ 3/1, S.P Nagar, Moosapet, Hyderabad-500018. have Changed my name and known as VIJAYARAGHAVA PRABHAKAR for all purposes [DA-27024]

Change of Name & DOB: I, Gurujepalli Kamsala Nageswari, W/o. Gurujepalli Kamsala Ramanatha Char, R/o. H.No. 2-2-271/B(136), Plot No. 144, Royal Enclave, Machabolaram, Secunderabad-500010 and Date of Birth 09-09-1951 has changed my name as "Gurujepalli Kamsala Nageswaramma" and DOB 09-09-1950, Signed by Court of XVI Additional Judge cum XX Additional Chief Metropolitan Megistrate, Hyderabad. [H-781533]

OLD AGE HOME

వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-781644]

TOURS & TRAVELS

చార్‌ధామ్ 15/9, రామేశ్వరం-కాశి-రామేశ్వరం 24/9, కాశి యాత్ర 2/10, రామేశ్వరం 15/10 @ మహాదేవ టూర్స్. Ph: 9908844377 [HA-1336]

Wanted

స్కూల్‌బస్ నడుపుటకు అనుభవం గల డ్రైవరు-ఆయా జంట కావలెను, గది ఇవ్వబడును. రూ. 17000+ 9000/- పిల్లర్ నెం. 179, అత్తాపూర్, ఫోన్ : 7207888182 [HA-11280]

వంటమనిషి కావలెను ప్రముఖ కాలేజీలో పనిచేయుటకు, జీతం: 15వేలు-30వేలు, నిజాంపేట్ రోడ్డు, JNTU దగ్గర ఫోన్ : 9502937699, 9100094699 [HA-29831]

శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచంమీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్: 9533909627, 9494071023 [H-780918]

అన్నపూర్ణ హోంకేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9390427694 [H-788814]

సిటింగ్ జాబ్స్-టెలికాలర్స్ యాంకర్స్, రిసెప్షనిస్ట్, వీడియో ఎడిటింగ్, రిపోర్టర్లు, డ్రైవర్లు, వంట మనిషి, కుక్, ఆయాలు, హెల్పర్లు, సూపర్‌వైజర్స్, 10-డిగ్రీ, B.Tech, B. Pharma, PG జీ: 10-20K+ ఫ్రీ హాస్టల్. 9505261777 [H-189218]

ప్రగతి నగర్ ఏరియాలో ఇంట్లో పనిచేయడానికి పని మనిషి కావలెను. Time: 10am to 3pm. ఫోన్: 8008186187, 8008422044, 9849062723 JNTU, Pragathi Nagar. [H-781399]

న్యూ రియల్ ఎస్టేట్ సంస్థకు మార్కెటింగ్ డైరెక్టర్స్ (10) కావలెను. జీతం: 35k+టెలికాలర్స్ (20) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (20) కావలెను. జీతం: 12 to 18k + కమీషన్. అమీర్‌పేట. ఫోన్ : 8121661899 [H-780721]

అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కా॥ కాశీమందిర్, మణికొండ, L.B. నగర్, షాద్‌నగర్, బహదూర్‌పల్లి, 10k-14k వాచ్‌మెన్ షాద్‌నగర్, ఉప్పల్, ఆ॥ బాయ్స్ జూబ్లీ చెక్‌పోస్ట్ - 15k. ఫోన్ : 9505087933 [HA-11288]

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు రిటైర్డ్ / VRS/ ఇన్సూరెన్స్ / చిట్స్ / ఏజెంట్స్ / గృహిణులు / ఫ్రెషర్స్ కావలెను. మంచి ఆదాయం. M/F, P/F Time, Age: 30 & పైన. అనుభవంలేని వారికి ట్రైనింగ్ ఇచ్చి విజేతలుగా తీర్చిదిద్దబడును. ఫోన్ : 7013794440 [HA-94050]

Building Contractor Wanted : Commercial Building Repairs Contractor required for a 5 floor Building in Begumpet, to execute Structural Repair, Plumbing, Electrical, Water Proofing, Carpenter, Fabrication and Painting work on Turnkey basis in a Time Bound Completion and Handover. Contact : +91 8985678844 [H-781535]

Wanted Urgently security Supervisor and security guard for kukatpally & Amenpur (BHEL) Rooms Free Ph : 9100051844, 9100051847 / 48 [H-781394]

Wanted Marketing incharges, Marketing Vice Principals, class incharges Qualification : Any Degree. Salary 12,000/- to 30,000/- Experienced persons preferable. Age: 25-45, Job Location: Dilsukhnagar, Hyd. Master Minds College. Contact: 8978180857, 9100069434 [G-4438]

Wanted Waiter / Steward for Restaurant Part Time / Full time Job Contact: 9494400526. [H-796917]

VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737 [HA-3289]

కత్తితో యువకుడిపై దాడి

ప్రాణాలకు తెగించి నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుల్




పోలీస్ కానిస్టేబుల్ శ్రీధర్

అఫ్జల్‌గంజ్: తాను ప్రేమించిన యువతితో సన్నిహితంగా ఉంటున్నాడన్న కోపంతో ఆమె మాజీ ప్రియుడు ఓ యువకుడిపై కత్తితో దాడి చేశాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ దీనిని గుర్తించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిందితుడిని వెంటాడి పట్టుకున్నాడు. తీవ్రంగా గాయపడిన యువకుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... అఫ్జల్‌గంజ్ ప్రాంతానికి చెందిన చోటా రాజు ఫుట్‌పాత్‌పై ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి శిరీష అనే యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. కొన్నాళ్ల తర్వాత ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో వారు దూరంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమాని అలియాస్ మహ్మద్‌తో శిరీష చనువుగా ఉండటాన్ని గుర్తించిన చోటా రాజు ఆమెతో సన్నిహితంగా ఉండవద్దని పలుమార్లు మహ్మద్‌ను హెచ్చరించాడు. అయినా అతను లెక్క చేయకపోవడంతో అగ్రహానికి లోనైన రాజు సోమవారం అతడిపై కత్తితో దాడి చేశాడు.

బాధితుడు కేకలు వేయడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న పోలీస్ కానిస్టేబుల్ శ్రీధర్ నిందితుడిని వెంటాడి పట్టుకున్నాడు. గాయపడిన మహ్మద్ ఇమానిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. కానిస్టేబుల్ శ్రీధర్‌ను అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ చిట్టి అభినందించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన న్యాయవాదిపై కేసు

మలక్‌పేట: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన హైకోర్టు అడ్వకేట్‌పై మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, గూడూరుకు చెందిన సోదరులు ఏపూరి రవీందర్‌రెడ్డి, ఏపూరి సుభాష్‌రెడ్డి మధ్య భూవివాదం కొనసాగుతోంది. రవీందర్‌రెడ్డి గూడూరు పోలీస్‌స్టేషన్‌లో సుభాష్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సుభాష్‌రెడ్డి మలక్‌పేట పీఎస్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌లోని హైకోర్టు అడ్వకేట్ రాపోలు ఆనంద్ భాస్కర్ ఇంట్లో ఉన్నట్లు సమాచారం అందడంతో ఆదివారం సాయంత్రం నేరుగా అక్కడికి వెళ్లారు. 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇవ్వకుండా సుభాష్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు అడ్వకేట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో విధులను అడ్డుకున్నారని, నేరస్తుడికి ఆశ్రయం కల్పించారని గూడూరు ఎస్సై రాణా ప్రతాప్ ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి ఆనంద్ భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



నిందితుడు మేకల రజిని

రంగారెడ్డి కోర్టులు: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 21వేల జరిమానా విధిస్తూ ఎల్‌బీనగర్ 9వ అదనపు జిల్లా, పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు చెప్పారు. స్పెషల్ పీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేకల రజినిఅనే వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి అదే ప్రాంతంలోని వస్త్ర దుకాణంలో పని చేస్తున్న యువతితో పరిచయం ఏర్పడింది. దీనిని ఆసరాగా తీసుకుని అతను తరచూ ఆమెను ఆటోలో ఎక్కించుకుని ఆమె ఇంటి వద్ద దిగబెట్టేవాడు.

2015, ఏప్రిల్ నెలలో ఆమెను ఆటోలో ఎక్కించుకుని చంపాపేట్‌లోని ఓ ఇంటికి తీసుకెళ్లాడు. ఆమెను నిర్బంధించి పలు మార్లు లైంగిక దాడికి పాల్పడి మరుసటి రోజు వదిలిపెట్టాడు. బాధితురాలు ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమె తండ్రి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 21వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: బేగంపేట ప్రభుత్వ ఆస్పత్రి, డీఎస్ఎం కాలనీ 11 కేవీ ఫీడర్, బేగంపేట, లోధా సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. నేచర్‌క్యూర్ హాస్పిటల్ ఎదురు గల్లీ, బల్కంపేట, ఎస్‌బీఐ మెయిన్‌రోడ్డు, ఎస్ఆర్‌నగర్ పోలీసుస్టేషన్ ఏరియా, కమ్యూనిటీ హాల్ ఎదురు గల్లీ, అభిరుచీ స్వీట్‌హోంలతో పాటుగా డీఎస్ఎం కాలనీ, అశోక్ కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ కొంత భాగం, టీవీఎస్ షోరూం లైన్, మెథడిస్ట్ చర్చి లైన్, డి-మార్ట్ ఏరియా ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ తెలిపారు. బ్రాహ్మణవాడీ, స్వర్ణజయంతి, వనమాల్ రెసిడెన్సీ, ఇంద్రప్రస్థ 11 కేవీ ఫీడర్ కుందన్‌బాగ్, ఈఎస్ఐ, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల వైట్‌హౌస్, మీనా బజార్, బ్రహ్మణవాడీ, హుడా కాంప్లెక్స్, స్వర్ణ జయంతి కాంప్లెక్స్, ఉదయ్‌నగర్, ఎస్ఆర్‌టీ, హిందూ పబ్లిక్ స్కూల్, హనుమాన్ టెంపుల్, ఇంద్రప్రస్థ బిల్డింగ్స్, స్ట్రీట్ నెంబర్-1 ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ట్యాంక్‌బండ్‌పై నిరసన

లిబర్టీ: శాంతి సామరస్యం కోరుతూ నాటో సమావేశాలను వ్యతిరేకిస్తూ 11వ తేదీన ట్యాంక్ బండ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డి.సుధాకర్ తెలిపారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సాయంత్రం 4.30 గంటలకు ట్యాంక్ బండ్‌పై నిరసన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

14 నుంచి ఇంటింటికీ టీడీపీ

ఫిలింనగర్: ఈ నెల 14వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వాటిని అధికారుల దృష్టికి తీసుకొస్తామని జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎం.డి.సలీం తెలిపారు. డివిజన్ టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై దృష్టి పెడతామన్నారు. అధిష్ఠానం నుంచి వచ్చిన సూచనల మేరకు నిత్యం ప్రజల్లో ఉండాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఖైరతాబాద్ టీడీపీ ఇన్‌చార్జిగా శ్రీనివాస్ నాయుడు



నియామక పత్రం అందజేస్తున్న కాసాని

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా టి. శ్రీనివాస్ నాయుడిని నియమించారు. ఈ మేరకు సోమవారం బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ శ్రీనివాస్ నాయుడికి నియామక పత్రం అందజేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి విస్తృత కార్యక్రమాలు చేపడతామని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

జూదరుల అరెస్టు

బంజారాహిల్స్: పేకాట ఆడుతున్న ఐదుగురిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. రోడ్డు నెంబరు 14లోని నందినగర్‌లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. వెంకటేశ్వరనగర్‌కు చెందిన కొండూరు శ్రీనివాస్, బి అశోక్, ఎం కృష్ణ, ఆర్ ప్రసాద్,నందినగర్‌కు చెందిన ఎస్ గణేష్‌లను అరెస్టు చేసి వారి నుంచి 12,870 రూపాయల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీరువాలోని నగలు మాయం

బంజారాహిల్స్: బీరువాలో పెట్టిన నగలు కనిపించకుండా పోయాయి. బంజారాహిల్స్‌లో నివసించే షమీమ్‌ఖాన్ అనే వృద్ధురాలు ఈ నెల 6న తన బెడ్‌రూంలోని బీరువాలో నాలుగు తులాల బంగారు గాజులు, ఎమరాల్డ్ రాయి ఉన్న ఉంగరం దాచింది. మరుసటి రోజు ఉదయం చూసేసరికి నగలు కనిపించలేదు. దీంతో బాధితురాలు ఈ నెల 10 బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎమరాల్డ్ రాయి కలిగిన ఉంగరం ఖరీదు 1.50 లక్షల రూపాయలు విలువ చేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అభినందన

ఖైరతాబాద్: జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పతకాలు సాధించిన ఖైరతాబాద్‌కు చెందిన 11 మంది విద్యార్థులను సోమవారం అభినందించారు. కూకట్‌పల్లిలో సెకండ్ నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ షిప్-2023 పోటీల్లో ఖైరతాబాద్‌కు చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొనగా అందరూ పతకాలు సాధించి సత్తాచాటినట్లు కోచ్‌లు శ్రీకాంత్, శ్రీధర్ వెల్లడించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్

తూకంలో మోసాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

డీలర్ల ఆగడాలను అడ్డుకునేందుకు శ్రీకారం ● వినియోగదారులకు పారదర్శక సేవలే లక్ష్యం

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు అరికట్టేందుకు వినియోగదారులకు పారదర్శకంగా బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుతం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రేషన్ దుకాణానికి కార్డుదారు వచ్చి వేలుముద్ర వేసి బియ్యం తీసుకునే విధానం కొనసాగుతున్నది.



బంజారాహిల్స్ రోడ్ నంబర్.12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉన్న రేషన్ దుకాణం

బంజారాహిల్స్: రేషనింగ్ సర్కిల్ ఖైరతాబాద్ సర్కిల్ ఏడు పరిధిలో 81 రేషన్ షాపులుండగా 28,52,67 కార్డులు ఉన్నాయి. ఇందులో తెల్లరేషన్ కార్డులు 83127 కాగా ఒక అన్నపూర్ణ కార్డు 3368 అంత్యోదయ, అన్నయోజన కార్డులున్నాయి. ఆయా కుటుంబాలు 5.76 లక్షల సభ్యులుండగా యూనిట్ల రూపేణా నెలకు 42, 56, 772కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఆహార భద్రత కార్డు కలిగిన వారికి యూనిట్‌కి ఆరు కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు యూనిట్‌కు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

- ప్రస్తుతం కొనసాగుతున్న విధానంతో రేషన్ డీలర్లకు అందజేస్తున్న బియ్యం తూకంలో తేడాలోస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా డీలర్లు ఈ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు.
- దీని ప్రభావం కార్డుదారులపై చూపుతున్నది. ఒకవైపు డీలర్ నష్టపోతుండగా మరోవైపు కార్డుదారులకు తూకంలో కొంత నష్టం వాటిల్లుతున్నది. ఫలితంగా కార్డుదారులకు ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని గ్రహించిన పౌరసరఫరాల శాఖ వేలుముద్ర తీసుకుని డీలర్లకు బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది.
- ఈ విధానం ఈ నెల నుంచి అమలులోకి వచ్చింది.

పారదర్శకంగా బియ్యం పంపిణీ...

రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. ఈ పాయింట్లకు కాంట్రాక్టర్లు మిల్లుల నుంచి సరఫరా చేస్తారు. ఈ క్రమంలోనే అక్రమాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

- కాంట్రాక్టర్లు సంచుల్లో నింపాల్సిన బియ్యం కంటే తక్కువ నింపుతుండటంతో అవి నేరుగా డీలర్లకు చేరుతూ కార్డుదారులకు తక్కువ బియ్యం అందుతున్నాయి. తూకం తక్కువ ఉన్న సంచులు దుకాణాలకు వస్తుండటంతో డీలర్లు కార్డుదారుల తూకంలో కోతలు పెడుతున్నారు.
- ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి పలకనున్నారు. ఎంఎల్‌పి పాయింట్ల వద్ద బియ్యం తీసుకునే ముందుకు బస్తాలో 100 కిలోలు ఉన్నట్టు తూకం చూసుకుని వేలుముద్ర వేస్తే ఆ బియ్యం విడుదల కానున్నాయి.
- సరైన తూకంతో బియ్యం బస్తాలు దుకాణాలకు పంపిణీ ద్వారా కార్డుదారులు ఒక్క బియ్యం గింజ కూడా నష్టపోకుండా పూర్తిగా అందుకోనున్నారు.
- బియ్యం తూకంలో తేడాలు లేకుండా చేసేందుకే ఈ విధానాన్ని తీసుకురాగా కార్డుదారులకు ఇక నుంచి నష్టం కలగదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి డీలర్ వేలిముద్ర వేస్తే బియ్యం సంచులు దుకాణాలకు చేరతాయి.
- అక్రమాలకు తావులేకుండా పంపిణీ జరగనున్నది.
- ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటకృష్ణకాలనీ, సోమాజిగూడ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్‌లలోని రేషన్ దుకాణాల పరిధిలో బియ్యం తూకం ఏ మాత్రం నష్టపోకుండా సరఫరా జరుగుతుంది.

మంటల్లో కాలిపోయిన కారు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 1 నుంచి వెళ్తున్న ఓ కారు అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారు నడుపుతున్న ఇబ్రహీంతో పాటు మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డారు. భారతీయ విద్యా భవన్ స్కూల్ వైపు నుంచి వచ్చిన ఈ కారు నుంచి మంటలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. ఆయన దిగిన కొద్దిసేపట్లోనే కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. భారీగా మంటలు చెలరేగడంతో ఇతర వాహనదారులు, స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఫిలింనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికే కారు పూర్తిగా కాలిపోయింది. షార్ట్‌సర్క్యూట్‌తోనే కారులో మంటలు చెలరేగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కారు రహ్మత్ నగర్‌కు చెందిన టి.లావణ్య (టీఎస్ 09 ఈ పీ 6553)దిగా పోలీసులు గుర్తించారు.



ఫొటో: 10ఎస్ఆర్‌జి03:

మహిళ అదృశ్యం



కోమర్ల అరుణ

రహమత్‌నగర్: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... బోరబండ అన్నానగర్‌లో నివాసముండే కోమర్ల అరుణ మదాపూర్‌లోని ఓ కంపెనీలో హౌస్ కీపింగ్‌గా పని చేస్తుంది. మూడు రోజుల క్రితం పని కోసమని వెళ్లి ఇంటికి తిరిగి రాక పోవడంతో ఆమె బంధువులు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సిలిండర్ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

డొమిస్టిక్ సిలిండర్‌లతో చిన్న గ్యాస్ సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేస్తున్న అజీజ్ అనే వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రెండు పెద్ద సిలిండర్లు, 15 చిన్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

లిబర్టీ: ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు గొప్ప పేరు ఉందని గుర్తు చేశారు. సోమవారం లిబర్టీ సమీపంలో ఉన్న లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో 60వ సత్సంగ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడటంతో కుటుంబ వ్యవస్థల్లో ముసలంపుట్టి వేరువేరుగా జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. కుటుంబ వ్యవస్థ మరింత బడపడాలంటే నైతిక విలువలను నేటి పౌరులకు నేర్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు వాసుదేవ రావు, దశరథ్, నందికొండలరావు పాల్గొన్నారు.

అందరి సంతోషమే లక్ష్యం

పంజగుట్ట: ప్రతి గ్రామంలోని చివరివ్యక్తి వరకు సంతోషంగా ఉండడమే భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పార్టీ వ్యవస్థాపక ఇన్‌చార్జి సంజయ్ అగర్వాల్ అన్నారు. లక్టికాపూల్‌లో పార్టీ సౌత్ ఇండియా సెంట్రల్ కార్యాలయం ప్రారంభించిన నేపథ్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షులు పూనం గుప్తా, జాతీయ అధికార ప్రతినిధి ఆర్.కె.ఎం.రాజులతో కలిసి మాట్లాడుతూ... పార్టీ 2020లో ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభించామని ఇప్పటికీ 250 గ్రామస్థాయిలో, 150 వార్డుల్లో విజయం సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్టీని ఐదు రాష్ట్రాలకు విస్తరించినట్లు తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఎస్‌సీ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు.

కూరగాయలతో మహిళల ఆందోళన

బంజారాహిల్స్: ధరల పెరుగుదలను నిరసిస్తూ టీటీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు షకిలా రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు సోమవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలకు నిరసనగా వీరు కూరగాయలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా షకిలారెడ్డి మాట్లాడుతూ... సామాన్యులు సరుకులు కొనే పరిస్థితుల్లో లేరని ఆరోపించారు. టమాట ధర కిలో ।160కి పెరగడానికి ప్రభుత్వ నిర్వాకమే కారణం అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం కరువైందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, అధికార ప్రతినిధి సూర్యదేవర లత తదితరులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్కు ముందు ఆందోళన చేస్తున్న మహిళలు

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



ఇందిరానగర్‌లో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో కొద్ది రోజులుగా దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లకు జలమండలి అధికారులకు ఎట్టకేలకు మరమ్మతులు చేపడుతున్నారు. బోనాల పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఇందిరానగర్‌లోని రామకృష్ణ మండపం వద్ద ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్ దుస్థితిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సోమవారం దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు.

బిల్డింగ్ పైనుంచి దూకిన ప్రేమికుడు

- యువకుడికి తీవ్రగాయాలు
- ప్రేమను కుటుంబ సభ్యులు అంగీకరించపోవడంతో దారుణం

ఫిలింనగర్: ప్రేమించిన యువతిని మర్చిపోవాలని ఇంటికి పిలిచి యువతి బంధువులు కొట్టడంతో పాటు బెదిరించడంతో ఓ యువకుడు బిల్డింగ్‌పై నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టోలిచౌకి మినీ జానకీ నగర్‌కు చెందిన యువతి(21)ని జీషన్(19) అనే యువకుడు కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన ఇరుకుటుంబ సభ్యులు మాట్లాడుకొని వీరి ప్రేమను అంగీకరించకుండా ఒకరిని ఒకరు కలుసుకోవద్దని షరతులు పెట్టారు. అయితే ఈ నెల 8వ తేదీన జీషన్ తాను ప్రేమించిన యువతితో కనిపించడంతో ఈ విషయాన్ని యువతి తల్లికి చేరవేశారు. ఆదివారం రాత్రి జీషన్‌ను యువతి కుటుంబ సభ్యులు తమ ఇంటికి పిలిపించారు. కూతురితో ఎందుకు తిరుగుతున్నావంటూ తల్లి ప్రశ్నించగా తీవ్ర గొడవ జరిగింది. ఈ నేపథ్యంలోనే యువతి బంధువు తన బైక్ తాళం చెవులతో జీషన్‌పై దాడికి దిగడంతో తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు కొట్టేందుకు యత్నిస్తుండగా జీషన్ రెండో అంతస్తు నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. జీషన్ తల్లి షాహిన్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు యువతి బంధువులపై ఐపీసీ సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్: వివేకానంద, భగత్‌సింగ్, చేగువేరా వంటి మహనీయుల స్ఫూర్తి, విప్లవ వారసత్వంతో యువత ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా సోమవారం కూనంనేని జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో కలసి హాజరయ్యారు. కూనంనేని మాట్లాడుతూ... యువత సమ సమాజ స్థాపనలో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ టిటి. జిస్మాన్, లెనిన్ బాబు, అరుణ్, విక్కీ, హరీష్ బాల, భారతి, రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత డాక్టర్ యశోదకు అభినందన



సీనియర్ వైద్యురాలు యశోదను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

వెంగళరావునగర్: ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ డాక్టర్స్ సమాజంలోని ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ అన్నారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ వైద్యురాలు డాక్టర్ పెనుబాల యశోదకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ డాక్టర్స్ ఎక్సలెన్సీ అవార్డును ఆదివారం రాత్రి అందించారు. వైద్యవృత్తిలో విశేష సేవలందించిన వారికి ఈ సంస్థ ఫిల్మ్‌నగర్ ఫిలించాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో అవార్డులను ప్రదానం చేశారు. దీనిని పురస్కరించుకుని సోమవారం ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో డాక్టర్ యశోదకు ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ ప్రభుత్వ ఆస్పత్రి తరపున కూడా జ్ఞాపికను అందించి అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఉమా శ్రీనివాస్, డాక్టర్ రమాదేవి, ఇతర సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్‌బాబు, డాక్టర్ సక్సేనా, డాక్టర్ సునీత జోషి, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా సుశీల్‌కుమార్



భిట్లా సుశీల్‌కుమార్

వెంగళరావునగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వెంగళరావునగర్ డివిజన్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు భిట్లా సుశీల్‌కుమార్ రెండోసారి నియమితులయ్యారు. గతంలో ఆయన ఇదే డివిజన్ అధ్యక్షుడిగా కొనసాగారు. ఈ సందర్భంగా సుశీల్‌కుమార్ మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి రెండోసారి కూడా అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ అధ్యక్షుడె ఎ.రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో జూబ్లీహిల్స్‌లో పార్టీ జెండాను ఎగురవేయడానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఫిలింనగర్‌లో కిడ్నాప్ కలకలం!

ఫిలింనగర్: తన కొడుకును కిడ్నాప్ చేశారంటూ ఓ వ్యక్తి డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో ఫిలింనగర్ పోలీసులు అప్రమత్తమై నిందితుల కోసం గాలింపు చేపట్టిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... సమతా కాలనీలో నివసించే షాహిద్(17) సమీపంలోని మహ్మద్ ఇమాద్ నడిపించే హాస్టల్‌కు వెళ్తుండేవాడు. ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. నాలుగు రోజుల క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవ పడగా ఈ విషయాన్ని షాహిద్ తన తండ్రి యాకుబ్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇమాద్ బైక్‌పై వచ్చి తన కొడుకును కిడ్నాప్ చేశాడంటూ యాకుబ్ డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. కిడ్నాప్ చేశారని భావిస్తున్న ఇమాద్ ఫోన్ ఆన్‌లో ఉండటంతో పాటు పోలీసులు ఫోన్ చేస్తే స్పందించడంతో నేరుగా ట్రాక్ చేసుకొని గండిపేటలో ఉన్న వీరి వద్దకు వెళ్లారు. పోలీసులు వెళ్లిసరికి ఇమాద్ మద్యం సేవిస్తూ తీరికగా కనిపించడంతో ఆశ్చర్యపోయారు. షాహిద్‌ను కిడ్నాప్ చేశావని తండ్రి ఫిర్యాదు చేసిన విషయాన్ని చెప్పగా తామిద్దరం కలిసే వచ్చామని గండిపేట వద్ద ఓ విందులో పాల్గొనేందుకు ముందే అనుకున్నామని చెప్పాడు. దీంతో ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. షాహిద్‌ను తండ్రికి అప్పగించారు. ఫేక్ కిడ్నాప్ అని తేలడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి 12 గంటలకు ఈ కథ సుఖాంతం అయింది. మొత్తానికి చుట్టుపక్కల నాలుగు పోలీస్ స్టేషన్ల అధికారులు ఈ కిడ్నాప్ ఉదంతంతో ఉలిక్కిపడ్డారు.

తానా సభల్లో పాల్గొన్న రోహిణ్‌రెడ్డి



తానా సభల్లో పాల్గొన్న ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: అమెరికాలోని ఫిలదెల్ఫియాలో జరుగుతున్న తానా మహాసభల్లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్కతో కలిసి ఇక్కడ ఇండియా ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. హైదరాబాద్‌లో ఉన్న బంధుమిత్రులకు ఈ మేరకు కాంగ్రెస్‌కు ఓటేయాల్సిందిగా సూచించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. రోజురోజుకూ పార్టీ బలపడుతున్నదని వెల్లడించారు.

సమతా కాలనీలో చోరీ

- పనిమనిషి కుమారుడిపై అనుమానం
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

ఫిలింనగర్: బీరువాలో దాచిన నగదుతో పాటు బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివీ... టోలిచౌకి సమీపంలోని 7 టూంబ్స్ సమతా కాలనీలో నివసించే రుక్యా సుల్తానా ఇంట్లో రెండేళ్లుగా లక్ష్మి అనే మహిళ పని చేస్తున్నది. కొంత కాలంగా ఆమె కొడుకు హర్షవర్ధన్ తల్లి పని చేస్తున్న రుక్యా సుల్తానా ఇంటికి వచ్చేవాడు. ఎందుకు వచ్చావని రుక్యా సుల్తానా ప్రశ్నిస్తే పొంతనలేని జవాబులు చెప్పేవాడు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం కూడా ఇంటికి వచ్చిన హర్షవర్ధన్‌ను సుల్తానా ప్రశ్నించింది. ఎందుకు వచ్చావని ప్రశ్నించగా అడ్డదిడ్డంగా సమాధానం చెప్పాడు. ఈ నెల 9వ తేదీన ఆమె బీరువా తెరిచి చూడగా అందులో ఉన్న రూ. 1.50 లక్షల నగదుతో పాటు బంగారు ఆభరణాలు కనిపించలేదు. హర్షవర్ధన్ ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


అమరుల కుటుంబాలకు ప్రాధాన్యం ఏదీ?



మాట్లాడుతున్న అమరుడు కొమరయ్య భార్య పూలమ్మ

పంజగుట్ట: సకల జనుల పోరాటం, అమరుల త్యాగంతో వచ్చిన తెలంగాణలో ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు చోటు లేకపోవడం బాధాకరమని అమరుల కుటుంబాలు, ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఎక్కడ రాదో అనే ఆవేదనతో పురుగుల మందును మంచి నీళ్లలా తాగి చనిపోయిన కుటుంబాలు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పిల్లల్ని పెంచలేక తీవ్ర వేదనకు గురవతున్నామన్నారు. తెలంగాణ అమరుల ఆశయాల సాధన జేఏసీ, 1969-2024 తొలిదశ, మలిదశ ఉద్యమ సంస్థల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జేఏసీ అధ్యక్షుడు బత్తుల సోమయ్య, రఘుమారెడ్డి, తెలంగాణ అమరవీరుల స్థూపం చెక్కిన ఎక్కా యాదగిరి మాట్లాడుతూ... రూ. 170 కోట్లు ఖర్చుపెట్టి అమరుల స్థూపం కడతారు కానీ అందులో అమరుల పేర్లు ఫొటోలు పెట్టడం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. ఉద్యమం సమయంలో ప్రాణత్యాగం చేసుకున్న వరంగల్‌కు చెందిన కొమరయ్య భార్య పూలమ్మ మాట్లాడుతూ... తన భర్త తెలంగాణ రాదని మనస్థాపంతో విషంతాగి చనిపోయాడని అప్పుడు అతను రాసిన సూసైడ్ నోట్ ఉందని, పోలీసుల ఎఫ్ఐఆర్ ఉందని, అన్ని పత్రికల్లో ప్రచురించారు, టీవీల్లో చూపించారని కానీ అమరుల జాబితాలో తమ కుటుంబాన్ని చేర్చకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలోనే 1200 మంది అమరులయ్యారని ప్రకటించారని మరి వారి జాడ ఆయనకు తెలియడం లేదా అని ప్రశ్నించారు.

సేవ చేయడంలో పోలీసుల పాత్ర కీలకం



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న స్వాతి లక్రా తదితరులు

వెంగళరావునగర్: పౌరులకు రక్షణ కల్పిస్తూ దేశ సేవ చేసే విషయంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైనదని టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా అన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో మూడు నెలల పాటు బ్యాండ్ ట్రైనింగ్ సిబ్బందికి ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం బ్యాండ్ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి బహుమతి ప్రదానం, ప్రశంస పత్రాలు అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వాతి లక్రా మాట్లాడుతూ... సమాజంలో మార్పు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీసులందరికీ తమ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఐజీ సిద్ధిఖీ, ఫస్ట్ బెటాలియన్ అధికారి కమాండెంట్ ఎ.కె.మిశ్రా, అసిస్టెంట్ కమాండెంట్లు కె.పి.సత్యనారాయణ, రంగారెడ్డి, బి.జవహర్‌లాల్, ఆర్ఐలు ఎస్.సురేష్, టి.ధర్మారావు, టి.సాంబయ్య, ఆర్.శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, ఆర్ఎస్ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

'అదృశ్యం' అవాస్తవం!

పవన్ కళ్యాణ్ ఆరోపణలు నిరాధారం: పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారని, అందుకు వలంటీర్లే కారణమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని పోలీసు శాఖ స్పష్టం చేసింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను వక్రీకరించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకే ప్రయత్నించారని ఓ ప్రకటనలో పేర్కొంది. దిశ వ్యవస్థ, జీరో ఎఫ్ఐఆర్ లాంటి సంస్కరణలతో దేశంలోనే మహిళా భద్రతలో ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేసింది. 2019–21 మధ్య రాష్ట్రంలో 30 వేల మంది మహిళల అదృశ్యం కేసులు నమోదు కాగా 14 వేల మంది ఆచూకీ మాత్రమే కనుగొన్నట్లు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని పేర్కొంది. ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ఇంట్లో ఘర్షణలు, మానసిక రుగ్మతలు తదితర కారణాలతో ఆచూకీ తెలియని కేసులన్నింటినీ పోలీసులు మిస్సింగ్ కేసులుగానే నమోదు చేస్తారు.

ఆచూకీ గుర్తించి సురక్షితంగా..

2019 – 21 మధ్య అదృశ్యమైన మహిళలు మొత్తం 24,557 మంది. 2019కు ముందు అదృశ్యమై ఆచూకీ లభించని మహిళలు 1,542 మంది. మొత్తంమీద 2021 నాటికి అదృశ్యమైన మహిళల సంఖ్య 26,099. వీరిలో 2021 డిసెంబర్ నాటికి 23,394 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. మిగిలిన 2,705 మందిలో 500 మంది ఆచూకీని 2022–23లో కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా)కు పాల్పడినట్లు రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క వలంటీర్ పైనా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. వారిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. స్వచ్ఛంద సేవలో నిమగ్నమైన లక్షలాది మంది వలంటీర్లను కించపరుస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం గర్హనీయం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

పవన్ 'సంఘ విద్రోహ' వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన

ర్యాలీలు.. పలుచోట్ల దిష్టి బొమ్మలు, ఫొటోలకు నిప్పు



ప్రకాశం జిల్లా.. ఒంగోలు చర్చి సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: గ్రామాల్లో ఆత్మీయులకు స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంఘ విద్రోహ శక్తులతో పోల్చటంపై నిరసన జ్వాలలు భగ్గుమన్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఆప్యాయంగా పలుకరించే వలంటీర్ సోదరులకు దురుద్దేశాలను ఆపాదించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లుగా దాదాపు 53 శాతం మంది యువతులు సేవలందిస్తుండగా సాటి మహిళలకు వారెందుకు చేటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడ్డ వేళ బాధితుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే వెనుకాడినా వలంటీర్లు మానవత్వంతో అందించిన సేవలను గుర్తు చేస్తున్నారు. పవన్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల వలంటీర్లు ఆగ్రహంతో ఊగిపోతూ పవన్‌కళ్యాణ్ ఫోటోలు, పోస్టర్లను చెప్పుతో కొడుతూ నిరసన తెలిపారు. దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. జనసేన అధ్యక్షుడి అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వలంటీర్లు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. 'సేవా భావంతో పనిచేసే మా వలంటీర్ల జోలికొస్తే తాట తీస్తాం..' అంటూ హెచ్చరించారు. నిన్న.. వలంటీర్లను మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహులుగా అభివర్ణించిన పవన్‌కళ్యాణ్ తాజాగా వారు సేకరించే సమాచారం ఎక్కడెక్కడికో పోతోంది...! అది చాలా భయంకరమైన వ్యవస్థ.. ఇళ్లల్లోకి దూరుతున్నారు.. ! అవి ఊడిగం ఉద్యోగాలంటూ వలంటీర్ల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏపీలో మహిళల కిడ్నాప్‌లకు సంబంధించి తనకు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం ఉందని పవన్ చెబుతుండగా.. అదే నిజమైతే అలాంటి కీలక వివరాలను ఓ రాజకీయ నేతకు నిఘా వర్గాలు అందిస్తాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి స్క్రిప్టు సమకూర్చింది ఈనాడు రామోజీ కాగా చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ యాక్టింగ్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పది రోజుల్లో ఆధారాలివ్వాలి

- పవన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసు
- లేదంటే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు, మహిళా సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, అందుకు వలంటీర్లే కారణమంటూ భయభ్రాంతులకు గురి చేసేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. తమను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు వలంటీర్లు, మహిళా సంఘాల నేతలు మహిళా కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళగిరిలోని మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను కలిశారు. నిరాధార ఆరోపణలు చేసిన పవన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాసిరెడ్డి పద్మ మీడియాతో మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా వలంటీర్లపై దారుణమైన కామెంట్లు చేసిన పవన్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దీనిపై ఆధారాలతో పది రోజుల్లోగా మహిళా కమిషన్‌కు వివరణ ఇవ్వాలని లేదంటే మహిళలకు పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఒంటరి మహిళలను అవమానించేలా మాట్లాడిన పవన్ తన వద్ద ఉన్న కేంద్ర ఇంటెలిజెన్స్ సమాచారాన్ని బయట పెట్టాలని సూచించారు.

అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు

సాక్షి, అమరావతి: నంది నాటకోత్సవాలను అక్టోబర్ నెలలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో (రంగస్థల పురస్కారాలు) భాగంగా ఐదు విభాగాల్లో 73 అవార్డులను ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నంది నాటకోత్సవాల నిర్వహణపై నాటక రంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, పిల్లల లఘు నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ లఘు నాటిక (ప్లేలెట్స్) అనే ఐదు విభాగాల్లో అవార్డులు అందజేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చామని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండే ప్రాంతాన్ని నంది నాటకోత్సవాలకు వేదికగా ఎంపిక చేస్తామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 88,836 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమలలో చిరుజల్లులు కురిశాయి. శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీశారు.

'పారిశ్రామిక' పరుగులు

- అల్ డిక్సన్‌లో నూతన యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం జగన్
- టెక్నోడోమ్ (టీవీ యూనిట్), వర్చువల్ మేజ్ సంస్థలకు శంకుస్థాపన



వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో అల్‌డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా కడప సమీపంలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్క్ కేంద్రంగా పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే, సీఎం సమక్షంలో టెక్నోడోమ్ (టీవీ యూనిట్), వర్చువల్ మేజ్, సంస్థలకు సీఎం శంకుస్థాపన చేయగా.. టెక్నోడోమ్ (వాషింగ్ మెషీన్ యూనిట్), ఛానెల్ ప్లే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు.

■ అల్ డిక్సన్ కంపెనీలో సీసీ కెమెరాలు, డిజిటల్ వీడియో రికార్డర్లు మొదలైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేస్తారు. ఐదేళ్ల కాలవ్యవధిలో రూ.127 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ సంస్థలో 1,800 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. అలాగే, ఉత్పత్తి సామర్థ్యం పెంపులో భాగంగా మరో రూ.80 కోట్ల పెట్టుబడితో 'ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, సెక్యూరిటీ కెమెరాలు మొదలైన పరికరాలు తయారుచేస్తారు. తద్వారా మరో 1,100 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే, రూ.125.26 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసే మరో యూనిట్ ద్వారా 630 మందికి ఉద్యోగావకాశాలు అందించే లక్ష్యంతో అల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు సాగుతోంది. మొదటి దశలో ఉత్పత్తులు ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటివరకు కంపెనీ 860 మందికి ఉపాధి కల్పిస్తోంది.

■ 2007 నుంచి వర్చువల్ మ్యాప్ ఆధారిత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్న 'వర్చువల్ మేజ్ సాఫ్ట్‌స్ ప్రైవేట్ లిమిటెడ్' ఉత్పత్తులు ప్రారంభించేందుకు ముందుకొచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాలకు వాడే బ్యాటరీలు, జీపీఎస్ ట్రాకర్, స్మార్ట్ పీసీబీ వంటి అధునాతన డివైస్‌లను ఇక్కడ ఉత్పత్తి చేస్తారు.

■ అరబ్ దేశాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఎలిస్టా కంపెనీకి అనుబంధంగా 'టెక్నోడోమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 'కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ కంపెనీ రూ.52 కోట్లతో ఏర్పాటవుతోంది.

రూ.5 వేలకు ఊడిగం చేసే ఉద్యోగం 'వలంటీరు'

- సున్నితమైన సమాచారాన్ని వలంటీర్లు సేకరిస్తున్నారు
- వితంతువులు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి
- ఏలూరు జనసేన వీర మహిళల సమావేశంలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు : 'వలంటీరు పోస్టు అనేది రూ.ఐదు వేలకు ఊడిగం చేసే ఉద్యోగం. ఐదు లక్షల మంది వలంటీర్లకు ప్రజల డబ్బుతో జీతం ఇస్తున్నారు. వలంటీర్లు ప్రభుత్వోద్యోగులు కానప్పుడు.. ప్రభుత్వంలో అనేక వ్యవస్థలు ఉన్నప్పుడు వలంటీర్లతో అసలు పనేముంది?'.. అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీరు వ్యవస్థపై మరోసారి నోరుపారేసుకున్నారు. ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, వీర మహిళల సమావేశంలో పవన్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. జనసైనికులు అవసరమైతే వలంటీర్లను నిలదీయాలి. ఏపీలో ఎంతమంది అమ్మాయిలు మిస్సవుతున్నారో ఆ డేటా మీ దగ్గర ఉందా అని, నిఘా వర్గాల్లో ముఖ్యులు నన్ను అడిగితే నా మతిపోయింది. ప్రతి గ్రామంలో పదిమంది యువకులు వలంటీర్ల పేరుతో ఇంటింటికీ తిరుగుతూ సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలున్నాయా.. వితంతు మహిళలున్నారా, భర్తలు బయటకు వెళ్లాక భార్యలు ఏం చేస్తున్నారు? ఇలా సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ పెట్టిన మొదట్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ బలోపేతానికి అని అనుకున్నాం. కానీ, ఇది చాలాచాలా భయంకరమైన వ్యవస్థగా మారిపోయింది. ఇది అందరి వలంటీర్ల గురించి కాదు.. కొందరి గురించే. అయితే, డేటా మాత్రం కచ్చితంగా వెళ్తోంది. వలంటీర్లు తప్పుచేస్తే ఎవరికి చెప్పాలి. వారేమో ప్రభుత్వోద్యోగులు కాదంటారు. వలంటీర్లు ఇబ్బంది పెడుతుంటే టోల్‌ఫ్రీ నంబర్ ఉండాలి. ఇక రేషన్ డీలర్ల వ్యవస్థను చంపేసి 10 వేల వ్యాన్లు ఇచ్చారు. ఈ వ్యవస్థపై పర్యవేక్షణలేదు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి.

నగర వార్తలు

చిగురిస్తున్న రీ లొకేట్ చేసిన చెట్లు



బంజారాహిల్స్: ఇటీవల నెక్లెస్ రోడ్డు ఎన్టీఆర్ మార్గ్ అభివృద్ధితోపాటు ఫార్ములా ఈ కార్ రేస్ కోసం ఈ రోడ్డులో ఉన్న భారీ చెట్లను తొలగించారు. వీటిని సంజీవయ్య పార్కులో రీ లొకేట్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అప్పుడు నాటిన ఈ చెట్లు తిరిగి జీవం పోసుకొని చిగురిస్తున్నాయి. ఇప్పుడు ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

రేపు ఉద్యమ అమర కళాకారులకు పాటల నివాళి

పంజగుట్ట: వాగ్గేయకారులు, గాయకుల పాటలతో ఉద్యమానికి ఊపిరి పోసి, పాటలతో యావత్ తెలంగాణ సకల జనులకు ఐక్యం చేసి తెలంగాణ సాధిస్తే వచ్చిన తెలంగాణలో కళాకారులకు గౌరవం లేదని తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కళాకారుల వేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పుడు పాటతో తిరుగుబాటు చేసి మరో ఉద్యమం ప్రారంభించేందుకు ఈ నెల 12వ తేదీన జనగామ, జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో 'తెలంగాణ ఉద్యమ అమర కళాకారులకు పాటల నివాళి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని టీపీఎస్ అధ్యక్షులు చింత స్వామి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కళాకారుల వేదిక అధ్యక్షుడు ఎస్.కె.రాజు, ఓయూ జేఏసీ మాజీ అధ్యక్షులు, కళాకారులు దరువు అంజన్న, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు బైరాగి మోహన్, కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి బాధ్యులు జె.పరుషరాములు, అరుణక్కలు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు కంటి సాయన్న, సంజీవ్, గద్దం సుధాకర్, బరపట్ల రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు అంతర్జాతీయ ఖ్యాతి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

చార్మినార్: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ఎన్నో దేశాలలో నిర్వహిస్తున్నారని.. ఇది రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని గౌలిపురా భరతమాత దేవాలయం వద్ద, గుడిమల్కాపూర్‌లోని జాంసింగ్ దేవాలయం వద్ద 358 దేవాలయాలకు మంజూరైన రూ. 2.13 కోట్లకు సంబంధించిన ప్రభుత్వ ఆర్థిక సాయం చెక్కులను ఆయా దేవాలయాల కమిటీ సభ్యులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... బోనాల ఉత్సవాలను ప్రజలు గొప్పగా, సంతోషంగా జరుపుకోవాలనేది ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆలోచన అన్నారు. ఉత్సవాల నిర్వాహణకు దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు మాత్రమే కాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రైవేటు దేవాలయాలకు కూడా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇందు కోసం ఈ సంవత్సరం రూ. 15 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. గత నెల 22వ తేదీన గోల్కొండలో బోనాలు ప్రారంభం కాగా ఈ నెల 9వ తేదీన సికింద్రాబాద్ బోనాలు జరిగాయని తెలిపారు. 16వ తేదీన హైదరాబాద్ బోనాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో బోనాల చెక్కులను అందజేస్తున్నట్లు వివరించారు. బోనాల జాతరకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో బోనాలను ఘనంగా జరుపుకోవాలని మంత్రి కోరారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఉమ్మడి దేవాలయాల కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రాజ్, మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, నేతలు రాకేశ్ తివారీ, కైలాష్, ఆనంద రావు, మధుయాదవ్, మధుగౌడ్, మాజీ కార్పొరేటర్‌లు బంగారు ప్రకాశ్, మిత్ర కృష్ణ, లక్ష్మీనారాయణ, జీవన్ సింగ్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణకు గర్వకారణం



చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రేపటి విద్యాసంస్థల బంద్‌కు మద్దతు

- ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్, ఏఐఎఫ్‌డీవై



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిమాయత్‌నగర్: వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 12వ తేదీ చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వామపక్ష యువజన సంఘాలు ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీలు వెల్లడించాయి. వామపక్ష యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సమావేశం హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశంలో విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బంద్‌లో అన్ని సంఘాలకు సంబంధించిన నాయకులు పాల్గొనాలని తీర్మానం చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. ప్రదీప్, ఏఐఎఫ్ డీవై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర మౌలిక సదుపాయాల కల్పన జరగలేదన్నారు. బంద్‌ను జయప్రదం చేస్తామన్నారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నిర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బైగ్, టి.సత్య ప్రసాద్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్, పీవైఎల్ రాష్ట్ర నేతలు రవికుమా ర్, బి.కృష్ణ, బి.శ్రీనివాస్, రాజు, ఏఐఎఫ్ డీవై హైదరాబాద్ జిల్లా నేత మధుసూదన్ పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి: ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించి 12 నెలల కన్సాలిడేట్ జీతం ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చాలీచాలని జీతాలకు పనిచేస్తూ రాష్ట్ర విద్యాభివృద్ధిలో గెస్ట్ లెక్చరర్స్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం, ఉన్నత విద్యా కమిషనర్ వీళ్లకు ఎలాంటి సర్వీసు సర్టిఫికెట్ కానీ కన్సాలిడేట్ వేతనం ఇవ్వరని తెలిపారు. ఏటా డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిందేనని అన్నారు. 2023–24వ విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టి.హరీష్‌రావు 1940 మంది గెస్ట్ లెక్చరర్స్‌ను రెన్యువల్‌కు అనుమతిచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ కమిషన్ ఆర్థిక శాఖ ఇచ్చిన జీఓ: 1118ను పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి వెంటనే చొరవ తీసుకొని 2022–23 విద్యా సంవత్సరంలో కాలేజీల్లో పనిచేసిన 1940 మంది అతిథి అధ్యాపకులను మళ్లీ 2023–24వ సంవత్సరానికి కొనసాగించాలని డిమాండ్ చేశారు. నేతలు నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ, జిల్లాపల్లి అంజి, రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్, నందగోపాల్, జి.శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, డాక్టర్ జయరాములు, బి.వెంకటస్వామి, భార్గవి, మమత, శ్యామల, కరుణాకర్, లక్ష్మీనారాయణ, కేశవులు, కృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో విభజన రాజకీయాలు ఆపండి



- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

హిమాయత్‌నగర్: మణిపూర్‌లో భారతీయ జనత పార్టీ విభజన రాజకీయాలు చేస్తోందని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై ఆరోపించారు. బీజేపీ చేస్తున్న చౌకబారు విభజన రాజకీయాలను ఇప్పటికైనా పక్కన పెట్టి అక్కడి ప్రజల్లో శాంతిని నెలకొల్పాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ చేస్తున్న విభజన రాజకీయాల కారణంగా అక్కడి ప్రజల్లో హింస చెలరేగిందన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు ×మోడీ మౌనాన్ని వీడాలని–మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలి× అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. తిరుమలై రామన్ మాట్లాడుతూ... ప్రధాని మోడీ తన ఎన్నికల తీర్థయాత్ర కోసం ఛత్తీస్‌ఘఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్‌లకు వెళుతున్నారే తప్ప ఘర్షణలు జరుగుతున్న మణిపూర్‌లో మాత్రం అడుగుపెట్టడం లేదన్నారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పడంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మణిపూర్‌లో శాంతి నెలకొల్పాని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రికి ఈమెయిల్, పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వలీఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ప్రకటించారు. జాతీయ నేతలు హరీష్ బాల, భారతి, కరంవీర్ కౌర్, భారతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం బీసీలు ఏకం కావాలి

హిమాయత్‌నగర్: హక్కులు, రాజ్యాధికారం దక్కించుకునేందుకు బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు వక్తలు అన్నారు. బీసీ రాజకీయ జాగృతి ఆధ్వర్యంలో 'తెలంగాణ రాజకీయాలు–బీసీల పాత్ర' అనే అంశంపై సోమవారం నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్లో సదస్సు జరిగింది. బీజేపీ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, తెలంగాణ ఆత్మ గౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరా శోభన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. రామన్ గౌడ్, జాగృతి సంస్థ ప్రతినిధి పడాల శ్రీనివాస్‌గౌడ్ లు హాజరై ప్రసగించారు. తూళ్ల వీరేంద్ర గౌడ్ మాట్లాడుతూ..వెనుకబడిన వర్గాల ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి పోరాటాలు చేస్తున్నామన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా బీసీల బతుకులు మాత్రం మార డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ..విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరుతూ ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరా శోభన్ మాట్లాడుతూ..బహుజనులు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ ఒకేతాటిపైకి వచ్చినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. అందుకోసం సమిష్టిగా పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. రాజకీయ, సంఘాల నేతలు రాంమోహన్‌గౌడ్, గొంటి కుమార్ చౌదరి యాదవ్, కె.జనార్ధన్ గౌడ్, హనుమంత్, ఆంజనేయులు, హరిత్, నాగుళ్ల శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- కార్మిక శాఖ కమిషనర్‌కు టీఎస్ఆర్టీసీ నేతల జేఏసీ వినతి

చిక్కడపల్లి: ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని టీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మిక కమిషనర్‌కు సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఇ.అశ్వత్థామ రెడ్డి, కన్వీనర్ కె.హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ... పక్క రాష్ట్రంలో మాదిరిగానే టీఎస్ఆర్టీసీని కూడా ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం మాస్టర్ పేస్కేల్స్ అమలు చేస్తూ పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలు 2017, 2011 ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు చెల్లించాలన్నారు.

2021 ఫిబ్రవరిలో విడుదల చేసిన ఉద్యోగ భద్రత గైడ్‌లైన్స్‌ను రద్దు చేసి సెక్షన్ 112ఎ(1) మోటార్ వెహికిల్ యాక్ట్ 1939 ప్రకారం టికెట్ తీసుకునే బాధ్యత పూర్తిగా ప్రయాణికుడిదిగా నిర్ణయిస్తూ సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆర్టీసీలోని హైర్ బస్సులన్నింటినీ సంస్థ బస్సులుగా స్వాధీనపర్చుకుని ఆ బస్సులపై పని చేస్తున్న డ్రైవర్లను సంస్థ ఉద్యోగులు గుర్తించి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా జీతాలు చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల జీతాలనుంచి రికవరీ చేసిన ఉద్యోగులు పొదుపు సంస్థలైన సీసీఎస్ రూ. 1050 కోట్లు, పీఎఫ్ రూ. 1235 కోట్లు, ఎస్‌బీటీ రూ. 500 కోట్లు వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. జేఏసీ కో కన్వీనర్ నరేందర్, ఎర్రస్వామి, అబ్రహాం, సుద్దాల సురేష్, యాదగిరి, పున్న హరికిషన్, గంటా సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 11-7-2023

‘పట్టు కోసం పట్టుపురుగుల ప్రాణాలు తీయవద్దు.
పత్తి కోసం రైతులు కష్టాలను కొని తెచ్చుకోవద్దు.
మట్టిలో కలవడానికి మొరాయిస్తుంది పాలియెస్టర్.
ఆ దుస్తులతో పర్యావరణానికి హాని కలిగించద్దు.
గడ్డి దారంతో ఫ్యాషన్‌లో కొత్త ట్రెండ్ తీసుకువద్దాం.
స్టైల్ స్టేట్‌మెంట్‌కి కొత్త నిర్వచనం ఇద్దాం’...
...అంటోంది నేచర్ లవర్ శృతి రావల్.



తాను రూపొందించిన హెంప్ డ్రెస్‌తో శృతి రావత్

గడ్డిదారంతో దుస్తులు

● కాదేదీ ఫ్యాషన్‌కనర్హం!

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసిన శృతి అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించింది. పర్యావరణ పరిరక్షణ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే తన సంకల్పానికి వస్త్ర ప్రపంచాన్ని వేదికగా మార్చుకుందామె. ఎకో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ పట్ల తన ఆసక్తిని సాక్షితో పంచుకున్నదీ యువతి.

ఫ్యాషన్ - పర్యావరణం

“నేను పుట్టింది హరియాణాలోని పంచకుల. అమ్మ పుట్టిల్లు పంజాబ్. నాన్నది హరియాణా. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్ వచ్చేటప్పటికి నేను సిక్త్స్ క్లాస్‌లో ఉన్నాను. ఇక నా చదువు, కెరీర్ అంతా హైదరాబాద్‌తోనే ముడివడిపోయింది. ఫ్యాషన్ ప్రపంచాన్ని బాగా అధ్యయనం చేసే కొద్దీ ఈ ఇండస్ట్రీ నుంచి పర్యావరణానికి కలిగే హాని అర్థమైంది. చాలా ఆందోళన కలిగింది. మన వస్త్రాల మోజు భూమిని అతలాకుతలం చేస్తోంది. భూమాతను కలుషితం చేస్తున్న ఇండస్ట్రీలలో ఫ్యాషన్ ఇండస్ట్రీ రెండవది. దీనికి పరిష్కారం ఈ రంగంలోనే వెతకాలనిపించింది. పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాన్ని చూపించాలనేదే నా ప్రయత్నం. నా స్టూడియోకి ‘ఎవోక్’ అని పేరు పెట్టడంలోని ఉద్దేశం కూడా పర్యావరణం పట్ల నిద్ర మేల్కొనండి’ అని పిలుపునివ్వడం.



పేపర్ ప్రజెంటేషన్ సందర్భంగా...

రిస్క్ అని హెచ్చరించారు!

ఎవోక్ ప్రాజెక్ట్ నా బ్రెయిన్ చైల్డ్. ఈ ఎకో ఫ్రెండ్లీ క్లోతింగ్ స్టూడియోని 2020 మార్చిలో ప్రారంభించాను, అదే నెలలో లాక్‌డౌన్ మొదలైంది. ఆ మెటీరియల్‌తో మాస్కులు చేసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి విరాళంగా ఇచ్చాను. ఈ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే... ‘రిస్క్ చేస్తున్నావు’ అన్నారు తెలిసిన వాళ్లందరూ. పర్యావరణ పరిరక్షణ గురించి దశాబ్దాలుగా చెప్తున్నా కూడా సమాజంలో తగినంత చైతన్యం రానేలేదు. ఈ గడ్డి దుస్తుల గురించి అసలే తెలియదు. రంగు భరోసా, వస్త్రం మన్నిక ఉంటుందని కూడా తెలియదు. అలాంటప్పుడు మార్కెట్ ఎలా? పెట్టుబడి వెనక్కి వచ్చేదెప్పటికి? అన్నారు. అందరూ అలా అనుకుని తమను తాము సేఫ్‌జోన్‌లో ఉంచుకుంటే చాలా? బాగా లాభాలు వచ్చే రంగాన్నే ఎంచుకోవాలనే స్వార్థం తప్పు కాదు. కానీ లాభాల కోసం కొన్నేళ్లపాటు ఎదురు చూడగలిగిన ఆర్థిక పరిపుష్టి ఉన్నవాళ్లయినా ఒక ప్రయత్నం చేయాలి. ఇరవై ఏళ్ల కిందట ఎవరూ ముందుకు రాకపోతే మనం ఈ రోజు ఎలక్ట్రానిక్ వెహికల్‌ను వాడగలిగేవాళ్లమా? అలాగే వీగన్ డైట్ గురించి కూడా ఎంతోమంది సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చైతన్యవంతం చేశారు. నేను కూడా గత నెల 23వ తేదీన హెంప్, బెంబెర్గ్, టెన్సెల్, సిట్రస్ పీల్ వస్త్రాలతో రూపొందించిన డిజైనర్ వేర్‌తో ఫ్యాషన్ పెరేడ్ నిర్వహించాను. ఎకో ఫ్రెండ్లీ, ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ ఉద్యమంలో మమేకమయ్యే క్రమంలో నేను వెజిటేరియన్‌గా మారిపోయాను” అని చెప్పింది శృతి. ‘భవిష్యత్తులో మనం ప్రతి విషయంలోనూ పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను వెతుక్కోవాల్సిందే. అందులో భాగంగా నేను నా ఫ్యాషన్ రంగాన్నే మాధ్యమంగా ఎంచుకున్నాను’ అని చెప్పారు శృతి రావల్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఒక రైతు పొలం దున్ని పత్తి పంట వేసి ఒక కేజీ పత్తి పండించాలంటే ఇరవై వేల లీటర్ల నీరు కావాలి. ఒక టెక్స్‌టైలర్ ఒక టీ షర్టుకి రంగులద్దడానికి రెండున్నర వేల లీటర్ల నీరు కావాలి. పత్తి పండడానికి పట్టే నీటిని భూమి పీల్చుకుంటుంది. ఇది కొంతలో కొంత నయం. కానీ హాట్ డైయింగ్ పద్ధతిలో రసాయన రంగులద్దిన నీరు భూమిని కలుషితం చేస్తుంది. అందుకే నేను గడ్డి మొక్కల దారంతో వడికిన వస్త్రాలను పరిచయం చేస్తున్నాను. మనదేశంలో ఇలాంటి సంస్థలు నాలుగైదుకి మించిలేవు. ఇక పూర్తి స్థాయి హెంప్ (నార) క్లోతింగ్ స్టూడియో హైదరాబాద్‌లో ఇదొక్కటే.

ఆకులతో దారం !

ఆకులను శుభ్రం చేసే ప్రాసెస్‌లో బూజు పట్టకుండా సహజసిద్ధమైన వనరులనే జత చేస్తారు. ఎండిన ఆకులతో దారం వడుకుతారు. మొక్కల ఆకుల దారంతో వస్త్రాలు తయారు చేసే పరిశ్రమలు మనదేశంలో రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లో మాత్రమే ఉన్నాయి. ఈ గడ్డి రకం మొక్కలు పత్తిలాగ ఎక్కువ నీటిని తీసుకోవు. పత్తికంటే త్వరగా పెరిగి చేతికి వస్తాయి. వీటి పరిరక్షణ కోసం శ్రమించాల్సిన అవసరం ఉండదు. ఈ దారం ఇప్పుడు చైనా నుంచి దిగుమతి అవుతోంది. ఈ దుస్తులు ఎలా ఉంటాయోననే ఆందోళన అక్కర్లేదు. నేను ధరించింది హెంప్ వీవింగ్ డ్రెస్సే. క్లాత్ మీద డిజైన్‌లు నేను రూపొందించి డిజిటల్ ప్రింట్ చేయిస్తాను. కోల్డ్ డై కలర్స్ కాబట్టి క్లాత్‌తోపాటు ఎక్కువ కాలం మన్నుతాయి.

– శృతి రావల్, ఫౌండర్, ఎవోక్ స్టూడియో, హైదరాబాద్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఏ మంచికి మేలు చేస్తుందో ఏ చెడుకు హాని చేస్తుందో ఇంకా తేలలేదు కాని మనుషుల ఉపాధికి గట్టి పోటీ ఇచ్చేలా ఉంది.
ప్రాంతీయ భాషల్లో మొదటిసారిగా ఏఐతో తయారైన యాంకర్‌ను ఒడియా టివి ప్రవేశపెట్టింది.
ఈ యాంకర్ పేరు లిసా. ఇంగ్లిష్‌లో, ఒడియాలో వార్తలు చదివే లిసా ఒక కొత్త ఎట్రాక్షన్.
ఒడియా టీవి కంటెంట్ హెడ్ లితిషా మంగత్ ఈ కొత్త ఆలోచనతో వార్తలకు ఎక్కింది.

వార్తలకు స్వాగతం.. నేను లిసా

న్యూస్‌మేకర్


ఏఐతో తయారైన యాంకర్ లిసా

దూరదర్శన్ న్యూస్‌రీడర్‌ల దగ్గరి నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ) వర్చువల్ న్యూస్‌రీడర్ల వరకు మన దేశంలో టెలివిజన్ న్యూస్‌రీడర్ల ప్రస్థానం విశేషంగా కొనసాగుతూ ఉంది. ఒకప్పుడు నేషనల్ డిడి, రీజనల్ డిడిలో గుప్పెడు మందిగా ఉండే న్యూస్‌రీడర్లు ఇవాళ వందలాది ప్రయివేటు చానల్స్ వల్ల వేలమందిగా తయారయ్యారు. అయితే ఇప్పుడు వీరందరికీ ఒక సవాలు వచ్చిపడింది. మీడియా సంస్థలు ఏ.ఐ ద్వారా వర్చువల్ న్యూస్‌రీడర్లను సృష్టించి వారి ద్వారా యాంకర్ సేవలు చేయించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. జాతీయ స్థాయిలో ‘ఆజ్‌తక్’ తొలి వర్చువల్ న్యూస్ రీడర్ ‘సన’ను ప్రవేశపెట్టగా ప్రాంతీయ చానెల్స్‌లో మొదటిసారి ‘ఒడియా టీవి’ తన వర్చువల్ న్యూస్‌రీడర్ ‘లిసా’ను ప్రవేశపెట్టింది.



లిసా

నేను లిసా

ఒరిస్సాలో ఒడియా టివి దాదాపు నంబర్ 1 స్థానంలో ఉంది. ఆ చానల్ తొలి వర్చువల్ న్యూస్ రీడర్ పేరే లిసా. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్.ఎల్.ఎం) ద్వారా లిసా న్యూస్ చదవడం, ఇతర ప్రోగ్రామ్స్ నిర్వహించడం చేస్తుంది. ‘సాంకేతికంగా ఇది అంత సులభంగా సాధ్యం కాలేదు. లిసాను సృష్టించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. లిసా ఇప్పటికిప్పుడు అంత ధారాళంగా ఒడియా మాట్లాడలేకపోయినా ముందు ముందు ఆ సమస్యను అధిగమిస్తాం’ అని ఓటివి (ఒడియా టివి) డిజిటల్ బిజినెస్ హెడ్ లితిషా మంగత్ చెప్పింది. ‘టెలివిజన్ రంగంలో మానవ వనరులను వార్తలను సేకరించడానికి సమర్థంగా ఉపయోగించాలి. వారు మంచి వార్తలు తెస్తే వాటిని చదవడం లిసా వంటి వర్చువల్ న్యూస్‌రీడర్లు చేసినా తప్పులేదు’ అని చెప్పిందామె. చక్కటి చీరకట్టులో సంప్రదాయ రూపం, బ్లేజర్‌లో ఆధునిక రూపంతో లిసా కనిపిస్తుంది. సరదాగా చెప్పాలంటే లిసా మేకప్, కాస్ట్యూమ్స్‌కు ఎటువంటి ఖర్చు ఉండదు. కంప్యూటర్‌ను టకటకలాడిస్తే కోరిన డ్రెస్, హెయిర్ స్టయిల్‌తో తెర మీద ప్రత్యక్షమవుతుంది.

ఆధునికతను అందిపుచ్చుకుని...

ఒడియా టివిని లితిషా మంగత్ తన నాయకత్వంలో ముందుకు తీసుకువెళుతోంది. తల్లి జగి మంగత్ 1997లో స్థాపించిన ఒడియా టివిని ఇప్పుడు లితిషా మంగత్ కొత్త ఆలోచనలతో నిర్వహిస్తోంది. లితిషా తండ్రి బైజయంత్ పండా బిజెపి నాయకుడు. రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడు. ఐ.ఐ.ఎం అహ్మదాబాద్‌లో చదువుకున్న లితిషా న్యూయార్క్ ఫిల్మ్ అకాడెమీలో చదువుకుని వచ్చి టివి పగ్గాలు అందుకుంది. ‘ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకోవాలంటే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. లిసా అటువంటి ప్రయత్నమే’ అంటుంది లితిషా. స్త్రీలు వాణిజ్య, వ్యాపార రంగాలలో విశేష ప్రతిభ చూపగలరనీ, వారిని అడ్డుకోకపోతే అంతేచాలని అభిప్రాయపడే లితిషా ఆ మేరకు యువతలో చైతన్యం కోసం ప్రసంగాలు చేస్తూ ఉంటుంది.

బ్యూటిప్

మెరిపించే క్రీమ్



రెండు టేబుల్ స్పూన్ల బియ్యంలో రెండు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్ వేసి రాత్రంతా నానబెట్టుకోవాలి. ఉదయాన్నే రోజ్‌వాటర్‌తోపాటు బియ్యాన్ని మెత్తగా రుబ్బాలి. ఇందులో కుంకుమ పువ్వు రేకులు, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, కాసింత కొబ్బరి నూనె లేదా గ్లిజరిన్ వేసి మిశ్రమం క్రీమ్‌లా మారేంత వరకు కలుపుకుని గాజు సీసాలో వేసి నిల్వచేసుకోవాలి. రోజూ ఉదయం, రాత్రి పడుకునే ముందు ఈ క్రీమ్‌ను ముఖానికి రాసుకుని మర్దన చేయాలి. క్రమం తప్పకుండా వారం రోజుల పాటు ఈ క్రీమ్ రాసుకోవడం వల్ల నల్లమచ్చలు, ట్యాన్ తగ్గి, ముఖ చర్మం కాంతిమంతంగా మారుతుంది.

● పసుపు రైతు ఆవిష్కరణ.. ఎకరానికి రూ.55 వేల నుంచి 30 వేలకు తగ్గిన ఖర్చు.
● టర్మరిక్ ప్లాంటర్ ద్వారా ఇద్దరు కూలీలతో రోజుకు మూడెకరాల్లో విత్తుకోవచ్చు.
● స్వల్పమార్పులతో చేమ, కంద పంటలనూ విత్తుకునే అవకాశం.

సాగుబడి
పునర్వసు కార్తె : జూలై 6 నుంచి

సృజనాత్మకం

పసుపు విత్తే పరికరం

రైతును మించిన శాస్త్రవేత్త లేడంటారు.. కొందరు రైతులను చూసినప్పుడు నిజమే అనిపిస్తుంది. రైతు శాస్త్రవేత్త ఈమని శివరామిరెడ్డి ఇందుకో నిదర్శనం. సాగులో ఏ సమస్య వచ్చినా తగిన పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నించటం ఈ సృజనాత్మక సేంద్రియ రైతు ప్రత్యేకత! ఆయన తయారు చేసుకున్న టర్మరిక్ ప్లాంటర్ పరికరం ద్వారా.. పసుపు విత్తన మోతాదుతో పాటు కూలీల ఖర్చును భారీగా తగ్గించగలిగారు. అంతా కలిపి పసుపు విత్తే దశలో ఎకరానికయ్యే ఖర్చును రూ. 55 వేల నుంచి రూ. 30 వేలకు తగ్గించగలిగారు. పనిలో పనిగా పసుపు నాణ్యతను, దిగుబడిని కూడా పెంచుకుంటున్నారు.





1. శివరామిరెడ్డి తయారు చేసుకున్న పరికరంతో ఎత్తుమడులపై పసుపు విత్తుతున్న దృశ్యం
2, 3. ఎత్తుమడులపై రెండు వరుసల్లో సమదూరంలో పెరుగుతున్న పసుపు, కంద పంటలు
4. పసుపు పంటను తవ్వే ఈ పరికరం కూడా శివరామిరెడ్డి తయారు చేసుకున్నదే

మూడు దశాబ్దాల వ్యవసాయ అనుభవం ఉన్న ఈమని శివరామిరెడ్డి స్వస్థలం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మెల్లెంపూడి గ్రామం. అయిదెకరాల మెట్ట భూమి ఉంది. మరికొంత భూమిని కౌలుకు సాగు చేస్తుంటారు. పసుపు, అరటి, కంద, కాలీఫ్లవర్, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుంటారు. మరో విశేషం ఏమిటంటే, ఆయన వ్యవసాయమంతా సేంద్రియ పద్ధతిలోనే! జీవన ఎరువులను వాడుతున్నారు. పసుపు సాగుకు భారీ పెట్టుబడులు అవసరమనే విషయం తెలిసిందే. విత్తనానికే అధిక మొత్తం వెచ్చించాల్సి ఉంటుంది. దీనికి తోడు కూలీల కొరత సమస్య. సాధారణ పద్ధతిలో ఎకరాలో పసుపు విత్తటానికి హీనపక్షం ఎనిమిది మంది కూలీలు అవసరం. ఎడ్ల నాగలి దున్నే కూలీలు కరువయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో.. విత్తనం నాటేందుకు ఏదైనా పరికరం తయారు చేసుకుంటే ఈ సమస్యలు తగ్గుతాయా? అని ఆయన ఆలోచించి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాల్లో నుంచే టర్మరిక్ ప్లాంటర్ పురుడు పోసుకుంది. సాగులో సమస్యలను అధిగమించేందుకు ఈమని శివరామిరెడ్డి కనుగొన్న అనేక పరికరాల్లో ‘పసుపు నాటే యంత్రం (టర్మరిక్ ప్లాంటర్)’ ఒకటి మాత్రమే.

ఎకరానికి రూ.25 వేలు ఆదా

యూట్యూబ్‌లో బంగాళదుంపల సాగులో వాడే పరికరాన్ని చూసి పసుపు సాగుకు అవసరమైన విధంగా మార్పులు చేసి, తయారు చేయించారు. వెల్డర్‌ను పిలిపించి, అవసరమైన ఇనుమును కొనుగోలు చేసి ఇంటి దగ్గరే దీన్ని చేయించారు. రూ.1.2 లక్షల ఖర్చుతో రూపొందించిన పరికరాన్ని పొలంలో పరీక్షించి చూడగా చక్కటి ఫలితం కనిపించింది. దీన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి, ఇద్దరు మహిళా కూలీలతో ఒక్క రోజులో మూడు ఎకరాల్లో పసుపు విత్తుతున్నారు. సగం విత్తనం కలిస్తోంది. సాధారణ పద్ధతిలో పసుపు విత్తాలంటే ఎకరాకు రూ.55 వేలు ఖర్చవుతుంది. శివరామిరెడ్డి టర్మరిక్ ప్లాంటర్ వాడితే ఆ ఖర్చు రూ.29,800లకు తగ్గుతుంది. తన పొలంలో పసుపు విత్తేందుకు వినియోగించటమే కాకుండా తోటి నలుగురైదుగురు రైతులకు కూడా ఇచ్చి.. తక్కువ ఖర్చుతో పసుపు విత్తుకునేందుకు తోడ్పడుతున్నారు.

ఇద్దరు కూలీలతో మూడెకరాలు..

టర్మరిక్ ప్లాంటర్‌ను ట్రాక్టర్‌కు అనుసంధానించి ఉపయోగిస్తున్నారు. సైకిల్ చైన్ తరహాలో, వీల్ చైన్‌తో ఇది పనిచేస్తుంది. ట్రాక్టర్ నడకకు అనుగుణంగా చైన్ తిరుగుతుంది. పైన ఉండే కంటెయినర్‌లో పసుపు విత్తనం పోస్తారు. అది దిగువకు పడుతుంటే, చెరోవైపున కూర్చొని ఉండే మనుషులు ఆ విత్తనాన్ని.. పైకి కిందకు తిరుగుతుండే గిన్నెల్లో పెడుతుంటారు. ఒక్కో వైపు 17 చొప్పున మొత్తం 34 గిన్నెలుంటాయి. చక్రం తిరుగుతుంటే అవి దిగువకు వెళుతుంటాయి. అక్కడ రెండువైపులా ఉండే గొట్టాలు మట్టిలో నాలుగు అంగుళాల లోతులో బెజ్జం పెడతాయి. గిన్నెలోంచి దిగువకు వచ్చే విత్తనం.. గొట్టంలో నుంచి నేరుగా అదే బెజ్జంలోకి పడిపోతుంది. ఆ తర్వాత అడుగున ఉండే రేకు విత్తనంపై మట్టిని కప్పేస్తుంది.. ఆ విధంగా ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన టర్మరిక్ ప్లాంటర్ సహాయంతో ఎత్తుమడులపై పసుపు విత్తటం అన్నమాట! రెండు విత్తనాల మధ్య ఆరు అంగుళాల దూరం ఉంటుంది. ఎత్తుమడులపై రెండు వరుసల్లో నిర్ణీత దూరంలో క్రమపద్ధతిలో విత్తటం వల్ల గాలి, వెలుతురు ధారాళంగా అందుతుంది. వర్షాలు ఎక్కువ కురిసినా, నీరు నిలబడినా పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

సగానికి తగ్గిన విత్తనం

టర్మరిక్ ప్లాంటర్‌తో ఖర్చు చాలా ఆదా అవుతోంది. ఎద్దు నాగలితో విత్తటానికి ఎకరాకు ఎనిమిది మంది కూలీలు కావాల్సి వుంటుంది. రూ.250 చొప్పున రూ.2 వేలు పెట్టాలి. ఎద్దు నాగలికి మరో రూ.వెయ్యి చెల్లించాలి. ఎకరాకు 1,300 కిలోల విత్తనం వినియోగిస్తుంటారు. ప్రస్తుత ధరల్లో క్వింటా రూ.4 వేలనుకున్నా 13 క్వింటాళ్లకు రూ.52 వేలు అవుతుంది. ట్రాక్టర్‌కు జోడించిన టర్మరిక్ ప్లాంటర్‌తో విత్తితే ఇద్దరు కూలీలు సరిపోతారు. ప్లాంటర్ అద్దె రూ.3,500. ఎకరానికి 650 కిలోల విత్తనం సరిపోతుంది. అంటే, రూ.26 వేలతో అయిపోతుంది. పైగా ఇద్దరు మహిళలతోనే రోజుకు మూడు ఎకరాల్లో విత్తుతున్నారు.

మరికొన్ని పరికరాలు..

పసుపు విత్తడానికి ఉపయోగపడే పరికరంతో మొదలు పెట్టి.. పసుపు పండిన తర్వాత హార్వెస్టింగ్ పరికరాన్ని, పసుపు ఆవిరితో ఉడికించేందుకు మరొక యంత్రాన్ని కూడా శివరామిరెడ్డి తయారు చేసుకున్నారు. గెలలు నరికిన తర్వాత అరటి చెట్లను ముక్కలు చేసి పచ్చిరొట్ట ఎరువుగా మట్టిలో కలిపేసే పరికరాన్ని కూడా తయారు చేసుకోవటం విశేషం

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి


● అరటి పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నే ఈ పరికరం కూడా శివరామిరెడ్డి తయారు చేసుకున్నదే

ఖర్చుతో పాటు తెగుళ్లు తక్కువ.. దిగుబడి ఎక్కువ..



ఎద్దునాగలితో పసుపు విత్తినప్పుడు ఒక చోట వత్తుగా, మరో చోట పలుచగా పడే అవకాశం ఉంది. మేం తయారు చేసుకున్న టర్మరిక్ ప్లాంటర్‌తో విత్తినప్పుడు క్రమపద్ధతిలో సమదూరంలో విత్తనాలు నాటగలుగుతున్నాం. నాణ్యమైన దిగుబడి, అధికంగా వస్తోంది. ఎత్తుమడులపై రెండు వరుసలుగా విత్తటం వల్ల తెగుళ్లకు అవకాశం తక్కువ. చక్రంపై తిరిగే గిన్నెల సైజును మార్చుకుంటూ ఇదే పరికరంతో చేమ, కంద పంటలను విత్తుతున్నాం. ఈ ప్రయోగం విజయవంతం కావటంతో ఆసక్తిచూపిన కొందరు రైతులకు ఇదే పరికరం చేయించి ఇస్తున్నా. మొదటిసారి తయారు చేయడానికి 20 రోజులు పట్టింది. ఖర్చు రూ.1.20 లక్షలైంది. ఇప్పుడు వారం రోజుల్లో రూ.90-95 వేలతోనే అయిపోతోంది. వీటితోపాటు మరికొన్ని పరికరాలను కూడా తయారు చేసుకోవటంతో వ్యవసాయ పనులు సులభంగా మారటం సంతోషంగా ఉంది.

– ఈమని శివరామిరెడ్డి (70134 66716), మెల్లెంపూడి, తాడేపల్లి మం., గుంటూరు జిల్లా.

సరైన ఆదాయ మార్గం సీమ పందుల పెంపకం

తక్కువ కాలంలో మంచి నికరాదాయం పొందాలనుకుంటే సీమ పందుల పెంపకం చేపట్టడం ఒక్కటే మార్గం అంటున్నారు యువ మహిళా రైతు రాచెల్లి అనూష. తెలంగాణ రాష్ట్రం జిల్లా కేంద్రం సిద్దిపేటకు 12 కిలో మీటర్ల దూరంలోని మల్యాలకు చెందిన అనూష సీమ పందులను పెంచుతూ చక్కటి ఆదాయాన్ని గడిస్తున్నారు.

పట్టభద్రురాలైన అనూష తన భర్త మల్లేశం ప్రోత్సాహంతో తన నాలుగు ఎకరాల పొలంలో మూడేళ్ల క్రితం నుంచి స్వయంగా వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో అనేక కష్టనష్టాల పాలయ్యారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, నాటు కోళ్లు, కంజు పిట్టలు, కుందేళ్లు, కొర్రమీను చేపలు.. ఏవి పెంచినా కలిసిరాలేదు. మూడేళ్లు తిప్పలు పడిన తర్వాత వెటర్నరీ కళాశాలకు చెందిన నిపుణులు డా. ప్రసాద్, డా. విద్య సలహా మేరకు సీమ పందుల ఫాంను ఏర్పాటు చేసుకొని చక్కని ఆదాయం పొందుతున్నారు.

పందులు పెంచటం ఏమిటని బంధువులు వారించినా పట్టించుకోకుండా భర్త సహకారంతో 2020 మార్చిలో 14 సీమ పందులను కొని తెచ్చుకొని పెంపకం ప్రారంభించారు. లార్జ్ వైట్ యార్క్ షేర్, ల్యాండ్రెస్, డ్యూరాక్, లార్జ్ బ్లాక్ యార్క్ షేర్ వంటి సంకర జాతి పందులను ఆమె పెంచుతున్నారు. ఫాంలో ఇప్పుడు వాటి సంఖ్య 150కి పెరిగింది. ఫాం సమీపంలోనే ఇంటిని నిర్మించుకొని నిరంతరం తానే స్వయంగా అన్ని పనులూ చేసుకోవటం ద్వారా అనూష చక్కటి ఫలితాలు పొందుతున్నారు.


● గడ్డి వేస్తున్న అనూష

మార్కెటింగ్ సమస్య లేదని అంటూ.. కర్ణాటక, అస్సాం తదితర రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు వచ్చి సీమ పందులను కొనుక్కెళ్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక జిల్లాల నుంచి రైతులు వచ్చి ఫాంను చూసి, పిల్లలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారన్నారు. వారానికో రోజు పంది మాంసాన్ని కిలో రూ. 280 చొప్పున ఫాం దగ్గరే విక్రయిస్తున్నారు.

75 రోజుల్లో 20 కేజీలు

కోతకు అమ్మే పందులను, బ్రీడింగ్ కోసం అమ్మే పందులను ప్రత్యేక షెడ్లు వేసి వేర్వేరుగా పెంచుతున్నారు. పంది పిల్ల 75 రోజుల్లో 20 కేజీల బరువు పెరుగుతుందని అనూష వివరించారు. బ్రీడింగ్ కోసం 20 కేజీల బరువు పెరిగిన తర్వాత విక్రయిస్తున్నారు. మాంసం కోసం కోతకైతే సుమారుగా 80 కిలోలకు పైగా బరువు పెరిగిన తర్వాత విక్రయిస్తున్నారు. బ్రీడింగ్ పందులకు గడ్డితో పాటు రెండు పూటలా దాణా పెడుతున్నారు. కోతకు వెళ్లే పందులకు హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని కూడా మేపుతున్నారు. పశు వైద్యుడు డా. అభిలాష్ సూచనల మేరకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. అనేక వ్యాక్సిన్లతో పాటు, ఇతర ఇంజక్షన్లను క్రమం తప్పకుండా ఇస్తూ నాణ్యమైన మేతను అందిస్తే సీమపందుల పెంపకం సులభమేనని అంటారు అనూష భర్త మల్లేశం (97044 99873).

మార్కెటింగ్ సమస్య లేదు!



సీమ పందులకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. పోటీ తక్కువ. శ్రమ తక్కువ. ఆదాయం ఎక్కువ. మార్కెటింగ్ సమస్య లేదు. ఒక ఎకరం భూమి సాగు చేస్తే ఎంత ఆదాయం వస్తుందో రెండు పందులను పెంచితే అంతే ఆదాయం వస్తుంది. దాణా, గడ్డి రోజుకు రెండు సార్లు వేయాలి. ఎప్పుడైనా వీలుకాకపోతే సాయంత్రం వేయకపోయినా పర్వాలేదు. 200 పందులను ఒక్కరే చూసుకోవచ్చు. పందులను సాదుకుంటూ వ్యవసాయం కూడా చేసుకోవచ్చు.

– రాచెల్లి అనూష, యువ రైతు

– గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి, సిద్దిపేట ; ఫోటోలు: కె. సతీష్ కుమార్



హైదరాబాద్ ఎఫ్‌సీకి విఘ్నేశ్ బదిలీ

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) మాజీ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తరఫున ఆడేందుకు డిఫెండర్ విఘ్నేశ్ దక్షిణామూర్తి ఒప్పందం కుదుర్చుకున్నాడు. మైసూర్‌కు చెందిన ఈ 25 ఏళ్ల డిఫెండర్ ముంబై సిటీ ఎఫ్‌సీ నుంచి బదిలీ అయ్యాడు. అయితే ఎంత మొత్తానికి బదిలీ అయ్యాడో ఆ రెండు ఫ్రాంచైజీలు వెల్లడించలేదు. 2020-21 సీజన్‌లో ముంబై ఐఎస్ఎల్ ట్రోఫీ సాధించడంలో విఘ్నేశ్ తన వంతు పాత్ర పోషించాడు. 2018లో 'శాఫ్' చాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచిన జట్టులోనూ విఘ్నేశ్ సభ్యుడుగా ఉన్నాడు.

భారత్, బంగ్లాదేశ్ మహిళల రెండో టి20 నేడు

మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను గెలుచుకోవాలనే లక్ష్యంతో బంగ్లాదేశ్‌తో నేడు మిర్పుర్‌లో జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది. బంగ్లా మహిళల జట్టు కంటే భారత జట్టే అన్ని రంగాల్లో పటిష్టంగా ఉంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో, వెబ్‌సైట్‌లో తిలకించవచ్చు.



పార్థ్ సాలుంకే 'స్వర్ణ' చరిత్ర

ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్



లిమెరిక్ (ఐర్లాండ్): భారత ఆర్చరీ ప్లేయర్ పార్థ్ సాలుంకే ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో పసిడి చరిత్ర లిఖించాడు. ఈ టోర్నమెంట్‌లో అతను పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచాడు. మొత్తంమీద ఈ పోటీల్లో భారత బృందం మునుపెన్నడు లేని విధంగా ఈ టోర్నీలోనే అత్యధికంగా 11 పతకాలు సాధించిన జట్టుగా నిలిచింది. అండర్-21 పురుషుల వ్యక్తిగత రికర్వ్ కేటగిరీలో మహారాష్ట్రకు చెందిన 19 ఏళ్ల సాలుంకే... ఆర్చరీలో ఘనాపాటిలైన కొరియన్‌ను కంగుతినిపించాడు. ఫైనల్లో పార్థ్ 7-3తో ఏడో సీడ్ సంగ్ ఇంజున్‌ను ఓడించాడు. ప్రత్యేకించి పురుషుల రికర్వ్‌లో బంగారు పతకం సాధించిన తొలి ఆర్చర్‌గా పార్థ్ సాలుంకే ఘనత వహించాడు. మహిళల రికర్వ్‌లో ఇదివరకే దీపిక కుమారి (2009, 2011), కొమలిక బారి (2019, 2021) బంగారు పతకాలు సాధించారు. మహిళల అండర్-21 వ్యక్తిగత రికర్వ్ కేటగిరీలో భారత్ ఖాతాలో కాంస్యం చేరింది. భజన్ కౌర్ 7-1తో చైనీస్ తైపీకి చెందిన సు సిన్ యూపై నెగ్గింది.

జొకోవిచ్‌దే పైచేయి

- 14వసారి క్వార్టర్ ఫైనల్లోకి డిఫెండింగ్ చాంపియన్
- నాలుగు సెట్‌ల పోరులో హుర్కాజ్‌పై నెగ్గిన సెర్బియా స్టార్
- ఐదో సీడ్ సిట్సిపాస్‌కు చుక్కెదురు



జొకోవిచ్

లండన్: కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించే దిశగా సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఈ సెర్బియా స్టార్ 14వసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి మూడు రౌండ్ మ్యాచ్‌ల్లో రెండున్నర గంటల్లోపే విజయాన్ని అందుకున్న జొకోవిచ్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్లో మాత్రం అంత సులువుగా గెలుపు దక్కలేదు. 2021 సెమీఫైనలిస్ట్, ప్రపంచ 18వ ర్యాంకర్ హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)తో జరిగిన మ్యాచ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 7-6 (8/6), 7-6 (8/6), 5-7, 6-4తో నెగ్గి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. 3 గంటల 7 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 18 ఏస్‌లు సంధించగా, హుర్కాజ్ 33 ఏస్‌లతో అదరగొట్టాడు. తొలి సెట్‌లో జొకోవిచ్ మూడుసార్లు సెట్ పాయింట్లను, రెండో సెట్‌లో రెండుసార్లు సెట్ పాయింట్లను కాపాడుకోవడం గమనార్హం. ఈ మ్యాచ్ ఆదివారం, సోమవారం రెండు రోజులపాటు జరిగింది. టోర్నీ నిబంధనల ప్రకారం రాత్రి 11 గంటల వరకే ఆటను కొనసాగించాలి. ఆదివారం రెండు సెట్‌లు ముగిసిన తర్వాత మ్యాచ్‌ను సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం ఆటను కొనసాగించగా... మూడో సెట్‌ను హుర్కాజ్ గెల్చుకున్నాడు. అయితే నాలుగో సెట్‌లో జొకోవిచ్ తన అనుభవాన్నంతా రంగరించి పోరాడాడు. ఏడో గేమ్‌లో హుర్కాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఎనిమిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకొని 5-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అనంతరం పదో గేమ్‌లో జొకోవిచ్ తన సర్వీస్‌ను కాపాడుకొని సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. వింబుల్డన్ టోర్నీ చరిత్రలో జొకోవిచ్‌కిది 90వ విజయం కావడం విశేషం.

మరోవైపు ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) కథ ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అమెరికా ప్లేయర్ క్రిస్టోఫర్ యుబ్యాంక్స్ 3-6, 7-6 (7/4), 3-6, 6-4, 6-4తో సిట్సిపాస్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరాడు. జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-4, 6-2తో తొలి రెండు సెట్‌లు గెల్చుకున్నాడు. అనంతరం లెహెస్కా గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలడంతో మెద్వెదెవ్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కింది.

మూడో రౌండ్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆ్రస్టేలియా) ద్వయం 7-5, 6-3తో జేకబ్ ఫియరెన్లీ-జోనస్ మండే (బ్రిటన్) జోడీపై నెగ్గి మూడో రౌండ్‌కు చేరుకుంది.

ఓటమి అంచుల నుంచి...



మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఓటమి అంచుల నుంచి గట్టెక్కి తొలిసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరింది. 14వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6-7 (4/7), 7-6 (7/2), 6-3తో గెలిచింది. రెండో సెట్‌లో స్కోరు 5-6 వద్ద స్వియాటెక్ తన సర్వీస్‌లో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని స్కోరును 6-6తో సమం చేసింది. టైబ్రేక్‌లో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచిన ఆమె మూడో సెట్‌లోని నాలుగో గేమ్‌లో బెన్‌చిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని గెలిచింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో స్వితోలినా (ఉక్రెయిన్) 2-6, 6-4, 7-6 (11/9)తో మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్)పై, రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6-4, 6-0తో ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై, ఆరో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-0, 6-3తో రెండుసార్లు చాంపియన్ క్విటోవా (చెక్ రిపబ్లిక్)పై, మాడిసన్ కీస్ 3-6, 7-6 (7/4), 6-2తో మిరా ఆంద్రీవా (రష్యా)పై గెలిచారు. డిఫెండింగ్ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్) తొలి సెట్‌లో 4-1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ఆమె ప్రత్యర్థి బీట్రిజ్ హదద్ మయా (బ్రెజిల్) గాయం కారణంగా వైదొలిగింది.

లక్ష్య సేన్ అదరహో...

కెనడా ఓపెన్ టైటిల్ సొంతం ● ఫైనల్లో ప్రపంచ పదో ర్యాంకర్‌పై గెలుపు



కాల్గరీ: ఏడాదిన్నర తర్వాత భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ మరో అంతర్జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో లక్ష్య సేన్ చాంపియన్‌గా అవతరించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-18, 22-20తో ప్రపంచ పదో ర్యాంకర్, ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ షి ఫెంగ్ లీ (చైనా)పై గెలుపొందాడు. గత ఏడాది జనవరిలో ఇండియా ఓపెన్ టైటిల్ సాధించాక లక్ష్య సేన్ నెగ్గిన మరో అంతర్జాతీయ టైటిల్ ఇదే కావడం విశేషం. టైటిల్ నెగ్గిన లక్ష్య సేన్‌కు 31,500 డాలర్ల (రూ. 25 లక్షల 99 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. గత ఏడాది ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో వ్యక్తిగత స్వర్ణ పతకం గెలిచిన లక్ష్య సేన్ ఈ సంవత్సరం తాను పాల్గొన్న 12వ టోర్నీలో తొలిసారి విజేతగా నిలిచాడు. షి ఫెంగ్ లీపై గతంలో నాలుగుసార్లు నెగ్గిన లక్ష్య సేన్‌కు ఈసారి గట్టిపోటీనే ఎదురైంది. 50 నిమిషాలపాటు సాగిన ఈ పోరులో లక్ష్య సేన్ కీలకదశలో విజృంభించి పాయింట్లు గెలిచాడు. తొలి గేమ్‌లో స్కోరు 15-15తో సమంగా ఉన్నపుడు లక్ష్య సేన్ వరుసగా మూడు పాయింట్లు గెలిచి 18-15తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో స్కోరు 5-6 వద్ద ఉన్నపుడు షి ఫెంగ్ లీ వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 11-6తో ముందంజ వేశాడు.

అనంతరం ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ షి ఫెంగ్ లీ 20-16తో నాలుగు గేమ్ పాయింట్లు సంపాదించాడు. అయితే లక్ష్య సేన్ దూకుడుగా ఆడి ఊహించనిరీతిలో వరుసగా ఆరు పాయింట్లు గెలిచాడు. తద్వారా రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. 'ఒలింపిక్ అర్హత సంవత్సరం కావడం, దానికితోడు అన్నీ నాకు ప్రతికూల ఫలితాలు వస్తున్న సమయంలో ఈ విజయం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ఈ టోర్నీ కొనసాగినకొద్దీ నా ఆటతీరు మెరుగైంది. ఫైనల్లో రెండో గేమ్‌లో వెనుకబడిన దశలో సంయమనం కోల్పోకుండా ఆడాలని నిర్ణయించుకున్నాను. ఇది ఫలితాన్నిచ్చింది' అని ఉత్తరాఖండ్‌కు చెందిన 21 ఏళ్ల లక్ష్య సేన్ వ్యాఖ్యానించాడు.

4 ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్‌లో లక్ష్య సేన్ నెగ్గిన టైటిల్స్. గతంలో అతను డచ్ ఓపెన్ (2019), సార్లార్‌లక్స్ ఓపెన్ (2019), ఇండియా ఓపెన్ (2022)లలో విజేతగా నిలిచాడు.

2 ఈ ఏడాది బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో టైటిల్ గెలిచిన రెండో భారతీయ ప్లేయర్ లక్ష్య సేన్. హెచ్ఎస్ ప్రణయ్ మలేసియా మాస్టర్స్ టోర్నీలో టైటిల్ గెలిచాడు.

గుకేశ్‌కు ఐదో స్థానం



జాగ్రెబ్ (క్రొయేషియా): సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఐదో స్థానంలో నిలిచాడు. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సంయుక్తంగా ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లో విశ్వనాథన్ ఆనంద్‌పై గుకేశ్ గెలుపొందడం విశేషం. ఓవరాల్‌గా ర్యాపిడ్, బ్లిట్జ్ రెండు ఫార్మాట్‌లలో కలిపి తమిళనాడుకు చెందిన గుకేశ్ 19.5 పాయింట్లు సాధించాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు బరిలోకి దిగిన ఈ టోర్నీలో ఆనంద్ 16.5 పాయింట్లు సంపాదించాడు. 26 పాయింట్లతో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) విజేతగా నిలిచాడు.

భారత వాలీబాల్ జట్టుకు నిరాశ



మనామా (బహ్రెయిన్): ప్రపంచ అండర్-21 పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు నిరాశ ఎదురైంది. గ్రూప్ లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారత జట్టు పరాజయం చవిచూసింది. తద్వారా నాకౌట్ దశకు అర్హత సాధించలేకపోయింది. పూల్ 'సి'లో ఉన్న భారత జట్టు తొలి మ్యాచ్‌లో 17-25, 14-25, 25-20, 19-25తో పోలాండ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో 19-25, 25-22, 27-29, 13-25తో బల్గేరియా చేతిలో... మూడో మ్యాచ్‌లో 25-18, 27-29, 20-25, 22-25తో కెనడా చేతిలో ఓడిపోయింది. పదేళ్ల తర్వాత మళ్లీ ఈ మెగా ఈవెంట్‌కు అర్హత సాధించిన భారత జట్టు తదుపరి 9 నుంచి 16 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడుతుంది.

సినిమా

లేడీ లక్...



● నవీన్ పొలిశెట్టి, అనుష్క

నవీన్ పొలిశెట్టి, అనుష్కా శెట్టి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ సినిమా ఆగస్ట్ 4న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. రథన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'లేడీ లక్..' అంటూ సాగే వీడియో సాంగ్‌ని సోమవారం రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను కార్తీక్ పాడారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. చెఫ్ అన్విత రవళిగా అనుష్క, స్టాండప్ కమెడియన్ సిద్ధుగా నవీన్ పాత్రలు మనసులను హత్తుకునేలా ఉంటాయి. 'లేడీ లక్..' సాంగ్‌లో నవీన్ ఎనర్జీ, అనుష్క చార్మింగ్ లుక్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నీరవ్ షా.

ఐదు భాషల్లో డబుల్ ఇస్మార్ట్



● చార్మి, రామ్, పూరి జగన్నాథ్

హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో 'డబుల్ ఇస్మార్ట్' సినిమా షురూ అయింది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, చార్మి నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం ప్రారంభమైంది. 'ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్' అంటూ రామ్ డైలాగ్ చెప్పిన తొలి సీన్‌కి చార్మి క్లాప్ ఇవ్వగా, పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ''ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి జగన్నాథ్ చాలా పెద్ద స్పాన్ ఉన్న కథ రాశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందనుంది. 'ఇస్మార్ట్ శంకర్' కంటే ఈ సినిమాలో రామ్‌ని మాసియర్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పూరి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 2024 మార్చి 8న 'డబుల్ ఇస్మార్ట్'ని రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి.


ఆర్ఆర్ఆర్‌కు సీక్వెల్ ఉంది.. కానీ...



● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి విజయేంద్రప్రసాద్ కథ అందించారు. 'ఆర్ఆర్ఆర్'కు సీక్వెల్ చేసే చాన్స్ ఉందని విజయేంద్రప్రసాద్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన మరోసారి స్పందించారు. ''ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా 'ఆర్ఆర్ఆర్' సీక్వెల్‌ను హాలీవుడ్ ఫిల్మ్ రేంజ్‌లో చేసే ఆలోచన ఉంది. ఈ సీక్వెల్‌కు రాజమౌళి దర్శకత్వం వహించవచ్చు లేదా ఆయన పర్యవేక్షణలో ఎవరైనా హాలీవుడ్ డైరెక్టర్ తెరకెక్కించవచ్చు'' అని పేర్కొన్నారు విజయేంద్రప్రసాద్. ఇక రాజమౌళి ప్రస్తుత సినిమాలో మహేశ్‌బాబు హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం తర్వాత మహాభారతం నేపథ్యంలో రాజమౌళి సినిమా చేసే అవకాశం ఉందన్నట్లుగా విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

ఎవర్నీ కాను..



● షారుక్ ఖాన్

''ఎవరు నేను.. ఎవర్నీ కాను.. తెలియదు. తల్లికి ఇచ్చిన మాట కావొచ్చు. నేరవేరని లక్ష్యం కావొచ్చు. నేను మంచివాణ్ణా? చెడ్డవాణ్ణా.. పుణ్యాత్ముణ్ణా.. పాపాత్ముణ్ణా.. నీకు నువ్వే తెలుసుకో...'' అని షారుక్ ఖాన్ చెప్పే డైలాగ్స్‌తో విడుదలైంది 'జవాన్' ప్రివ్యూ వీడియో. షారుక్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం 'జవాన్'. నయనతార, విజయ్ సేతుపతి, ప్రియమణి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాలో దీపికా పదుకోన్ ఓ స్పెషల్ గెస్ట్ రోల్ చేశారు. ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబరు 7న రిలీజ్ కానుంది.

అందుకే మళ్లీ విడుదల చేస్తున్నాను - ఆర్. నారాయణమూర్తి



● ఆర్. నారాయణమూర్తి

''విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, కష్టాలు, వారి తల్లిదండ్రుల కన్నీళ్లను 'యూనివర్సిటీ'లో చూపించాను. వేసవి, వడగాల్పుల వల్ల ఈ చిత్రాన్ని ప్రేక్షకులు సరిగ్గా చూడలేకపోయారు.. అందుకే మళ్లీ విడుదల చేస్తే జనాలకు బాగా చేరువ అవుతుందని రిలీజ్ చేస్తున్నాను'' అని ఆర్. నారాయణమూర్తి అన్నారు. ఆర్. నారాయణమూర్తి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యూనివర్సిటీ' జూన్ 9న విడుదలైంది. ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ''పదో తరగతి పేపరు లీకేజీలు, గ్రూప్ 1, 2లాంటి ఉద్యోగ పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీలు జరుగుతుంటే విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ ఏం కావాలి? అనే సందేశంతో ఈ సినిమా తీశాను. విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాను'' అన్నారు.

ఫన్.. థ్రిల్



● శివాని, శ్రీ కమల్

''నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు' చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన యూత్‌ఫుల్ ఫన్ అండ్ థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్ 'జిలేబి'. విజయభాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ హీరోయిన్‌గా నటించగా, రాజేంద్రప్రసాద్ ఓ కీలక పాత్ర పోషించారు. అంజు అశ్రాని సమర్పణలో గుంటూరు రామకృష్ణ నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 21న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

ట్రైలర్ బాగుంది - సత్యదేవ్

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ నెల 21న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను లాంచ్ చేసిన హీరో సత్యదేవ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కాన్సెప్ట్ నాకు ముందే తెలుసు. కానీ ఇంత ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందనుకోలేదు. ట్రైలర్ బాగుంది. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమాలో నా పాత్ర మాసీగా ఉంటుంది'' అన్నారు సంజయ్ రావు. ''నా కొడుకు సంజయ్ హీరోగా ఎదిగినందుకు హ్యాపీ. సినిమాల ఎంపికలో తనకి సలహాలివ్వను'' అన్నారు బ్రహ్మాజీ. ''మనుషులకంటే జంతువులే విధేయంగా ఉంటాయి. ఐశ్వర్యా రాయ్ చెట్టుని పెళ్లి చేసుకుంది. ఈ రెండు పాయింట్లను అల్లుకుని ఈ సినిమా కథ రాశా. ఈ చిత్రంలో అడల్ట్ కంటెంట్ లేదు. డాగ్‌కు మేల్ వాయిస్ పెట్టాం. అందులో ఓ ట్విస్ట్ ఉంది. థియేటర్స్‌లో చూడండి'' అన్నారు శ్రీధర్. ''ఓ కొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అప్పిరెడ్డి.



● సంజయ్ రావు, ప్రణవి, సత్యదేవ్

ఈ సినిమా నాకు ప్లస్ - విరాజ్ అశ్విన్



''అనగనగా ఓ ప్రేమకథ' (2018)తో హీరోగా పరిచయం అయ్యాను. కానీ నా కెరీర్‌కు సరైన థియేట్రికల్ రిలీజ్ హిట్ ఫిల్మ్ లేదు. 'థ్యాంక్యూ బ్రదర్'కు మంచి స్పందన వచ్చినప్పటికీ ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజైంది. 'బేబీ' హిట్ అయి, నా కెరీర్‌కు ప్లస్ అవుతుందని నమ్ముతున్నా'' అన్నారు విరాజ్ అశ్విన్. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయిరాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో విరాజ్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ విరాజ్ పాత్ర చేశాను. 'బేబీ' ట్రయాంగిల్ స్టోరీలా అనిపించినా కథనం, క్లయిమాక్స్ కొత్తగా ఉంటాయి. ఈ కథ ఓ అమ్మాయి చుట్టూ తిరుగుతుంది. స్కూల్ డేస్‌లో ఆనంద్‌ను ప్రేమించిన అదే అమ్మాయితో ఆమె కాలేజీ డేస్‌లో నేను లవ్‌లో పడతాను. ఈ చిత్రం 'ప్రేమదేశం', 'ప్రేమిస్తే' తరహాలో ఉంటుందని కొందరు ఊహిస్తున్నారు. కానీ ఫ్రెష్ అప్రోచ్ ఉన్న లవ్‌స్టోరీ 'బేబీ'. ఎడిటర్ మార్తాండ్ కె. వెంకటేష్ గారు నాకు మామయ్య. ఇండస్ట్రీలో చాలా అనుభవం ఉన్న ఆయన 'బేబీ' ట్రైలర్ చూసి, సినిమా హిట్ అవుతుందని చెప్పారు. ప్రస్తుతం 'మరీచిక' అనే మూవీ చేస్తున్నాను'' అన్నారు.

ప్రేమ.. సస్పెన్స్...



● దుషారా విజయన్, అర్జున్ దాస్

''సున్నితమైన అంశాలను వసంత బాలన్ చక్కగా తెరపై చూపిస్తుంటారు. ఒకవైపు లవ్, మరోవైపు సస్పెన్స్... రెండింటికీ సమ న్యాయం చేస్తూ 'బ్లడ్ అండ్ చాక్లెట్'ని తీశారు. ఈ చిత్రం నాకు చాలా బాగా నచ్చింది'' అని డైరెక్టర్ శంకర్ అన్నారు. అర్జున్ దాస్, దుషారా విజయన్ జంటగా నటించిన చిత్రం 'బ్లడ్ అండ్ చాక్లెట్'. వసంత బాలన్ దర్శకత్వంలో ఎస్ పిక్చర్స్ పతాకంపై ప్రముఖ దర్శకుడు శంకర్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 21న విడుదల కానుంది. ఈ మూవీని తెలుగులో ఎస్ఆర్‌డీఎస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. జీవీ ప్రకాష్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను డైరెక్టర్ శంకర్ విడుదల చేశారు. ''జీవీ ప్రకాష్ నాలుగు అద్భుతమైన పాటలు అందించారు. నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలుస్తుంది'' అన్నారు వసంత బాలన్ .

మిషన్ ఏంటి?



● హేలీ అట్వెల్, టామ్ క్రూజ్

టామ్ క్రూజ్ నటించిన చిత్రం 'మిషన్: ఇంపాజిబుల్–డెడ్ రికనింగ్ పార్ట్ వన్'. క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో రేపు(బుధవారం) విడుదలవుతోంది. ''మిషన్: ఇంపాజిబుల్–ఫాల్ అవుట్ (2018)కి సీక్వెల్, 7వ విడత 'మిషన్: ఇంపాజిబుల్' ఫిల్మ్ సిరీస్‌గా రూపొందిన చిత్రం 'మిషన్: ఇంపాజిబుల్–డెడ్ రికనింగ్ పార్ట్ వన్'. ఏతాన్ హంట్ (టామ్ క్రూజ్), అతని ఐఎమ్ఎఫ్ (ఇంపాజిబుల్ మిషన్ ఫోర్స్) బృందం ఓ ప్రమాదకరమైన మిషన్‌ను ప్రారంభిస్తారు. ఆ మిషన్ ఏంటి? టామ్ క్రూజ్ ఇప్పటివరకూ చేయని, ఈ మూవీలో చేసిన ప్రమాదకరమైన స్టంట్ ఏంటి? అనేది సినిమాలో చూడాల్సిందే'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	64	65,344
నిఫ్టీ ▲	24	19,356

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,654	▽	7
డోజోన్స్	33,896	▲	161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,274	▲	17
డాక్స్	15,673	▲	70
షాంఘై	3,204	▲	7
నికాయ్	32,190	▽	199

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,656
బంగారం (99.5 స్వచ్ఛత)	50,421
వెండి (కిలో)	70,631

హ్యుందాయ్ ఎక్స్‌టర్ వచ్చేసింది

ధర రూ.5.99 లక్షల నుంచి • మైలేజీ 19.4 కిలోమీటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.5.99 లక్షల నుంచి మొదలుకుని రూ.9.31 లక్షల వరకు ఉంది. టాటా మోటార్స్ పంచ్ కారుకు ఇది పోటీనివ్వనుంది. మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లతో 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. మైలేజీ లీటరుకు 5–స్పీడ్ మాన్యువల్ ట్రిమ్ 19.4 కిలోమీటర్లు, 5–స్పీడ్ ఆటోమేటిక్ ట్రిమ్ 19.2 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది. సీఎన్‌జీ ట్రిమ్ కేజీకి 27.1 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది. ఈ వేరియంట్ ధర రూ.8.23 లక్షలు ఉంది.

కారు హంగులు..

ఫుట్‌వెల్ లైటింగ్, వాయిస్ ఆధారిత స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, వెహికిల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్, డ్యూయల్ కెమెరాతో డ్యాష్‌క్యామ్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, పార్కింగ్ అసిస్ట్, ఇన్‌సైడ్ రేర్ వ్యూ మిర్రర్, హెడ్‌ల్యాంప్ ఎస్కార్ట్ సిస్టమ్, రేర్ డీఫాగర్, ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, సెంట్రల్ లాకింగ్, వంటి హంగులు ఉన్నాయి. 391 లీటర్ల బూట్ స్పేస్, గ్రౌండ్ క్లియరెన్స్ 185 ఎంఎం ఉంది.

వ్యయం రూ.950 కోట్లు..

ఎక్స్‌టర్ రాకతో దేశంలో పూర్తి శ్రేణి ఎస్‌యూవీ తయారీ సంస్థగా నిలిచామని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ ఈ సందర్భంగా తెలిపారు. 'ఈ మోడల్ అభివృద్ధికి రూ.950 కోట్లు ఖర్చు చేశాం. భారత్‌లో వచ్చే 10 ఏళ్లలో తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటాం' అని కూడా ఆయన తెలిపారు.

విక్రయాలు మెరుగ్గా..

హ్యుందాయ్ ఖాతాలో ఎక్స్‌టర్ ఎనిమిదవ ఎస్‌యూవీ కావడం విశేషం. ఆరు ఎస్‌యూవీ ఉప విభాగాల్లో మోడళ్లను ఆఫర్ చేస్తున్న ఏకైక కంపెనీ తామేనని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీవోవో తరుణ్ గర్గ్ తెలిపారు. ఎక్స్‌టర్ చేరికతో ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అమ్మకాలు నెలకు 20–22 వేల యూనిట్లు ఉంటాయన్నారు. జనవరి–జూన్ కాలంలో 10.5% వృద్ధితో 2.96 లక్షల యూనిట్ల అమ్మకాలు సాధించామన్నారు.



ఎక్స్‌టర్‌తో ఉన్సూ కిమ్, తరుణ్ గర్గ్ (కుడి)

మార్కెట్లకు ఆర్‌ఐఎల్ దన్ను

- 64 పాయింట్లు ప్లస్‌తో 65,344కు సెన్సెక్స్
- 24 పాయింట్లు పెరిగి 19,356కు చేరిన నిఫ్టీ

ఆటుపోట్ల మధ్య లాభాలు

ముంబై: స్వల్ప ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు అంతంత మాత్రంగా బలపడ్డాయి. సెన్సెక్స్ 64 పాయింట్లు పుంజుకుని 65,344 వద్ద నిలవగా.. నిఫ్టీ 24 పాయింట్ల లాభంతో 19,356 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 353 పాయింట్లు ఎగసి 65,633 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం ఒక దశలో 19,436కు చేరినప్పటికీ 19,327 వద్ద ఇంట్రాడే కనిష్టాన్నీ చవిచూసింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్ల పెంపు సంకేతాలు ఇవ్వడంతో వారాంతాన పతనమైన మార్కెట్లు కోలుకున్నాయి. ఇండెక్స్ హెవీవెయిట్ ఆర్‌ఐఎల్ మార్కెట్లకు అండగా నిలవగా.. ఐటీ కౌంటర్లు మందగించాయి.

మెటల్, ఆయిల్ అప్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్ ఇండెక్స్ 1.7 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 0.6 శాతం చొప్పున బలపడ్డాయి. ఐటీ, కన్సూ్యమర్ డ్యురబుల్స్, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఆటో 1.2–0.6 శాతం మధ్య డీలాపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఆర్‌ఐఎల్ దాదాపు 4 శాతం జంప్‌చేయగా.. టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఆటో, అదానీ ఎంటర్‌ప్రైజెస్, సన్ ఫార్మా, హిందాల్కో 3.3–1.3 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, పవర్‌గ్రిడ్, టీసీఎస్,



హెచ్‌యూఎల్, నెస్లే, విప్రో, బీపీసీఎల్, యాక్సిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ 3–1 శాతం మధ్య నీరసించాయి.

చిన్న షేర్లు వీక్

మార్కెట్లు పుంజుకున్నప్పటికీ బీఎస్‌ఈలో స్మాల్, మిడ్‌క్యాప్స్ 0.5–0.25 శాతం మధ్య వెనకడుగు వేశాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2,299 నష్టపోగా.. 1,393 మాత్రమే లాభపడ్డాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.8 శాతం నీరసించి 77.84 డాలర్లకు చేరగా.. డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా బలపడి 82.58 వద్ద నిలిచింది. నగదు విభాగంలో వారాంతాన రూ. 790 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు తాజాగా మరో రూ. 588 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. డీఐఐలు సైతం రూ. 288 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

వేదాంత చిప్ ప్లాంటుకు బ్రేక్

- జేవీ నుంచి తప్పుకున్న ఫాక్స్‌కాన్
- వేరే సంస్థలతో జట్టు కట్టనున్న వేదాంత

న్యూఢిల్లీ: భారత్‌లో సెమీకండక్టర్ల ప్లాంటు నెలకొల్పేందుకు దేశీ దిగ్గజం వేదాంతతో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ (జేవీ) నుంచి హోన్ హయ్ టెక్నాలజీ గ్రూప్ (ఫాక్స్‌కాన్) తప్పుకుంది. మరిన్ని వైవిధ్యమైన అవకాశాలను అన్వేషించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. 'పరస్పర అంగీకారం మేరకు, వేదాంతతో జాయింట్ వెంచర్ విషయంలో ముందుకు సాగ



రాదని నిర్ణయించుకున్నాం. వేదాంత యాజమాన్యంలోని సంస్థకు మాకు ఎటువంటి సంబంధం ఉండదు. మా పేరును జోడించి ఉంచడం వల్ల గందరగోళానికి దారి తీస్తుంది కాబట్టి దాన్ని తొలగించుకునే ప్రయత్నాల్లో ఉన్నాం' అని ఫాక్స్‌కాన్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, భారత ప్రభుత్వ మేకిన్ ఇండియా ఆకాంక్షల సాకారానికి పూర్తి తోడ్పాటు అందిస్తామని, స్థానిక అవసరాల మేరకు భాగస్వామ్యాలు కుదుర్చుకుంటామని పేర్కొంది.

తైవాన్‌కు చెందిన కాంట్రాక్ట్ ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్, వేదాంత .. గుజరాత్‌లో దాదాపు రూ. 1.5 లక్షల కోట్ల పెట్టుబడితో దేశీయంగా తొలి సెమీకండక్టర్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు గతేడాది జేవీ కుదుర్చుకున్నాయి. ఏడాది పైగా దీనిపై కసరత్తు చేశాయి. సాంకేతిక భాగస్వామిగా యూరప్ సంస్థ ఎస్‌టీ మైక్రోఎలక్ట్రానిక్స్‌తో జట్టు కట్టేందుకు ప్రయత్నించినా చర్చలు ముందుకు సాగలేదు. దీంతో ప్రస్తుతం వేదాంత–ఫాక్స్‌కాన్ జేవీకి బ్రేక్ పడింది. ఫోన్లు, ఫ్రిజ్‌లు, కార్లలో ఉపయోగించే చిప్‌లు కేవలం కొన్ని దేశాల్లోనే తయారవుతున్నాయి. భారత్ కూడా చిప్‌ల తయారీలోకి ప్రవేశించడంపై దృష్టి పెట్టి ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీనికి స్పందనగా వేదాంత–ఫాక్స్‌కాన్, ఐఎస్‌ఎంసీ, ఐజీఎస్‌ఎస్ దరఖాస్తు చేసుకున్నాయి. అయితే, వేదాంత జేవీ మినహా మిగతా రెండింటి విషయంలో పెద్దగా పురోగతి లేదు.

ప్రాజెక్టుకు కట్టుబడి ఉన్నాం..

కాగా సెమీకండక్టర్ ప్రాజెక్టుకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని వేదాంత స్పష్టం చేసింది. చిప్ ప్లాంటు ఏర్పాటులో భాగస్వాములయ్యేందుకు పలు సంస్థలు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది. 'సెమీకండక్టర్ల విషయంలో ప్రధాని విజన్‌ను సాకారం చేసేందుకు, మరింతగా కృషి చేస్తాం' అని వేదాంత పేర్కొంది.



భారత్ లక్ష్యాలపై ప్రభావం ఉండదు

వేదాంతతో జేవీ నుంచి ఫాక్స్‌కాన్ వైదొలగడమనేది భారత్ నిర్దేశించుకున్న చిప్ ఫ్యాబ్రికేషన్ ప్లాంటు ఏర్పాటు లక్ష్యాలపై ప్రభావం చూపబోదు.

– రాజీవ్ చంద్రశేఖర్, కేంద్ర ఐటీ మంత్రి



సైయంట్ డీఎల్‌ఎం లిస్టింగ్ భళా

ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసుల కంపెనీ సైయంట్ డీఎల్‌ఎం భారీ లాభాలతో లిస్టయ్యింది. ఇష్యూ ధర రూ. 265తో పోలిస్తే బీఎస్‌ఈలో 51 శాతం ప్రీమియంతో రూ. 401 వద్ద లిస్టయ్యింది. ఆపై ఒక దశలో 61% దూసుకెళ్లి రూ. 426ను అధిగమించింది. చివరికి 59 శాతం(రూ. 156) లాభంతో రూ. 421 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో సైతం రూ. 403 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి రూ. 427 వరకూ ఎగసి చివరికి రూ. 422 వద్ద స్థిరపడింది. వెరసి రూ. 157 లాభంతో ముగిసింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు 16 శాతం అప్

జూలై 9 వరకూ రూ.4.75 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) జూలై 9వ తేదీ వరకూ 16 శాతం పెరిగి (2022–23 ఇదే కాలంతో పోల్చి) రూ.4.75 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఎకానమీ క్రియాశీలతకు ఇది ప్రతిబింబమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.18.23 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు జరగాలన్నది బడ్జెట్ లక్ష్యం. 2022–23 వసూళ్ల (రూ.16.61 లక్షల కోట్లు) ఇది 9.75 శాతం అధికం. కాగా, ఏప్రిల్ 1 నుంచి జూలై 9 మధ్య రూ.42,000 కోట్ల రిఫండ్స్ కూడా జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
11-7-2023	
విశాఖ	435–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	72.00
10-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.85

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 55వ కోర్సు(ఏప్రిల్ 2024)కు అర్హులైన అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 55
» **కేటగిరీ వారీగా ఖాళీలు:** ఎన్‌సీసీ పురుషులు-50, ఎన్‌సీసీ మహిళలు-05.
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఎన్‌సీసీ–సి సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **వయసు:** 01.01.2024 నాటికి 19 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్ట్, స్టేజ్–1, స్టేజ్–2 టెస్టులు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.08.2023.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

ఈఐఎల్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులు

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్) డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** సీఏ/సీడబ్ల్యూఏ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 47 ఏళ్లు మించకూడదు. కనీసం 19 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1.2 లక్షలు నుంచి రూ.2.8 లక్షలు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2023.
» **వెబ్‌సైట్:** www.engineersindia.com

హెచ్‌సీఎల్, బాలాఘట్‌లో 184 అప్రెంటిస్‌లు

మధ్యప్రదేశ్ బాలాఘట్‌లోని హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్(హెచ్‌సీఎల్).. ఆధ్వర్యంలోని మలాంజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్ కోసం అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 184
» **ట్రేడులు:**మేట్,బ్లాస్టర్, ఫిట్టర్,టర్నర్,వెల్డర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, సర్వేయర్, మాసన్, హార్టికల్చర్ అసిస్టెంట్ తదితరాలు.
» **విభాగాలు:** మైన్స్, డీజిల్, గ్యాస్, ఎలక్ట్రిక్, సివిల్, మెకానికల్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పదో తరగతి/10+2/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెరిట్, ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా ఎంపికచేస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2023.
» **వెబ్‌సైట్:** www.hindustancopper.com

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో 55 అప్రెంటిస్‌లు

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్.. గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 55
» **విభాగాలు:** కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్,ఇన్‌స్ట్రుమెంటేషన్–కంట్రోల్ ఇంజనీరింగ్.

అర్హత

» **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
స్టైపెండ్: నెలకు రూ.10,500 చెల్లిస్తారు.
» **టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
స్టైపెండ్: నెలకు రూ.9400 చెల్లిస్తారు.
» **అప్రెంటిస్‌షిప్ వ్యవధి:** ఒక ఏడాది.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.08.2023.
» **వెబ్‌సైట్:** www.ipr.res.in

ఎండీఎస్‌ఎల్, ముంబైలో 466 ట్రేడ్ అప్రెంటిస్‌లు

ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్.. వివిధ ట్రేడ్‌లలో ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 466
» **ట్రేడుల వివరాలు:** డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్ తదితరాలు.
» **అర్హత:** ఖాళీలని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.07.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** ఆగస్టు 2023.
» **వెబ్‌సైట్:** www.mazagondock.in

ఇంటర్‌తోనే.. బీఈడీలో ప్రవేశం

» నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)
» ఈ ఏడాది నుంచి జాతీయ స్థాయిలో ప్రారంభం
» దేశవ్యాప్తంగా 42 యూనివర్సిటీల్లో మొత్తం 3950 సీట్లు
» నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) ఆధారంగా ప్రవేశాలు
» 2023-24కు తొలి ఎన్‌సీఈటీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

కొత్తగా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్(ఐటీఈపీ) ప్రారంభమైంది! ఈ ఏడాది నుంచి జాతీయ స్థాయిలో 42 విద్యాసంస్థల్లో ఈ కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నారు. అందుకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ)ను నిర్వహించనుంది. తాజాగా.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌సీఈటీ 2023 దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీఈటీ వివరాలు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ ప్రాధాన్యత, ప్రవేశం కల్పించనున్న ఇన్‌స్టిట్యూట్స్ తదితర వివరాలు..

దేశంలో ఉపాధ్యాయ విద్యను పర్యవేక్షిస్తున్న సంస్థ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు.. ఇంటిగ్రేటెడ్ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పేరుతో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు ఐఐటీలు, నిట్‌లు, ఆర్‌ఐఈలు సహా పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ముందుకొచ్చాయి.

అర్హతలు

ఈ కొత్త ప్రోగ్రామ్‌లో భాగంగా బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకామ్ బీఈడీ అందించనున్నారు. దీనికి దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ బీఈడీలో చేరాలనుకునే అభ్యర్థులు ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో, బీకాం బీఈడీలో చేరాలనుకునే విద్యార్థులు ఇంటర్ సీఈసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

42 ఇన్‌స్టిట్యూట్స్.. 3950 సీట్లు

- ఎన్‌టీఏ సమాచారం ప్రకారం–ఎన్‌సీఈటీ స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలోని 42 విద్యాసంస్థలు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశం కల్పించనున్నాయి. ఈ ఇన్‌స్టిట్యూట్స్‌లో మొత్తం 3950 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలంగాణలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ బీఈడీ(50 సీట్లు), బీఎస్సీ బీఈడీ(50 సీట్లు), బీకాం బీఈడీ(50 సీట్లు); గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్–లక్సెట్టిపేట మంచిర్యాలలో బీఏ బీఈడీలో 50 సీట్లు ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి జాతీయ సంస్కృత విద్యాలయం–తిరుపతిలో బీఏ బీఈడీలో 50 సీట్లు; డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ -ఎచ్చెర్లలో బీఏ బీఈడీలో 50 సీట్లు; బీఎస్సీ బీఈడీలో 50సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయి.

ఎన్‌ఐటీలు, ఐఐటీల్లోనూ

సాంకేతిక విద్యకు కేరాఫ్‌గా భావించే ఎన్‌ఐటీలు, ఐఐటీలు కూడా ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశం కల్పిస్తుండటం విశేషం. ఎన్‌ఐటీ–కాలికట్, ఎన్‌ఐటీ–వరంగల్, ఎన్‌ఐటీ–పుదుచ్చేరిలతోపాటు ఐఐటీ–ఖరగ్‌పూర్ బీఎస్సీ బీఈడీ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు చొప్పున అడ్మిషన్ కల్పించనున్నాయి.

ఎన్‌సీఈటీ.. నాలుగు విభాగాలు

- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎన్‌సీఈటీ పరీక్షలో నాలుగు విభాగాలు ఉంటాయి. ఆ వివరాలు..
- **విభాగం–1:** ఈ విభాగంలో రెండు లాంగ్వేజ్‌ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో లాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఎన్‌టీఏ పేర్కొన్న 33 లాంగ్వేజ్‌లలో ఏవైనా రెండు లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- **విభాగం–2: డొమైన్ సంబంధిత సబ్జెక్ట్:** ఈ విభాగంలో మొత్తం 26 డొమైన్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. అభ్యర్థులు తమ ఆసక్తికి అనుగుణంగా మూడు డొమైన్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- **విభాగం–3: టీచింగ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగంలో 20 ప్రశ్నలు ఉంటాయి.
- **విభాగం–4: జనరల్ టెస్ట్:** ఈ విభాగంలో 25 ప్రశ్నలు అడుగుతారు.
- మొత్తంగా 160 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు. అదే విధంగా ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.



ఎన్‌టీఏ ఎన్‌సీఈటీ 2023

పదమూడు భాషల్లో పరీక్ష

ఎన్‌సీఈటీని.. ఇంగ్లిష్, హిందీతోపాటు మరో 13 భాషల్లో నిర్వహించనున్నారు. ఏపీ, తెలంగాణ అభ్యర్థులు ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూలలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

స్కోర్ ఆధారంగా దరఖాస్తు

ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్ ఆధారంగా ఆయా యూనివర్సిటీలు /ఇన్‌స్టిట్యూట్స్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత దశలో సదరు ఇన్‌స్టిట్యూట్స్ అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులు, ప్రవేశ పరీక్ష స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తాయి.

బెస్ట్ స్కోర్‌కు మార్గాలివే

లాంగ్వేజ్ టెస్ట్

మొత్తం రెండు లాంగ్వేజ్‌లలో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ లాంగ్వేజ్ టెస్ట్‌లలో మెరుగైన స్కోర్‌కు అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలకు సంబంధించి గ్రామర్, కాంప్రహెన్షన్, వాక్య నిర్మాణం , సాహిత్యం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి.

డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్

అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌ల ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ఇంటర్మీడియెట్, పదో తరగతి స్థాయి అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి. విద్యార్థులు తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌లలోని ముఖ్యమైన ఫార్ములాలు,అప్లికేషన్స్,సిద్ధాంతాలు, నిర్వచనాలు, భావనలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా బీఎస్సీ బీఈడీ అభ్యర్థులు సైన్స్, మ్యాథ్స్‌లలోని ముఖ్యమైన కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ టెస్ట్

ఈ విభాగం కోసం హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్–డీ కోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై పట్టు సాధించాలి.

టీచింగ్ ఆప్టిట్యూడ్

బీఈడీ ప్రవేశ పరీక్షల్లో ఎంతో కీలకంగా నిలిచే ఈ విభాగంలో మంచి మార్కుల కోసం విద్యా దృక్పథాలు, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, శిశు వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పెడగాజీకి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి.

ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. అదే విధంగా నూతన విద్యా విధానం–ఉద్దేశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూన్ 26– జూలై 19, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** జూలై 20 – జూలై 21, 2023
- **పరీక్ష కేంద్రాల కేటాయింపు:** జూలై 26, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు నుంచి;
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చిత్తూరు, గూడూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం , మహబూబ్‌నగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nta.ac.in, https://ncet.samarth.ac.in



అంబేడ్కర్ వర్సిటీ వెబ్ రేడియో, మొబైల్ యాప్ ప్రారంభం

బంజారాహిల్స్: విద్యార్థులకు మరిన్ని సేవలు అందించే లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెబ్ రేడియో, మొబైల్ యాప్‌లను రూపొందించింది. ఈ సేవలను ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెబ్ రేడియో, మొబైల్ యాప్‌లతో పాలనలో పారదర్శకత మెరుగు పడుతుందన్నారు. రికార్డ్ చేసిన పాఠాలు వెబ్‌లో అందుబాటులో ఉంటాయని, విద్యార్థులకు సమయం దొరికినప్పుడల్లా వీటిని వినొచ్చని చెప్పారు. మొబైల్ యాప్ ద్వారా అన్ని నోటిఫికేషన్ల వివరాలు, అడ్మిషన్ల తేదీలు, పరీక్షల తేదీలు, ఫలితాలు సత్వరమే అందుతాయని వెల్లడించారు. ఈ వెబ్ రేడియోను యాక్సెస్ చేయడానికి యూనివర్సిటీ వెబ్‌సైట్ www.braou.ac.inకి లాగిన్ అవ్వాలని, మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

కేంద్ర కార్యదర్శులను కోరిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: తెలంగాణలోని పలు అభివృద్ధి పథకాలకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి పలువురు కేంద్ర కార్యదర్శులను కోరారు. సోమవారం ఆమె ఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి లీలా నందన్, రహదారులు, రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్ట్‌లకు అనుమతులను జారీ చేయాలని కోరారు. ప్రధానంగా హైదరాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి కండ్లకోయ ఓఆర్ఆర్ వరకు, ప్యారడైజ్ నుంచి కరీంనగర్, రామగుండం మార్గంలోని ఓఆర్ఆర్ వరకు నిర్మించతలపెట్టిన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి, అదే విధంగా మెహిదీపట్నం జంక్షన్‌లో ప్రతిపాదిత స్కై-వాక్ నిర్మాణ పనులకు అవసరమైన 150.39 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు చేయాలని సీఎస్ శాంతికుమారి, రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్‌ను కోరారు. రక్షణ శాఖ భూములకు సరిపడా ప్రత్యామ్నాయ భూములను కూడా అందిస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. సీఎస్ విజ్ఞప్తిపై రక్షణ శాఖ కార్యదర్శి స్పందిస్తూ, ఈ విషయంలో వివరాలను తెప్పించుకొని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

60 ప్రతిపాదనలకు ఆమోదం తెలపండి..

అనంతరం, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి లీలా నందన్‌తో సీఎస్ శాంతికుమారి సమావేశమై, జాతీయ వన్య ప్రాణి సంరక్షణ బోర్డు వద్ద పెండింగ్‌లో ఉన్న 60 ప్రతిపాదనలకు ఆమోదం తెలపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో భేటీ అయిన సందర్భంగా రాష్ట్రంలో రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం పనులకు సంబంధించి పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

లాకప్‌లో కొక్కొరోకో

జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో రెండురోజులుగా కోడిపుంజు



నిందితులు ఉండాల్సిన పోలీస్ లాకప్‌లో ఓ కోడిపుంజు కొక్కొరొకో అంటూ కూతపెడుతున్న వింత సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బూరెడ్డిపల్లిలో కొన్నిరోజులుగా గుర్తు తెలియనివ్యక్తులు కోళ్లను ఎత్తుకెళ్తున్నారు. జడ్చర్లలో నివాసం ఉంటున్న ఓ పోలీసు అధికారి పెంచుకుంటున్న కోళ్లు కూడా అపహరణకు గురికావడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. సీఐ రమేశ్‌బాబు ఆదేశాల మేరకు సిబ్బంది అప్రమత్తమై ఆ ప్రాంతంలో నిఘా పెట్టారు. రెండు రోజుల క్రితం ఓ బాలుడు కోడి పుంజు ఎత్తుకెళ్తుండగా పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. లాకప్‌లో పెట్టి దాని బాగోగులు చూసుకుంటుండటం గమనార్హం. కోడిపుంజు యజమానిని గుర్తించి త్వరలోనే అప్పగిస్తామని సీఐ తెలిపారు. – జడ్చర్ల



ఈసారి విస్తారంగా వానలు

- రంగంలో భవిష్యవాణిని వినిపించిన అమ్మవారు
- ముగిసిన ఉజ్జయినీ మహంకాళి బోనాలు

రాంగోపాల్‌పేట్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సోమవారం అంగరంగ వైభవంగా ముగిసింది. రెండవ రోజు కూడా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో రెండవ ఘట్టమైన రంగంలో భవిష్యవాణిని స్వర్ణలత వినిపించారు. ఉదయం 9.30 గంటల సమయంలో అమ్మవారి గర్భగుడికి ఎదురుగా ఉండే మాతంగేశ్వరీ గుడి ముందు పచ్చికుండపై నిలబడిన స్వర్ణలత ''కాస్త ఆలస్యం అయినా రాష్ట్రంలో విస్తారంగా వానలు కురుస్తాయి. అందరినీ సల్లంగ చూసే బాధ్యత నాది, భక్తులు చేసిన పూజతో నేను సంతోషంగా ఉన్నాను'' అంటూ రంగం చెప్పారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొనగా, వేలాదిమంది భక్తులు అమ్మవారి నోటి నుంచి వచ్చే వాక్కును ఆసక్తిగా విన్నారు. భవిష్యవాణి అనంతరం అంబారీపై అమ్మవారి ఊరేగింపు, సాగనంపుతో బోనాలు ముగిశాయి. ఈ సందర్భంగా పోతరాజులు చేసిన వీరంగాలు భక్తులను అలరించాయి.

నగరాలు.. నిండుతున్నాయ్!

విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం పల్లెల నుంచి నగర బాట

- వచ్చే రెండేళ్లలో 50శాతం జనం పట్టణాలు, నగరాల్లోనే..
- ప్రపంచ టాప్-35 మహా నగరాల్లోకి హైదరాబాద్
- రాష్ట్రంలో జాతీయ సగటును దాటేసిన అర్బన్ జనాభా
- వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్
- సదుపాయాలకు 'మాస్టర్‌ప్లాన్' కావాలన్న నిపుణులు



అవకాశాల కల్పన, హక్కుల పరిరక్షణ, సుస్థిర భవిష్యత్..

ఈ మూడు అంశాలే ప్రధాన ఎజెండాగా ముందుకు వెళ్లాలని ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి (2023, జూలై 11) ప్రపంచానికి పిలుపునిచ్చింది. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికల రూపకల్పన, సౌకర్యాల కల్పన వంటివి జనాభా పెరుగుదల సగటు కంటే వేగంగా జరగాలని కూడా నిర్దేశించింది.

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణలో పట్టణీకరణ చాలా వేగంగా జరుగుతోంది. విద్య, ఉద్యోగం, ఉపాధి ఏదైనా జనం పట్టణాలు, నగరాల వైపే చూస్తున్నారు. క్రమంగా వలస బాట పడుతున్నారు. దీనితో తెలంగాణలో పట్టణ జనాభా శాతం ఏడాదికేడాది పెరిగిపోతూ వస్తోంది. వచ్చే రెండేళ్లలో తెలంగాణ జనాభాలో సగానికి పైగా పట్టణాలు, నగరాల్లోనే ఉంటారని 'నేషనల్ పాపులేషన్ రిపోర్ట్-2023' అంచనా వేసింది. అర్బన్ జనాభా శాతం జాతీయ సగటు కంటే.. తెలంగాణలో 12 శాతం అధికంగా ఉంది. గత తొమ్మిదేళ్లలోనే ఏకంగా 8.61శాతం జనం పల్లెలను విడిచి పట్టణాలకు చేరారు. ఇది వచ్చే రెండేళ్లలో మరింత పెరుగుతుందని.. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ నగరాల్లో పెరుగుదల రేటు భారీగా ఉండొచ్చని అంచనా వేశారు. హైదరాబాద్ మహానగర జనాభా వచ్చే రెండేళ్లలో కోటికి మించిపోతుందని, ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన టాప్-35 మహా నగరాల జాబితాలో చేరుతుందని పేర్కొంటున్నారు. వరంగల్ నగరం పది లక్షలు, ఆపై జనాభా ఉన్న నగరాల జాబితాలో చేరుతుందని అంటున్నారు.

అవకాశాలు, భవిష్యత్తే అసలు సమస్య


తెలంగాణ జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలు, బిహార్, యూపీ వంటి ఉత్తర భారత రాష్ట్రాలు, పలు ఈశాన్య రాష్ట్రాల వారు కూడా ఉపాధి వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వస్తున్నారు. ఇలా వేగంగా జరుగుతున్న పట్టణీకరణతో మౌలిక సదుపాయాల సమస్య తలెత్తుతోంది. భారీగా పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా సదుపాయాల కల్పన వేగం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రజారవాణాలో వ్యక్తిగత వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోవటం ట్రాఫిక్ ఇబ్బందులకు దారి తీస్తోంది. విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూగర్భ, వరద నీటి ప్రవాహ డ్రైనేజీలు లేక, ఉన్నవాటిని ఆధునీకరించక సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాలు పడినప్పుడల్లా నగరం స్తంభించిపోయే పరిస్థితి నెలకొంటోంది. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లోని 1,476 మురికివాడల్లో ఉన్న పది లక్షల మందికిపైగా ప్రజలు గౌరవ ప్రద నివాసాలకు నోచుకోలేదని.. ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లను సిద్ధం చేసినా దరఖాస్తుదారులు పదిలక్షలకు పైగానే ఉన్నారని ప్రజా సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ నగరాల్లో స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల కింద చేపట్టిన పనులు ఐదేళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి.

నగరాల స్పీడ్, వసతులు ఇలా..

ప్రస్తుతం దేశ జనాభాలో 35.1 శాతం అర్బన్ జనాభా ఉంటే.. తెలంగాణలో ఇది 47.6 శాతం. 2036 నాటికి అర్బన్ జనాభా జాతీయ స్థాయిలో 39.1 శాతానికి చేరితే.. తెలంగాణలో 57.3 శాతానికి పెరుగుతుందని అంచనా. తెలంగాణలో అర్బన్ జనాభా దేశంలోనే అత్యధికంగా 18శాతం పెరుగుతుందని పాపులేషన్ రిపోర్టులో పేర్కొన్నారు.

తెలంగాణలో 2014లో అర్బన్ పాపులేషన్ 39శాతం కాగా.. 2023 చివరి నాటికి 47.61శాతానికి, 2025 నాటికి 50శాతానికి చేరుతుందని అంచనా.

రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం గత తొమ్మిదేళ్లలో 1.21 లక్షల కోట్లను ఖర్చుచేశారు. ఈ నిధులతో భద్రమైన రహదారులు, ప్రజారవాణా, మంచినీరు, మురుగు నీటి శుద్ధి వంటి పనులు చేశారు.



సదుపాయాల కల్పనలో వేగం లేదు



తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో కూడా జనాభా పెరుగుతున్నంత వేగంగా శిక్షణ, ఉపాధి, కనీస అవసరాల కల్పన లేదు. పబ్లిక్ టాయిలెట్ల పరిస్థితి బాగాలేదు. మహిళల అభ్యున్నతికి అవసరమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు లభించటం లేదు. మహానగరం అంటే ఫ్లైఓవర్లు, సుందరీకరణ పనులు కాదు. అన్ని రకాల ప్రజలు గౌరవంగా జీవించే పరిస్థితి ఉండాలి. ఇప్పటికైనా తక్షణ ప్లానింగ్, పక్కాగా అమలు చేయడం మంచిది.

కరుణా గోపాల్, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ సిటీస్

హైదరాబాద్‌ను అత్యుత్తమ నగరంగా ..



జాతీయ సగటును మించి తెలంగాణలో పట్టణ జనాభా పెరుగుతోంది. ఈ దిశగా ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేలా సౌకర్యాలు సమకూరుస్తున్నాం. రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లలో నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసం రూ.1.21 లక్షల కోట్ల వ్యయం చేశాం. హైదరాబాద్‌ను పర్యావరణ అనుకూల, స్థిరమైన నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, రామగుండం తదితర నగరాల్లోనూ విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాం.

అరవింద్‌కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మున్సిపల్-పట్టణాభివృద్ధిశాఖ

మాస్టర్ ప్లాన్లు తక్షణ అవసరం



తెలంగాణలో నగరాలు, పట్టణాలు జనంతో నిండిపోతున్నంత వేగంగా మౌలిక సదుపాయాల కల్పన జరగటం లేదు. హైదరాబాద్‌లో అయితే సహజసిద్ధ వనరులన్నీ ధ్వంసం అవుతున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలనీలు, అపార్ట్‌మెంట్ల సెల్లార్లు నీట మునుగుతున్నాయి. చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాల పాలవడమే దీనికి కారణం. హైదరాబాద్‌కు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇచ్చిన ప్లాన్ తప్ప కొత్త ప్లాన్ తీసుకురాలేదు. కొత్త ప్లాన్ తక్షణ అవసరం.

పి.తిమ్మారెడ్డి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ మాజీ డైరెక్టర్

తెలంగాణ జనాభా 4.10 కోట్లు

ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ వెల్లడి

- రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.6
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం
- కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జనాభా ప్రస్తుతం 4.10 కోట్లు అని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. నీతి ఆయోగ్ అంచనా ప్రకారం తెలంగాణ సంతానోత్పత్తి రేటు 1.6గా అంచనా వేసినట్టు తెలిపింది. జూలై 11 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో సత్కరిస్తామని తెలిపింది. స్వాతంత్ర అమృత మహోత్సవాల సందర్భంగా కుటుంబ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయాలని ఆ శాఖ కోరింది.

రెండు విడతలుగా పక్షోత్సవాలు

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతలుగా పక్షోత్సవాలు నిర్వహిస్తారు. మొదటి పక్షోత్సవం ఈ నెల 27 నుండి జూలై 10వ తేదీ వరకు, రెండో పక్షోత్సవం జూలై 11 నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహిస్తారు. మొదటి పక్షం రోజుల్లో జనాభా పెరుగుదల, దానివల్ల కలిగే అనర్థాల గురించి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండో పక్షోత్సవంలో కోవిడ్ నిబంధనలను అమలు చేస్తూ తాత్కాలిక పద్ధతులు, కుటుంబ నియంత్రణకు శాశ్వత పద్ధతులతో క్యాంప్‌లు నిర్వహిస్తారు.

కాపర్-టీపై అవగాహన

ఈ క్యాంపుల్లో అర్హులైన పురుషులకు వేసెక్టమీ, స్త్రీలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేస్తారు. ప్రసవం అయిన 48 గంటల్లో వేసే కాపర్-టి గురించి అవగాహన కల్పిస్తారు. ఈ కాపర్-టి 10 సంవత్సరాల వరకు కూడా పని చేస్తుంది. దీనివల్ల బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం ఉండటమే కాక అధిక ప్రమాదం గల గర్భములను, మాతృ మరణాలను నివారించవచ్చు. ఈ సేవలన్నీ ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా లభిస్తాయని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

వేసెక్టమీ, ట్యూబెక్టమీ చేయించుకున్న వారికి నగదు ప్రోత్సాహకాలు

శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు అయిన వేసెక్టమీ, ట్యూబెక్టమీ చేయించుకున్న వారికి, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన అంతర ఇంజెక్షన్ వేయించుకున్న వారికి నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. గతేడాది ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకున్న స్త్రీల సంఖ్య 1,14,141, వేసెక్టమీ ఆపరేషన్లు చేయించుకున్న పురుషుల సంఖ్య 3,229 అని ఆరోగ్య కుటుంబ సంక్షేమ అదనపు సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు.

'కారు' చౌకగా 11 ఎకరాలా?

- హైకోర్టులో పిల్ దాఖలు చేసిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్
- బీఆర్ఎస్‌కు భూ కేటాయింపు జీవోను కొట్టివేయాలని హైకోర్టుకు వినతి



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట సర్వే నంబర్ 239, 240లో అత్యంత విలువైన 11 ఎకరాల భూమిని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి రాష్ట్ర ప్రభుత్వం ఎలా కేటాయిస్తుందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌జీవో) కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ఆయన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 'ప్రజా నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలకు శిక్షణ ఇచ్చేందుకు 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్' ఏర్పాటు చేస్తామని.. దీని కోసం 11 ఎకరాలను కేటాయించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.50 కోట్లు ఎకరం మార్కెట్ విలువైన స్థలాన్ని.. కేవలం ఎకరం రూ.3,41,25,000కే ముట్టజెప్పేందుకు అంగీకరించింది. అధికారంలో మనమే ఉన్నాం కదా.. అని తమ పార్టీకి ఇష్టారాజ్యంగా భూమి కేటాయించి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడింది. పూర్తి కేటాయింపు జరిగే వరకు మీడియాకు, ఇతరులకు తెలియకుండా గోప్యంగా వ్యవహరించింది. మే 12న ప్రతిపాదన.. మే 16న కలెక్టర్ అనుమతి... మే 17న సీసీఎల్ఏ అనుకూల నివేదిక.. ఈ తర్వాత ఒకరోజులో తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ(టీఎస్ఎల్ఎంఏ) మిగతా తతంగాన్ని పూర్తి చేసింది. అనంతరం కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిపాదన నుంచి కేటాయింపు వరకు సాధారణంగా నాలుగైదు నెలలు పట్టే తతంగమంతా కేవలం 5 రోజుల్లో ముగించారు' అని పిటిషన్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై త్వరలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

కేసీఆర్ సారు సల్లంగుండాలె బిడ్డా..



మల్యాల(చొప్పదండి): 'ఇంటింటికీ పింఛన్లు ఇచ్చుకుంట.. మాకు ధీముగా ఉన్న కేసీఆర్ సారు సల్లంగుండాలె బిడ్డా..'అని రోడ్డు వెంట మక్కకంకులు కాల్చి విక్రయిస్తున్న ఓ మహిళ వ్యాఖ్యానించింది. ఎమ్మెల్సీ కవిత జగిత్యాల పర్యటన ముగించుకుని తిరుగుప్రయాణంలో మల్యాల మండలం నూకపల్లి శివారులో కాసేపు ఆగారు. అక్కడే మక్కకంకులు అమ్ముతున్న ఓ మహిళ వద్దకు వెళ్లి వాటిని కొనుగోలు చేశారు. ఆమెతో మాటలు కలుపుతూ, కంకులు తింటూ సీఎం కేసీఆర్ పాలనపై కవిత ఆరా తీశారు. అయితే, తనకే కాదు ఇంటింటికీ పింఛన్ వస్తోందని ఆ మహిళ సంతోషంగా చెప్పింది. 'కేసీఆర్ సారు పదికాలాలు సల్లంగుండాలె'అని దీవించింది. సీఎం కేసీఆర్ కూతురు కవిత తన వద్దకు వచ్చి కంకులు కొనుగోలు చేయడం చాలా సంతోషంగా ఉందని ఉబ్బితబ్బిబ్బయింది. ఎమ్మెల్సీ కవితను చూసి వచ్చిన స్థానికులు ఆమెతో సెల్ఫీలు దిగారు.

టీచర్లే వండారు.. వడ్డించారు..



గీసుకొండ: పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టాల్సిన పరిస్థితి వరంగల్‌లోని ఓ పాఠశాలలో ఏర్పడింది. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 100 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే.. బిల్లులు సరిగా రావడంలేదని, తాము మధ్యాహ్న భోజనం వండి, వడ్డించబోమని పొదుపు సంఘాల మహిళలు తేల్చి చెప్పారు. విద్యార్థులకు భోజనం అందించే వారు లేకపోవడంతో స్వయంగా హెచ్ఎం సుజాత, పలువురు మహిళా టీచర్లు రంగంలోకి దిగి వంట చేసి, విద్యార్థులకు వడ్డించారు.

గొర్రెలు ఇవ్వడం లేదని.. గుండు గీయించుకున్నాడు



మునుగోడు: మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా గొల్లకుర్మలకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గొర్రెలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నందుకు కుర్మ కులానికి చెందిన డోల్ దెబ్బ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలిగ యాదయ్య సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గుండు గీయించుకొని నిరసన వ్యక్తం చేశారు. రెండో విడత గొర్రెలను అర్హులకు వారం రోజుల్లో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మునుగోడు నియోజకవర్గంలోని గొల్ల, కుర్మలతో కలసి అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఇందులో యాదయ్య నిరసన వ్యక్తం చేశారు.

101 వ బర్త్‌డే.. 101మంది వారసుల సమక్షంలో..



యాచారం: 101 ఏళ్ల వృద్ధురాలికి 101 మంది వారసులు కలసి సోమవారం ఘనంగా పుట్టిన రోజు వేడుకలు జరిపారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన వట్నాల బుచ్చమ్మకు 101 వచ్చాయి. దీంతో ఆమె నలుగురు కూతుళ్లు, నలుగురు అల్లుల్లు, కొడుకు, కోడలుతో పాటు మొత్తం 101 మంది వారసులు బుచ్చమ్మకు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.వారసులంతా తరలిరావటంతో పండుగ వాతావరణం నెలకొంది. 50 ఏళ్లు దాటితేనే మనుషులు రోగాల బారినపడి ఇబ్బందులుపడుతున్న ఈ రోజుల్లో బుచ్చమ్మ 101 ఏళ్లు బతకడం సంతోషంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

సర్కారు స్కూలుకు హిమాన్షు చేయూత





గచ్చిబౌలి: పెద్ద సారు మనవడు ఓ ప్రభుత్వ పాఠశాలకు చేయూతనిచ్చారు. దీనావస్థలో ఉన్న బడి రూపురేఖలు మార్చివేశారు. దీంతో ఆ పాఠశాల ఇప్పుడు కార్పొరేట్ కళను సంతరించుకుంది.ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌బస్తీ ప్రభుత్వ పాఠశాలను తరచూ సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడేవారు. పేద విద్యార్థులు చదివే ఈ పాఠశాల పరిస్థితిని గమనించి దత్తత తీసుకున్నారు. హిమాన్షు తాను చదివిన ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో సీఏఎస్ కార్యక్రమానికి అధ్యక్షుడిగా సేకరించిన నిధులతో ఆ ప్రభుత్వ పాఠశాలను అత్యాధునికంగా అభివృద్ధి చేశారు. హిమాన్షు చొరవ, చేయూతతో కోటి రూపాయల వరకు ఖర్చు చేసి బెంచీలు, మరుగుదొడ్లు, డైనింగ్ గది, ఆటస్థలాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుయాదవ్ తెలిపారు. అభివృద్ధి చేసిన ఈ పాఠశాలను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.